వియత్నాం, కాంబోడియా ప్రజల ఎర్రెర్రని విజయాలకు లాల్ సలామ్!

సృజన


మేడే ప్రత్యేక సంచిక

68

లోపలి పేజీల్లో...

జననాట్యమండలితో
సృజన ఇంటర్వ్యూ,

ప్రపంచ తెలుగు మహాసభలు,
సామాన్యుని సందేహం - సమీక్ష-



2 రూపాయలు

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

68

వేమన ప్రత్యేక సంచిక

సృజన చందాదారులుగా చేరండి

సృజన మీ పత్రిక. పీడిత ప్రజల పత్రిక. పేపర్ మరియు ప్రింటింగ్ ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో సృజనలాంటి ప్రతికలు ఆర్థికంగా చాల కష్టాల ఎదుర్కొంటవి. వెంటనే తాము చందాదారులుగా చేరి, తమ మిత్రులను చేర్పించటంద్వారా, విరివిగా విరాళాలు అందించడంద్వారా విప్లవ సాహిత్యవేదిక 'సృజన'ను నిలబెట్టుకోవాల్సిందిగా కోరుతున్నాం.

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

ముఖచిత్రం: యూజీన్ పొట్టియర్
(అంతర్జాతీయగీతం రచయిత)

2 రూపాయలు

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)

మేడే చిరకాలం వర్ధిల్లుగాక

కామ్రేడ్స్!

గత శతాబ్దంలోనే అన్ని దేశాలకుచెందిన కార్మికులు యీ 'మే' ఒకటవతేదీని ఉత్సవంగా జరుపుకోవాలని తీర్మానించుకున్నారు. అది 1889. అన్ని దేశాల సోషలిస్టుల సమావేశంలో కార్మికులు ప్రకటించారు. సరిగ్గా ఇదేరోజు—మే నెలలో మొదటిరోజు ప్రకృతి తన చలినిద్రనుండి మేల్కొంటున్నవేళ. అడవులూ, పర్వతాలు ఆకుపచ్చగా మెరుస్తున్నవేళ, పొలాలు, పచ్చికబయళ్లు పువ్వులతో అలంకరించుకుంటున్న వేళ, సూర్యుడు మరింత వెచ్చగా ప్రకాశిస్తున్నవేళ, గాలిని పునర్జీవన ఆనందం పరవశింపచేస్తున్నవేళ, ప్రకృతి సంతోషంలో మైమరచి నాట్యంచేస్తున్నవేళ, సరిగ్గా యిదే రోజు కార్మికులు బిగ్గరగా బహిరంగంగా మొత్తం ప్రపంచానికి ప్రకటించడానికి తీర్మానించుకొన్నారు— ఏమని? మానవజాతికి కార్మికవర్గం వసంతాన్ని తేబోతున్నదని, పెట్టుబడిదారీ సంకెళ్ళనుండి విముక్తి తేబోతున్నదని, ప్రపంచాన్ని స్వాతంత్ర్యం, సామ్యవాదం పునాదులమీద పునర్వికసింపచేయడమే కార్మికుల లక్ష్యమని—

ప్రతి వర్గానికీ దానికిష్టమైన పండుగలుంటయి. సంపన్నులు (The Nobility) తమ తమ పండుగలను ప్రవేశపెట్టారు. వాటి పేరుమీద రైతాంగాన్నిదోచుకునే తమ "హక్కు" ప్రకటించుకున్నారు. బూర్జువాలకు వాళ్ళ పండుగలున్నాయి— వాటి పేరుమీద కార్మికులను కొల్లగొట్టే తమహక్కును "సమర్థించుకున్నారు"— చట్టబద్ధంచేశారు. మతాచార్యులకుకూడ వారివారి పండుగలున్నాయి. వాటి పేరుమీద కష్టజీవులు పేదరికంలో మరణిస్తూ, సోమరులు సుఖసౌఖ్యాల్లో ఓలలాడుతున్న ఈ వ్యవస్థను పొగుడుతారు.

కార్మికులకుకూడ వారి పండుగ ఉండాలి— ఆ పండుగరోజు వాళ్ళిలా ప్రకటించాలి "సర్వజనీనమైన శ్రమ, సర్వవ్యాపకమైన స్వాతంత్ర్యం మానవులందరికీ సర్వజనీనమైన సమానత్వం. ఆ పండుగే మేడే పండుగ— 'మనం బంగారు నందిని పూజించం', మనం బూర్జువాల, దోపిడీదార్ల సామ్రాజ్యాన్ని కోరడంలేదు. పేదరికం భయోత్పాతాన్నీ, రక్తపాతాన్నీ సృష్టిస్తున్న పెట్టుబడిదారీవ్యవస్థ నాశనంకావాలి! చచ్చిపోవాలి! కార్మికులరాజ్యం చిరకాలం వర్ధిల్లుగాక!"

ఇదే ఈ రోజున వర్గచైతన్యంగల సకలదేశ కార్మికులు ప్రకటిస్తున్నారు.

(రష్యన్ సోషలిస్టు డెమొక్రటిక్ లేబర్ పార్టీ (కమ్యూనిస్టుపార్టీ) కేంద్ర కమిటీ కరపత్రం నుంచి. రచన: జె.వి. స్టాలిన్ 1912)

సంపాదకీయం :

ఎర్రజెండా యింత ఎరుపేమిటని అడుగ
సత్యం రక్తంతో తడిసెనని చెప్పాలి

అమెరికాలో చికాగో నగరంలో పనిగంటలు సాధించుకోడానికి కార్మికులు చేసిన పోరాటంలో చిందిన నెత్తురుతో ఎగిరేసిన ఎర్రజెండా మేడే. ఆనాటినుండి యీనాటి దాకా దేశదేశాల్లో ప్రజల పోరాటాలతో, త్యాగాలతో మరింత ఎరుపెక్కి తూరుపు దిక్కును, ఆకాశాన్ని, ప్రజాజీవితాలను వెలిగిస్తున్నది ఎర్రజెండా. ఆనాడు పోరాడిన కార్మికుల రక్తంలో తడిసి ఎగిరిన జెండా ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ జెండాగా, కార్మిక కర్షక ఐక్యతకు, కార్మికవర్గ నియంతృత్వానికి, కష్టజీవులపార్టీ అయిన కమ్యూనిస్టుపార్టీకి గుర్తుగా ఎగురుతున్నది. ఈ జెండాను సృష్టించిన కార్మికులనెత్తురు వృధాపోలేదని చరిత్ర అడుగడుగునా ఋజువుచేస్తున్నది.

కొన్నిచోట్ల, ఒకమేరకు కార్మికుల పనిగంటలు సాధించుకున్నారు. ఎర్రజెండా పని పూర్తికాలేదు.

అక్టోబర్ విప్లవం, చైనా విప్లవం, వియత్నామ్ ప్రజల విజయం ఎర్రజెండా కిందనే పొందిన పోరాటఫలితాలు. ఈ ప్రజల పోరాటాలన్నీ యీ నేలమీద నెత్తురుతో కత్తులతో రచింపబడినవే. ఇవ్వాళ అమెరికన్ సామ్రాజ్యవాదాన్నే అదరగొట్టిన కాంబోడియాప్రజలు, దక్షిణ వియత్నాం ప్రజలు, ఈగిల్(గద్ద)తో యుద్ధంచేసి గెలిచిన ఖ్మేర్ పికిలిపిట్టలు, ప్రజల పోరాట ఊపిరితో ఎగురుతున్న ఎర్రజెండాముందు సామ్రాజ్యవాదం అనే కాగితంపులి ఎట్లా కళ్ళు తేలవేసి నీరుకారిపోతుందో తాజాగా నిరూపించారు. దక్షిణ వియత్నామ్ విప్లవ ప్రభుత్వం సైగాన్‌లో మేడేనాడు విజయోత్సాహంతో అరుణపతాకాన్ని ఎగిరేసింది. ఇది ఎవ్వరైనా ముందుగానే వూహించగల గతితార్కిక చారిత్రక జోస్యం. సామ్రాజ్యవాదం చాపకిందికి నీళ్ళవలె విప్లవ జ్వాలలు వ్యాపిస్తున్న దశలో మేడే వచ్చింది.

భారత దేశంలోను పీడితప్రజలకు మేడే ఒక ఆశాజ్యోతిని అందించింది. నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం రగిలించిన నిప్పురవ్వ శ్రీకాకుళంలో కోరన్న, మంగన్న త్యాగరక్తంలో రగుల్కొని 1969 ఏప్రిల్ 22 న కమ్యూనిస్టుపార్టీ (మా-లె) గా ఉదయించింది. విప్లవ నిర్మాణంగల బలమైన కమ్యూనిస్టుపార్టీ లేకుండా విప్లవం లేదని లెనిన్ చెప్పాడు. ఆ మార్క్సిస్టు మహోపాధ్యాయుని జన్మదినంరోజే పుట్టిన

మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీ యీ మేడేరోజే (1969) కలకత్తా నగరంలో తనను తాను భారత పీడిత ప్రజలముందు ప్రకటించుకొని సాయుధపోరాట ఎర్రజెండాను ఎగురవేసింది అనాటినుండీ భారత పీడిత ప్రజలకు మేడే ఒక అకాంక్ష మాత్రమేకాకుండా ఆయుధంగా మారింది. వేడుకగా కాక, ఇది విప్లవ సందేశంగా మారింది. పోరాడేవానిదే ఎర్ర జెండా, పోరాడేవానిదే మేడే. మేడే విప్లవించే ప్రజల పండుగ.

ఈ మేడేనాడు ఎగురవేసే యీ 'ఎర్రజెండా ఇంత ఎరుపేమిటని అడుగ' భారత పీడిత ప్రజల విముక్తికోసం ప్రాణాలర్పించిన మృతవీరుల 'రక్తంలో తడిసెననిచెప్పాలి' ఈ జెండాలోని ఎర్రదనాన్ని ఈ మేడే పోరాట స్వభావాన్ని ఆ మృతవీరుల ఆశయాలను కొనసాగిస్తూ కాపాడుకుంటామని. పోరాడుతూ పాడుకుంటామని యీ జెండాకింద ప్రతిజ్ఞ తీసుకుందాం.

చికాగో నగరంలో కార్మికులు చిందించిన రక్తంతోనే కార్మికుల పనిగంటల సమస్యలు పరిష్కారంకాలేదు. అంత చిన్న విషయానికే ఎన్నో పోరాటాలు ఎన్నో త్యాగాలు అవసరమైనవి. కాని వాళ్ళ చిందించిన రక్తం వృథాకాలేదు.

ఎర్రజెండా యివాళ మనకు పోరాటాల, త్యాగాల, ఓటమి గెలుపుల దీర్ఘకాల చరిత్రను తనలో యిముడ్చుకొని ఒకటే సందేశాన్ని వినిపిస్తున్నది. "విప్లవం విందు భోజనంకాదు, వ్యాసరచనకాదు, నిర్దాక్షిణ్యంగాసాగే వర్గపోరాటం."

ప్రపంచ కార్మికులంతా వొకే తల్లి బిడ్డలురా!
ప్రపంచ శ్రామికులంతా వొకే కొమ్మ పువ్వులురా!
పట్టణాల్లో కార్మికుడా...
పల్లెదిక్కు చూడరా!
పల్లెల్లో రగుల్కొన్న విప్లవాగ్ని విలపరా!
నీ అన్నతో, రైతన్నతో చేయిచేయి కలపరా!

తుపాకి గొట్టంద్వారే నీ రాజ్యం సిద్ధించును
తెగించు పోరాటంలో నీ స్వప్నం ఫలియించును
గ్రామాల విముక్తిచేసి పట్టణాల చుట్టుముట్టి
కార్మిక కర్షక రాజ్యం స్థాపించను సాగిరార
నవభారత జనరాజ్యం స్థాపించను వేగరార
పట్టణాల్లో కార్మికుడా...

హోచిమిన్ కవితలు మూడు

1

పగలంతా ఏటి ఒడ్డున, రాత్రి కొండగుహలో నా నివాసం
మొక్కజొన్న జావ, వెదురుకొమ్మలూ ఆహారం
అనుక్షణం అప్రమత్తత।
ఊగుతోన్న బండరాళ్ళ మేజాముందు కూర్చొని
చేస్తాను సోవియట్ పార్టీ చరిత్ర అనువాదం
ఆహా! విప్లవకారుని జీవితం ఎంతటి విలాస జీవితం!

2

కనుచూపు మేర పర్వతాలు, నదీప్రవాహాలు
వీటన్నిటికన్న మిన్న
లెనిన్ ప్రవాహం, మార్క్స్ పర్వతం
ఉత్త చేతులతో నిర్మిస్తాం ఈ దేశాన్ని

3

మన పర్వతాలు, మన నదీనదాలు, మన ప్రజలు
కలకాలం నిలుస్తారు
మట్టి కరుస్తారు అమెరికన్ దురాక్రమణదారు
పునర్నిర్మిస్తాం మన దేశాన్ని పదింతలు మరింత అందంగా.

— స్వేచ్ఛానువాదం : శివసాగర్

మేడే పాట

జ్యోతి

మేడే ఈనాడే మేడే మేడే ఈనాడే
మేడే ఈనాడే మేడే మేడే ఈనాడే

వ్యక్తి వాదపు సిద్ధాంతంతో
సమిష్టి శ్రమనూ దోచేరోజున
ఘోరపుఖండం భయంకరంగా
కార్మికరక్తం తాగేరోజున
కార్మికులంతా, కర్షకులంతా
బానిస బతుకులు బతికేరోజున
తండ్రి అంటె మరి బిడ్డకు తెలియదు
బిడ్డల పాలన తండ్రికిలేదు
సూర్యుడులేడూ- వెలుతురులేదు
ఉన్నది ఒకటే ఆరాటం
అది కూటికోసమై పోరాటం
పోరాటం, పోరాటం, పోరాటం।
కార్ఖానాల్లో, గనుల పనుల్లో
పొగగొట్టాలతొ జీవితం
తండ్రి దాపు మరి బిడ్డకు తెలియదు
బిడ్డలగోడూ తల్లికి పట్టదు
ఆకలిశోకం, దరిద్రదేవత
పెట్టుబడిదార్ల దోపిడి హత్యలూ
కార్మికవర్గం ప్రాణంతీసే
శ్రమజీవులనూ దోపిడిచేసే
చట్టాలపై తిరుగుబాటుగా
కార్మిక, శ్రామిక పోరాటం॥
ఆదిలోన ఆ పోరాటాలూ
కూటికోసమూ, కూలికోసమూ
పనిగంటల తగ్గింపుకోసమే
చరిత్రనేర్పిన గుణపాఠాలతో
కార్మికులంతా కదిలారూ
సంఘాలుగా నిలిచారు
ఫిలడల్ఫియా, బాల్టీమోర్
వాషింగ్టన్, డెట్రాయిట్
పిట్స్‌బర్గ్ మరి న్యూయార్క్‌లో
కార్మికశక్తే కదిలిందీ
కార్మిక జెండా అరుణారుణమై
బూర్జువాలనూ కూల్చింది
ఉరికంబాలను ధిక్కరిస్తు
మరి త్యాగాలను నిలబెట్టింది
జనవాహినిలో అంతర్లయగా
సామ్యవాదమే పాడింది
కార్మిక దినమే వెలసింది
మేడే మేడే నిలిచింది
మేడే మేడే వెలసింది
అరుణపతాకం ఆశాజ్యోతిగ
భారతావనిలో ఎగిరింది
కార్మికలోకం గళాలనెత్తి
పోరాటాలను చేసింది
త్యాగదీక్షతో నిలచింది
భూమికోసమూ భుక్తికోసమూ
భారతావనీ విముక్తికోసం
నక్సల్బరిలో, ముషాహరిలో
శ్రీకాకుళమూ, ఎన్నాకుళములో
సాయుధ జెండా ఎగురుతున్నది
కార్మిక, కర్షక వీరుల్లారా
విద్యార్థి నవయువకుల్లారా
విముక్తి యుద్ధం సాగించేందుకు
జనగీతాన్ని వినిపిద్దాం
జెండా ముందుకు కొనసాగిద్దాం.

అంతర్జాతీయ గీతం
(INTERNATIONAL)

మేలుకోండి పేదప్రజలార
మేలుకోండి నలుదిశల్లా
శాస్త్రమితూలు చూపిరి మార్గం
లేచిందోయ్ విముక్తి పథం
తరతరాల కుటిలాచారం
చెయ్యాలిక పూర్తి హతం
తుడిచెయ్ జన దీనాలాపం
జీవన్ - మరణమని పోరి
తుదిపోరు ఇది ఓ కామ్రేడ్స్
కలవండోయ్ యేకంగ
ఇంటర్ నేషనల్
ఒకటౌదాం - మానవులం
కలవండోయ్ యేకంగ
ఇంటల్ నేషనల్
ఒకటౌదాం - మానవులం

(మన విప్లవ సాంస్కృతిక దళాలు- కార్యక్రమం చివరకు ఈ పాటను తప్పనిసరిగా పాడాలి. అలాగే సభల్లో సమావేశాల్లో ముగింపుగా ఈ పాట పాడాలి. ఈ అంతర్జాతీయ గీతానికి మొత్తం ప్రపంచ ప్రజలు పాడుకునే ఒకే పల్లవి ఉన్నది. ఆ పల్లవిలో మాత్రమే ఈ పాటపాడాలి. ఈ పాట పల్లవిని మన కామ్రేడ్స్ ఎవరైనా సాంస్కృతిక దళాల నుడిం నేర్చుకోవచ్చు.)

ఎగురవే ఎగురవే ఎర్రెర్రజెండా

యాత్రిక్

ఎగురవే ఎగురవే ఎర్రెర్రజెండా
విప్లవోజ్వల కాంతి మా కనులనిండా
ఎగురవే ఎగురవే ఎర్రెర్రజెండా ॥ఎగురవే॥

ఏనాడు ఈనేల ఎగరేసిరోనిన్ను
కంటిలో పాపవలె సాకిరే పేదలు
నెత్తుర్లు వర్షించి పెంచిరే యోధులు ॥ఎగురవే॥

కష్టజీవులవెలుగు కష్టజీవులనెలవు
కష్టజీవులగెలుపు నీలోని ఎరుపు
కలవారికళ్ళలో గుబుల్గొను వెరుపు ॥ఎగురవే॥

నక్సల్బరీలోన నవలేసినావు
శ్రీకాకుళంలోన మొనదేలినావు
భారతాకాశాన పాకవేజెండా ॥ఎగురవే॥

ప్రజలయుద్ధం అపజయమ్మెరుగకుండా
వ్యవసాయ విప్లవం నిండుగాపండ
సాయుధ రైతాంగపథంనిండా ॥ఎగురవే॥

మృతులైనవీరుల స్వప్నాలజెండా
పోరాటయోధుల ఆయుధంజెండా
ప్రజలప్రాణంలోన ప్రాణమౌజెండా
ఎగురవే ఎగురవే ఎర్రెర్రజెండా
విప్లవోజ్వలకాంతి నలుదెసలనిండా
ఎగురవే ఎగురవే ఎర్రెర్రజెండా—

ఓరోరి అమీనోడా!

వి. బి. గద్దర్

ఓరోరి అమీనోడా
ఓరోరి సర్కిలోడా
పదిలంగ ఉండుకొడుకో
కదిలింది ఎర్రిదండు ॥ఓరోరి॥

కదిలింది ఎర్రిదండు
కదిలింది కూలిదండు
కదిలింది ప్రిజాదండు
అరె...ఖబర్దారు కొడుకో
కదిలింది ఎర్రిదండు ॥ఓరోరి॥

కాకిబట్టలోడా
కాంగ్రేసు గులాపోడా
అరె...ఖబర్దారుకొడుకో
కదిలింది ప్రిజాదండు ॥ఓరోరి॥

ఖానూను సేతబట్టి
కూలోల్ల కడుపుగొట్టి
తుపాకి సంకనేసి
తూటాల మాలదొడిగి
సైకీలు మోటరెక్కి
సారెల్లినావు కొడుకో ॥ఓరోరి॥

ఇంపైన బట్టలేసి
సొంపైన సూటుదొడిగి
కల్లుసారా బాగదాగి
కొగంత కడుపుబెంచి
మైసమ్మ పోతులాగ
మదమెక్కినావు కొడుకో ॥ఓరోరి॥

లంగల్ల లంగవోరి
దొంగల్ల దొంగవోరి
లుచ్ఛల్ల లుచ్ఛవోరి
మా పోరు కడ్డమొస్తె
కడతాము నీకు గోరి ॥ఓరోరి॥

అడ్డంగ బలిసినోడా
ఆడోల్ల జెరిసినోడా
కనబడ్డ పీరులాను
కట్టేసి కాల్చినోడా
వొట్టేసి సెప్పుతున్నా
సుట్టేసి సంపుతాము ॥ఓరోరి॥

నిన్న మొన్నదాక
నీవోలె నీల్గినాడు
మాపల్లె మిండెగాడు
పదిఊర్ల దొరగాడు
ప్రిజలదండూ జూసి
పరుగులు దీసినాడు
దొరకడ్డమొచ్చినావా
అడ్డంగ నరుకుతాము ॥ఓరోరి॥

మాపల్లె దొరగాడు
నీవెల్లె మొగడు కొడుకో
టాటాలు బిర్లగాల్లు
నీతల్లీకి మిండేలు
అమెరికా రష్యనోల్లు
నీతాత తండ్రిలారా
నీజాతి పొతంబడ్తె
బదిరింగా ఉండుకొడుకో

అద్దమోలె మెరిసెటట్లు
నీ బూట్లు తుడిసినోల్లు

గంటిలో బట్టలుత్కి
కడకిస్త్రీ జేసినోల్లు
పీకాల్ల గోల్లుదీసి
గడ్డాలుజేసినోల్లు
పెయ్యంత నూనెరాసి
మాలీసుచేసినోల్లు
పిడికిండ్లు ఎత్తినారు
పందేసి తొక్కుతారు ॥ఓరోరి॥

సమ్మెట బట్టినోళ్ళు
సమ్మెలు చేసినోళ్ళు
కవులు - కళాకార్లు
కాలేజీ పిల్లగాండ్లు
కండ్లెర్ర జేసినారు
తొడగొట్టి నిల్సినారు
మెడగొట్టి కదులుతారు ॥ఓరోరి॥

దొరకు అమీనోడు
సి. ఆర్. పి. నీకు తోడు
తర్వాత మిల్టిరోడు
ఆపైన రస్యనోడు
ఆనబ్బ అమెరికోడు
మీ కంతకల్పి కొడుకో
పోసంత బలములేదు ॥ఓరోరి॥

మా బాట ఎర్రబాట
చైనాయె ప్రజలకోట
మా దారి చారుదారి
మా శక్తి ప్రజాశక్తి
మా జండ ఎర్రజండ
అరె... ఖబర్దారు కొడుకో
కదిలింది ఎర్రదండు ॥ఓరోరి॥

శ్రీకాకుళమ్మలోన అగ్గి రగిలిందంట

కాటా నారాయణరావు

శ్రీకాకుళమ్మలోన
    అగ్గి రగిలిందంట
భుగభుగలు భగభగలు
    సెగలు కక్కిందంట
కాలువలు నెలయేళ్ళు
    ఎరుపెక్కినాయంట
కొండలూ కోనలూ
    కోఅంటె కోయంటు
నైయంటె నైయంటు
    చెంగలించాయంట ॥శ్రీకా॥

అలుగులూ పలుగులూ
    పలవరించాయంట
కత్తులూ కొడవళ్ళు
    గాలి తేలాయంట
మన్ను ఎరుపెక్కింది
    మిన్ను ఎరుపెక్కింది
మనిషిలోన గుండె
    ముదుర ఎరుపెక్కింది
మండె సూర్యుడుగూడ
    గుండె నెత్తురులాగ
నెత్తురు మంటలతో
    కొండలే నిండాయి ॥శ్రీకా॥

ఎండిన దేహాలు
    మండిన కడుపులు
దండులాగా కదిలి
    తిండిపోతుల చెండి
చండ శాసనులను
    పిండి చేశారంట
కొండకొక దండంట
    కోనకొక బంటంట
కొండలూ కోనలూ
    కోఅంటె కోయంటు
నైయంటె నైయంటు
    చెంగలించాయంట ॥శ్రీకా॥

గొడ్డువు గునపాలు
    కాడి మేడి గూడ
పనిముట్లు కనువిప్పి
    తిరగబడ్డాయంట
పస్తులతో జబ్బులతో
    అస్తుబిస్తుగ బతికి
ఆకలై మూకలై
    విప్లవించాయంట
వర్గశత్రువులను
    ఖతంచేశాయంట ॥శ్రీకా॥

నక్సల్బరీ పొలికేక
శ్రీకాకుళమ్ములో
    ఆ సీమ మలికేక
    వీర తెలంగాణలో
ఆసీమ యీసీమ
ఒక్కటై విలిచింది
    ఆ కేక యీ కేక
    ఒక్కటై పలికింది ॥శ్రీకా॥

జనసేన లేకున్న
    మనకేమి లేదవి,
గెరిల్లా దళములే
    బీజాలు సేనకవి;
దొరల పాలననింక
    కూలదోయాలన్న
కూలోళ్ళ రాజ్యాన్ని
    నిలుపుకోవాలన్న
నెలగోల సేతాడు
    బందూకు బల్లాలు
ఆజాల గోపాల
    మందుకోవాలని
        శ్రీకాకుళమ్ములోన
        అగ్గిరగిలిందంట

ఎదురు తిరిగినకాడ ఎరుపు రాజ్యమ్మేలు

రణధీర్

ఓ పెయ్యబోకురా ఓరన్నా
బతుకు తాకట్టుపెట్టకు ఓరన్నా
మూలుగుతు నువ్వుంటె
మూల్గు పీల్చిన వాల్లు

పస్తులతో చస్తుంటె
పలకరించని వాల్లు
ఓటంటు వచ్చింద్రు ఓరన్నా
నిన్ను ఏటిపాల్జేత్తారు ఓరన్నా

కావులించుకుంటరు
కొరెక్కమంటరు
నోట్ల ఎర సూపెట్టి
ఓటియ్యమంటరు
ఓడదాటిందంటె ఓరన్నా
నువ్వు బోడమల్లయ్యవే ఓరన్నా

ఎన్నికల ఖర్చంత
నీపేర రాత్తరు
వడ్డీలు గలుపుక (తోపాటు)
చెల్లించమంటరు

చెల్లించలేనంటె ఓరన్నా
ఇక చేతులకు బేడీలె కదరన్నా

ఏసింది చాలురా
ఇక ఎయ్యబోకురా
బెదురులేక నువ్వు
ఎదురుతిరిగి చూడు
ఎదురు తిరిగినకాడ
ఎరుపు రాజ్యమ్మేలు
ఓటెయ్యబోకురా ఓరన్నా
బతుకు తాకట్టుపెట్టకు ఓరన్నా.

నిజం - నిజం

ఎ.యల్. చిత్రలేఖ

నక్సలిజం నక్సలిజం - నిజం నిజం
నక్సలిజమె కమ్యునిజం " "
నక్సలిజం వినామనకు " "
లేదూ విముక్తిపథం ॥నక్స॥
నక్సల్‌బరి నలుమూలల
మిన్నునంటుకున్న మంట ॥నక్స॥
భీరు భూము ప్రాంతంలో
భగభగమని రెగిలెనంట ॥నక్స॥
తెలుగునాట వీరజాతి
శ్రీకాకుళ మవునవును ॥తెలు॥
శత్రుమూక మీదదూకి
పీకలెగురగొట్టేను ॥నక్స॥
బీహారు కేరళాలో
భీకర సమరమె జరిపిరి ॥బీహా॥
కమ్యునిష్టువర్గీసులు
కోట్లకొలది తలయెత్తిరి ॥నక్స॥
కలకత్తా మండుటెండ
నడివీధులు కరిగించెను ॥కల॥
కొత్త మనుషుల నెత్తురు
వన్నెలెన్నో కురిపించెను ॥నక్స॥
రుద్రగాన అగ్నివీణ
అరుణారుణ చరితలో ॥రుద్ర॥
తెలంగాణ గుండెల్లో
అవతరించె కల్లోలం ॥నక్స॥
మన ధ్యేయం కమ్యునిజం
భారత విముక్తిపథం ॥మన॥
సమసమాజ నిర్మాణం
ప్రగతిధార సంకేతం ॥నక్స॥

పురివిప్పిన కర్తవ్యం

జయధీర్ తిరుమలరావు

రాత్రి సగం వయస్సు దాటిపోయింది. ట్రక్కుల్లో కుక్కినపేనుల్లా ఉన్న సి.ఆర్.పి.లు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. వాళ్ళగుండెల్లో నక్కిన ఆలోచనల్లాగా భయం భయంగా సాగుతున్నాయి ట్రక్కులు.

వాళ్ళలో ఎందరో మూడేళ్ళక్రితం భార్యాబిడ్డల్ని చూసినవాళ్ళు, మూడునాళ్ళ నుండీ నిద్రముఖం చూడనోచనివాళ్ళు. తమ బ్రతుకుల్లో తీపి ఎరగకున్నా. ప్రతి కడంపై తీపిపోనివాళ్ళు.

అలవాటుప్రకారం చేతుల తుపాకుల్ని బిగించిపట్టుకున్నా, ఉన్నపాటున వారి వెన్నెముకల్లో ఏదోభయం పోటుపొడుస్తూనేవుంది. అప్పుడు కునికిపాట్లు పడుతున్న వాళ్ళెవరూలేరు. ఉండి ఉండి ఉలికిపాట్లు పడుతున్నవాళ్ళు తప్ప.

వాళ్ళకుతెల్సు తామెదుర్కోబోతున్న నక్సలైట్లు కేవలం మనుష్యులేనని, కాని వాళ్ళకిదీతెలుసు వాళ్ళకు భార్యాబిడ్డలు వున్నా లేకున్నా, ఆ బంధాలు తెంచుకొని సంఘంలోని అసమానతల్ని రూపుమాపటానికి పోరాడుతున్నారని, తామేమో బాధ్యతా బంధితులమని, పొట్టగడవటం కోసం ఈ వృత్తిని ఆశ్రయించిన వాళ్ళమని. ప్రభుత్వపుఅండ, ఆయుధబలం తమ వెనుకవున్నా తమకు ఆ నక్సలైట్లకున్న తెగింపులేదన్న సంగతి వాళ్ళకు తెలుసు.

తమ ఆ బలహీనతను వాళ్ళు, "ఆ! ఆ నక్సలైట్లు చస్తే ఏడ్చేవారెవరున్నారు లెద్దూ!" అని సరిపెట్టుకొంటున్నారు.

ఒక్కొక్కరి ఆలోచనలు పరి పరి విధాలుగా పరిభ్రమిస్తున్నా, వాళ్ళందరూ ఆకాంక్షించే దొక్కటే "ఈ గండం గడిస్తేచాలు!".

వీళ్ళ ఆలోచనల్లాగానే ట్రక్కులు రహదారివిడిచి పక్కదారిపట్టాయి.

ముందు ట్రక్కు క్యాబిన్‌లో కూర్చున్న డి. యస్. పి మల్‌హోత్రా, ఇన్‌స్పెక్టర్ రంజిత్‌సింగ్, సబ్-ఇన్‌స్పెక్టరు సుదర్శన్‌లమధ్య గంభీరంగా నడచిన సలహా సంప్రదింపులు ఐపోయాయనడానికి చిహ్నంగా వాహనాలు ఆగిపోయాయి. ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయారు.

* * *

టక్కిచ్చి వెళ్తున్న గతుకులదారివల్లనేమో సబ్-ఇన్‌స్పెక్టరు సుదర్శన్ కూడ గట్టుకొన్న ధైర్యం, ఉత్సాహం రానురాను సడలిపోయ్యాయి

అతడు తాను క్రొత్తగా ఉద్యోగంలోచేరిన రోజులగురించి ఆలోచిస్తున్నాడు... అప్పుడు తన ఆదర్శాలకొరకు న్యాయరక్షణకొరకు పదేపాట్లు సుశీలకు గర్వంగా చెప్తూ ఉండేవాడు. కాని ఇప్పుడు వాటిని ఆచరించడంలో అణగారిపోతున్న తన ఉత్సాహాన్ని చూసి తానే ఆశ్చర్యపోతున్నాడు.

అతని ఆలోచనల్లోకి సుశీల ప్రవేశించింది. "సుశీల యిప్పుడేంచేస్తూంటూంది?" బహుశా, బాబును గుండెల కదుముకొని తన క్షేమంకోసం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, నిద్రరాక పడకపై దొర్లుతుంటుంది. తానసలు ఇలాంటి సమయాల్లో సుశీలతో చెప్పి రాకూడదు. అనవసరంగా ఆమె మనశ్శాంతి కోల్పోతుందనుకుంటూనేవుంటాడు. కాని తీరా సమయానికి చెప్పకుండా రాలేడు. ఏమో ఇదే ఆఖరు కలయికేమో అనిపిస్తూంది తనకు ఎప్పటికప్పుడూ–

సుశీల తనకోసం తనవాళ్ళందరిని, అష్టయిశ్వర్యాలను వదులుకొని వచ్చింది. భగవంతుడు చిన్నచూపుచూసి నాకేదన్నా కీడు జరిగితే సుశీలకు, బాబుకు దిక్కెవరు? ఏ ప్రభుత్వపు శ్రేయస్సుకొరకు ప్రాణాల్ని పణంగాపెట్టి పాటుబడుతున్నానో, ఆ ప్రభుత్వం నేనులేనిరోజు సుశీలకు, బాబుకు బాసటగా నిలుస్తుందా? ఇలా ఆలోచిస్తూంటే అతనికి ప్రతిదినం ఇలాంటి క్షణక్షణ గండాల్నెదుర్కోవడం కష్టం అనిపిస్తూంది.

ఆ క్షణంలో అతని ఊహలో సబ్-ఇన్‌స్పెక్టరు భాస్కర్రావ్ మెదిలాడు. అతడు తన బంధువైన ఒక మినిష్టరుగారితో రికమెండు చేయించుకొని ఇక్కడినుండి బదిలీఅయిపోయాడు. అతని అదృష్టాన్నితలచుకొని సుదర్శన్ నిరాశగా నిట్టూర్చాడు.

* * *

అంతవరకు నక్సలైట్లను చుట్టుముట్టడంలో తన అమూల్యాభిప్రాయాల్ని అందించిన ఇన్‌స్పెక్టరు రంజిత్‌సింగ్, ఇప్పుడు ఆ నక్సలైట్లు తమకు దొరకగూడదని కోరుకుంటున్నాడు. తన ఆధ్వర్యంలో ఎన్నోసార్లు నక్సలైట్లను ఎదుర్కోవడం జరిగింది. కాని తన దురదృష్టవశాత్తు ఎవ్వరినీ పట్టుకోలేకపోయాడు. ఇప్పుడీప్రాంతంలోనే వాళ్ళున్నట్లు తమకు నమ్మకమైన మనిషిద్వారా తెలిసింది. ఈసారి ఎలాగైనా వాళ్ళలో ఒకరినైనా పట్టుకొని 'అవార్డు' పొంది ప్రమోషను సంపాదించాలని ఆశపడ్డాడు. కాని ఈసారి డి యస్.పి. గారే స్వయంగా తమను నడిపించడంతో తనకాఅవకాశం లేకుండాపోయింది. ఇపుడు వాళ్ళను పట్టుకోవడంలో వేసిన ప్లాను మొత్తం తాను వేసిందే కాని విజయం సాధిస్తే ఆ ప్రతిభ డి.యస్.పి. గారికే దక్కుతుంది. అపుడు తన ప్రమో

షన్ మాట దేవుడెరుగు తాను అప్రయోజకుడుగా నిరూపించబడతాడు. అందుకే అతడు అలా జరగకుండా చూడమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు.

* * *

ట్రక్కును చెట్లచాటున ఆపించి తన పటాలంతో, కాలినడకన అడవిలోకి చొచ్చుకొనిపోతున్న డి.యస్ పి కి కొద్ది రోజులక్రితం ఆ ప్రాంతంలోనే జరిగిన సంఘటన తలచుకోగానే ఒళ్లు గగుర్పొడిచింది. దగ్గరలోనున్న తిమ్మాపురంలో పట్టపగలు మిట్ట మధ్యాహ్నం ఊరిబయట మాటుగాసి ఊరిదొర వెంగళరాయుడిని ముక్కలుముక్కలుగా నరికిపోయారట. అసలు వీళ్ళ కెంతగుండె. తన పటాలం ఎప్పుడూ గస్తీ తిరుగుతూనే వుంటోంది. ఎవడూ కన్పడడు. కాని ప్రతిరోజూ తెల్లవారేటప్పటికి ఏదో వార్త వస్తూనేవుంది. ఎట్లా బతికేది. ఏరోజు ఎవరిగతి ఎట్లావుందో. దినదిన గండం, పట్టీపట్టనట్టు ఊరుకొందామంటే పైనుండి ఘాటింపులు, మెమోలు— ఒకవైపు ప్రాణం రెండోవైపు మెమోలు. ఏం చేయాలి? ఆలోచించలేకపోయాడు. డి.యస్.పి. యస్.ఐని పిలిచి "ట్రక్కుదగ్గరకు వెళ్ళి నేనక్కడే వుంటా. కాసేపట్లో తెలవారుతోందికదా- మీరు వెళ్ళి వెదకండి. రాత్రి హెచ్చరికలన్నీ గుర్తుంచుకోండి" అన్నాడు. సరేనని యస్సయి సెల్యూట్ కొట్టి బిక్కుబిక్కుమంటూ తన జవానులతో ముందుకు పోయాడు.

* * *

చెట్లనీడల్లో, పుట్టలఒడుల్లో కొన్ని శరీరాలు అలిసిన సింహాల్లా విశ్రాంతి తీసుకొంటున్నాయి. శబ్దం తానక్కడ శబ్దంచేయటానికే భయపడుతోంది. ఒకమూలనుండి బాధాకరమైన మూలుగు ఆగిఆగి మెల్లగా వినవస్తోంది. అతడే దళనాయకుడు కిష్టన్న తిమ్మాపురం దొరపై జరిగిన మెరుపుదాడిలో తొంటిపై బలమైనగాయం తగిలింది. అప్పుడు పెద్ద బాధనిపించలేదుగాని రోజులు గడిచినకొద్ది కాలువాచి, నడవనీయకుండా, చెడపోటు పెడుతోంది. బాధతోమూల్గుతూ మగతనిద్రలో వున్నాడు కామ్రేడ్ కిష్టన్న.

దూరంగా ఆకులు నలిగినచప్పుడు... అడుగులు కదిలినచప్పుడు... కిష్టన్న ఉలిక్కిపడ్డాడు. ఆ వైపు కళ్ళుచిట్లించి చూసాడు. మళ్ళీ చప్పుడు... ఆ వైపు తుపాకి గురిపెట్టాడు. సింహాలు జూలు దుల్పుకొన్నాయి. శూన్యంలోకి చెవులురిక్కించాయి. కొద్దినిమిషాల్లో సెంట్రీ చెమటలుకక్కుతూ ఒగరుస్తూవచ్చి కిష్టన్నతో "కామ్రేడ్! ప్రమాదం!! పోలీసులు మూడు వైపులనుండి చుట్టుముట్టుతున్నారు." అన్నాడు.

కిష్టన్న కనుబొమలు ముడివడ్డాయి. "తమ జాడవారికెలా తెలిసింది, ఎవడో ద్రోహి శత్రువుకు జాడతెలిపి వుంటాడు" రక్తం మరిగిపోతోంది, శరీరం ఉద్రేకంతో

ఊగిపోతోంది? ఏమిటి తక్షణ పథకం? పొదమాటునుండి చూస్తున్న కిష్టన్నకళ్ళు శత్రువుల కదలికలకోసం చీకట్లను చీల్చుతున్నాయి, చెవులు ప్రతి శబ్దాన్ని పట్టేస్తున్నాయి. ఆలోచనలు తమ రక్షణా పథకాల్ని సమీక్షిస్తున్నాయి. ఎంత ఆలోచించినా అతనికి ఒకటేమార్గం తోస్తూవుంది– "తాను రేపటి వరకు స్థావరానికి అందించవలసిన డాక్యుమెంట్లు, వస్తువులు ఎంతో విలువైనవి. ఇంకా ఆలస్యం చేశామంటే తాము చక్రబంధంలో ఇరుక్కొన్నామంటే ఇక తప్పించుకోవటం కల్ల. అందువలన వీలయినంతత్వరలో దళాన్ని తప్పించటం తన బాధ్యత దానికొకే మార్గముంది. వీళ్ళందర్నీ చెరువు వెనకవైపునుండి లోయద్వారా స్థావరంవైపు పంపించడం వాళ్ళు లోయదిగిపోయేదాకా ఇక ఎవ్వరూవాళ్ళనేమీ చేయలేరు. వాళ్ళక్కడకు చేరేవరకు తానక్కడేవుండి పోలీసులను అడ్డుకోవాలి." అని నిశ్చయించుకొన్నాడు కిష్టన్న.

నాయకుని ఆజ్ఞకోసం అందరు ఎదురు చూస్తున్నారు. కిష్టన్న నెమ్మదిగా ప్రారంభించాడు "కామ్రేడ్స్, మనం అందరం చాల నిబ్బరంగా వుండాలి. ఉద్రేకం, తొందరపాటుతో నష్టాలకు గురి అవుతాం. మనం చేపట్టిన ఆశయం మహోన్నతమైనది. దీని సాధనకొరకు అవసరమైతే ప్రాణాల్ని త్యాగం చేయటం ఎంత విలువైందో, అనువుకానిచోట ప్రాణాల్ని రక్షించుకోవడంకూడ అంతే అవసరమైంది. అంతేకాదు, మన ప్రాణాలకన్న ఎంతో విలువైన ఈ డాక్యుమెంట్లను సురక్షితంగా చేర్చవలసిన బాధ్యతకూడ మనమీదవుంది. కనుక మీరందరూ చెరువు వెనుకవైపుగా, లోయద్వారా వీలైనంత త్వరగా వెళ్ళిపోండి. నేనా ఈ తీవ్రమైన గాయంతో మీతో సమానంగా పరిగెత్తలేను. ఎలాగైనా వెనుక పడతాను. కనుక నేనిక్కడే వుండి పోలీసులు అటురాకుండా అడ్డుకొంటాను".

"లేదు కామ్రేడ్! మీరలాచేయడం మేమొప్పుకోం. మీ అమూల్యమైన నాయకత్వం మాకెంతో అవసరం. అవసరమైతే అందరం వాళ్ళనెదుర్కొని విజయమో వీర స్వర్గమో తేల్చుకొందాం"ఆవేశంగా అన్నాడు నర్సయ్య.

"కామ్రేడ్ కిష్టన్న! నాదోసలహా" ముందుకువచ్చాడు అనంతం– "కామ్రేడ్ దుర్గ శత్రువుల కన్నుగప్పటంలో సిద్ధహస్తురాలు. అక్కకు డాక్యుమెంట్లు అప్పగించండి. మనలో కొందరం శత్రువును ఎదుర్కొంటాం. మీరు మిగిలినవారితో నిదానంగానే సురక్షితప్రాంతానికి చేరండి. ఎందరికో నాయకత్వం వహించవలసిన మిమ్మల్ను ఒంటరిగా శత్రువుముందు వదలివెళ్ళలేం– నచ్చజెప్పజూచాడు కామ్రేడ్ అనంతం.

"కామ్రేడ్స్! మనకిప్పుడు తర్జనభర్జనలు చేసే సమయంలేదు. మనలో హెచ్చుతగ్గులులేవు. ఆశయసాధనలో అందరమూ సమాన బాధ్యతాకలవారమే. నాకోసం

మీరందరూకాని, కొందరుగాని ఇక్కడ వుండటమంటే పరోక్షంగా మృత్యువుకు ఎదురు వెళ్ళడమే. శత్రువును అడ్డడానికి ఒకరు ఖచ్చితంగా కావాలికదా! నేనా మీతోసమానంగా పరిగెత్తలేను. ఏ విధంగాచూచినా నేను చెప్పినదే ఉద్యమరక్షణకు ఎక్కువ ఉపయోగం. ఏ మాత్రం ముందువెనుకలాడక మీమీ పనులు నిర్వర్తించండి— దృఢంగా అన్నాడు కామ్రేడు కిష్టన్న మాటల్లోని దృఢత్వాన్నిచూచి, మిగిలిన దళ సభ్యులందరూ స్థావరానికి చేర్చాల్సిన డాక్యుమెంట్లు, వస్తువులు భద్రంగా సంచుల్లో పెట్టుకొన్నారు. ఎర్రబారినకళ్ళతో త్వరలోనే కలుద్దామంటూ తమ నాయకునికి రెడ్‌శాల్యూట్ చేస్తూ చక చకా కదలిపోయారు.

"నా శాయశక్తులా ప్రయత్నించి తప్పుకోడానికి చూస్తా, అంతా మేలుజరిగితే త్వరలోనే కల్సుకొందాం" వెళ్ళవల్సిందిగా అదేశాలిస్తూ సాగనంపాడు కామ్రేడు కిష్టన్న.

* * *

చుట్టూ కలయచూశాడు కిష్టన్న పోలీసులు కాల్పులు జరుపుతూ కనుచూపు మేరలోకి వచ్చారు. నాటుబాంబులుతీసి విసిరేయగలిగినంత దూరం విసుర్తున్నాడు. అవివెళ్ళి పోలీసుల గుండెల్లో మారుమ్రోగుతున్నాయ్ మట్టిపెళ్ళలు, రాళ్ళు ఎగిరిపడుతున్నాయి. ఎక్కడివాళ్ళక్కడ నేలకు కరుచుకు పడుకొన్నారు. కిష్టన్న ధ్యేయం అదే వీలైనంత కాలహరణ జరగాలి. అంతేగాదు తానిక్కడ ఒక్కడే ఉన్నట్లు వాళ్ళకు తెలియకూడదు. అందుకే అతను మూడుదిక్కులా ఎడతెరిపిలేకుండా బాంబులు విసురుతున్నాడు ఒక వరుస బాంబులదాడి అయిపోయింది. అయినా భయం. ఎవరు పైకి లేవటంలేదు ముందుకుపొమ్మని బండబూతులు తిడ్తున్నాడు యస్.ఐ. లేద్దామని తల పైకెత్తగానే పోలీసువాడి నుదుటిగుండా కిష్టన్నతూటా దూసుకుపోయింది మెలికలు తిరుగుతూ పడిపోయాడు పోలీసు. పోలీసుల్లో భయం బాగాపాతుకుపోయింది. ఎవడికి వాడు నేలకు కరుచుకొని ఎటో గురిలేకుండా కాలుస్తున్నారు.

సి.ఐ. కి మండింది. ముందుకు సాగమని లేకపోతే కాల్చివేస్తానని బెదరగొడ్తున్నాడు. ముందుగొయ్యి, వెనుక నుయ్యిలాగుంది పోలీసులకు. ప్రత్యర్థి కేవలం ఒక్కడేనన్న సంగతి తెల్సుకొన్నాడు సి.ఐ. ఈ విషయం పోలీసులతోచెప్పి ప్రాణాలతో అతణ్ణి పట్టుకోవాలని ఉత్సాహపరుస్తున్నాడు. పోలీసులు చక్రబంధంగా ఏర్పడి అరచేతిలో ప్రాణాలతో గమ్యందిక్కుగా పాకసాగారు. ఇదే అదననుకొని కిష్టన్న ముందే తాను నిశ్చయించుకొన్న స్థలానికి గెంతుకుంటూ ఉరికాడు. అక్కడ చుట్టూ బండలు రక్షక కవచంలా ఏర్పడివున్నాయ్. మధ్యలో కూర్చుని, పోలీసుల మీదికి బాంబులు అన్నివైపులా విసురుతూ వీలైనంతవరకూ ఏఒక్కరిని ముందుకు రాకుండా

ఆపుతున్నాడు. కాని ఎంత ప్రయత్నించినా చెట్లచాటునుండి వలయం ముందుకు కదులుతూనేవుంది. పోలీసులు వర్షంలా గుళ్ళను కురిపిస్తున్నా, కిష్టన్న రక్షక కవచాన్ని ఛేదించలేకపోతున్నారు. కాని కిష్టన్న ఉత్సాహం పెరుగుతున్నకొద్దీ మందుగుండు తరిగిపోతోంది. బులెట్లెన్నున్నాయో చూద్దామని చేయి పక్కకుపోనిచ్చాడు. ఇంతలో బులెట్ వచ్చి చేతిని గాయపర్చింది. గాయంనుండి రక్తం జలజల కారుతోంది. ఒకపక్క నీరసం. మరోపక్క ప్రతీకారం. ఎదురుగా చూశాడు. చెట్టుచాటున నిలబడి కాలుస్తున్న సి ఐ. చేతిని గాయపర్చింది కిష్టన్న బులెట్. చేయిపట్టుకొని నేలకు ఒరిగాడు సి ఐ.

కిష్టన్నదగ్గర బులెట్లు మొత్తం ఐపోయాయి. పక్క సంచిలో మూడేమూడు బాంబులు మిగిలాయి. ఏంచెయ్యాలి? ఆలోచించాడు ఒకక్షణం. పోలీసులు మెల్లిగా కదులుతున్న సవ్వడి వినవస్తూంది. తనచుట్టూ చూశాడు. చెట్లు దట్టంగావున్నాయి. బాంబులుతీసి మూడుదిక్కులా బలంకొద్దీ విసిరాడు. పెద్ద శబ్దంచేసుకుంటూ పేలాయి మూడు బాంబులు. పోలీసులు ఎక్కడివాళ్ళక్కడ నేలపై పడుకొన్నారు. ఊపిరిబిగబట్టి చెట్లను చాటుచేసుకొంటూ ముందుకుపరిగెత్తాడు కిష్టన్న. కాసేపటికి పిరికిగుండెల్లో బిక్కుబిక్కుమంటూ ఆ స్థలాన్ని చుట్టుముట్టిన పోలీసులకు అక్కడేమీ కన్పించలేదు. యస్.ఐ. ఒక బండపైకెక్కి చుట్టూచూశాడు. దూరంలో కుంటుతోపరిగెత్తున్న కిష్టన్న కన్పించాడు. యస్ ఐ. అందర్నీ ఆతనివెనుక పరిగెత్తి కాల్చేయమని ఆదేశాలిచ్చాడు. పారిపోతున్న కిష్టన్నను కాల్చాలని పోలీసులు ఎవరికివారు పోటీలుపడుతున్నారు. పారిపోతున్నాడండే మందుగుండు అయిపోయుంటుందని వారి అంచనా.

తుపాకి తూటాలకందని దూరం పరిగెత్తాడు. లోయ సమీపిస్తూంది. కడుపులో ఏదో దేవుతున్నట్లవుతోంది కాలు విపరీతమైన పోటుపెడుతోంది. కళ్ళుతిరుగుతున్నాయి. గుండెలు గొంతులోకి వస్తున్నాయి. అయినాపరిగెత్తాలి. పిరికి ప్రాణముండగా దొరకకూడదు. వేగం తగ్గిపోతోంది. లోయ అంచుకుచేరాడు. వెనుకవేపు పోలీసులు దగ్గరవుతున్నారు. ధన్ - ధన్, రెండు బులెట్లు అతని కుడికాలుపిక్కలో దిగినాయి. కుప్పలా కూలిపోయాడు. చేతులతో ముందుకు పాకబోయాడు. లోయవాలుకు కిందకు దొర్లిపోయాడు. రాళ్ళకు, మోళ్ళకు గుద్దుకుంటూ కిష్టన్న కిందకు దొర్లిపోయాడు. వెనుక పరుగెత్తకొచ్చిన పోలీసులకు కిష్టన్న దొరకకుండానే దొర్లిపోయాడు.

* * *

యస్. ఐ. అందర్నీ ముందుకుపోవాలని, ప్రాణాలతోగాని, శవాన్ని పట్టుకోవాలని పోలీసులకు ఆజ్ఞయిచ్చాడు. ఆయినా ఒకరూ ముందడుగు వేయటంలే.

హవల్దార్ అతనిముందుకువచ్చి చేతులుకట్టుకొని "సాబ్! ఇకమనం లోపలికి వెళ్ళడం మంచిదికాదు. ఇదంతా వాళ్ళ ఏరియా. మనం లోపలికివెళ్ళడం ప్రమాదం సాబ్" అన్నాడు నసుగుతూ.

"జీసాబ్!" నల్గురైదుగురు అతనికి వత్తాసుపలికారు పిరికిసందెల్తో. "బద్మాష్! నాకెదురు చెపుతారా?" హవల్దార్ చెంపపగిలిపోయింది. "పదవండి అందరూ వెళ్ళి వెతకండి" గర్జించాడు సి. ఐ.

హవల్దార్ కక్కలేక మింగలేక చూస్తున్నాడు.

పోలీసులు గాలిస్తూ కొద్దిదూరం లోయలోకిదిగారు. పొదలను, పుట్టలను బాయినెట్లతో పొడిచి పొడిచి చూస్తున్నారు. ఇంతలో లోయ అంతా ఊగిపోతూ భయంకరమైన శబ్దమైంది, ముందున్న అయిదారుగురు పోలీసులు హాహాకారాలతో లోయలో కూలిపోయారు. వెనకున్నవారు వెనక్కితిరిగి కాలికొద్ది పారిపోయారు.

* * *

తూర్పునుండి సూర్యుడు ఎక్కివస్తున్నాడు. కామ్రేడ్ కిష్టన్న భౌతికకాయం ముందు కామ్రేడ్సు శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపారు. రక్తంతో తడిసిన మట్టిని తీసుకొని, కిష్టన్నఆశయం కొనసాగిస్తామంటూ పిడిగిలి బిగించారు దళసభ్యులు. వారికళ్ళలో దీక్షను, పట్టుదల ఎరుపును చూడటానికేమో సూర్యుడు పరుగు పరుగున వస్తున్నాడు.

ఎర్రపూల పర్వతం

తెనుగు సేత : వెన్‌పిన్

నలభై ఎనిమిది సంవత్సరాలక్రితం ఛైర్మన్ మావో నాయకత్వాన "ఆకురాలు కాలపు పంటకోతల తిరుగుబాటు (Autumn Harvest uprising) జరిగింది, కార్మిక కర్షక విప్లవసైన్యం స్థాపించబడింది. చైనాయొక్క మొట్టమొదటి గ్రామీణ విప్లవ స్థావరం కియాంగ్సీ రాష్ట్రములోని చింకాంగు పర్వతాలలో నెలకొల్పబడింది. చైనా విప్లవ చరిత్రలో ఇదొక మహత్తరమైన మూలమలుపు. ఎందుకంటే- గ్రామీణ ప్రాంతాలను విముక్తి చేసుకొని పట్టణాలను చుట్టుముట్టాలనే క్రమంద్వారా సాయుధశక్తి చే రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే సూత్రాన్ని ఈ కాలంనుంచే చైనా విప్లవం అనుసరించింది.

ఇటీవల పీకింగులో ప్రప్రథమంగా ప్రదర్శింపబడిన ఆధునిక విప్లవాత్మక పీకింగ్ నృత్యనాటిక 'ఎర్రపూల పర్వతం'- చింకాంగు పర్వత పోరాటకాలం భూమికతో

రూపొందించబడింది. యాదృచ్ఛికంగా ఏర్పడ్డ ఒక రైతాంగదళం కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంకింద చైతన్యయుతమైన విప్లవశక్తిగా పరిపక్వతను ఏవిధంగా ఆర్జించిందీ– దాని కథను ఈ నృత్యనాటిక వివరిస్తుంది. విప్లవసైన్యాలను నిర్మించుటలో చైర్మన్ మావో చేపట్టిన పంథా ఎంత సరైనదో ఈ కథానాయకురాలి (పార్టీ రాజకీయ కార్యకర్త) పాత్రద్వారా వ్యక్తంచేయబడుతుంది.

తిరుగుబాటుచేస్తున్న రైతాంగపు ఒక దళనాయకుడైన లైకాంగ్‌ను వెతికి కనుగొనటానికి పార్టీచేస్తున్న ప్రయత్నపు దృశ్యంతో, నృత్యనాటిక ఆరంభమౌతుంది. లైకాంగుకూడ పార్టీ సంబంధంకోసం వెతుకులాడుతుంటాడు. అది 1928 వసంత ఋతువు– మొదటి విప్లవ అంతర్యుద్ధంలో ఓడిపోయినతర్వాతి సంవత్సరం. ప్రజలను సమీకరించి తన సాయుధ బలాలను విస్తరింపజేసుకొనే ప్రణాళికలో భాగంగా లైకాంగ్ నాయకత్వానగల రైతాంగపు ఆత్మరక్షణ దళాలను కనుగొనేందుకై కోహ్వాయాంగ్, చావోహ్సిన్ అనే ఇరువురు కామ్రేడ్స్‌ను పార్టీ చింకాంగ్ పర్వత స్థావరంనుండి హూనాన్– కియాంగ్సీ సరిహద్దుమీద ఉన్న ఎర్రపూల పర్వతానికి పంపుతుంది. కాని వారు పర్వతపాదందగ్గరే భూస్వాముల "పౌరదళాల"కుచెందిన సాయుధ బలాలచే చుట్టుముట్టబడ్డారు. చావోహ్సిన్ చంపబడగా కోహ్వాయాంగ్ పట్టుబడుతుంది.

ఈ వార్త రైతాంగ దళాలకు తెలవటంతో వారు కోపోద్రిక్తులౌతారు. ఆకు రాలుకాలపు పంటకోతల తిరుగుబాటుయొక్క అద్భుత ప్రభావంతో వారు, రైతాంగం మూడుసార్లు సాయుధులై తిరగబడ్డారు. కాని ప్రతిసారి అణగారిపోవటమే జరిగింది. ఎందుకంటే వారికి సరైన నాయకత్వంలేదు. సరైనపంథా, స్పష్టమైన ఉద్యమఅవగాహన వారిలోలేదు. సంతజరిగేపట్నంలో బహిరంగంగా "అతనిని" ఉరితీసేముందుగానే ఆ కమ్యూనిస్టులను విడిపించుకొని తమ బలగాలకు పార్టీ నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఇప్పుడు, లైకాంగ్ అతని సోదరతిరుగుబాటువాళ్లు నిశ్చయించుకొన్నారు.

"ఆ కమ్యూనిస్టు దాన్ని తీసుకరాండి!" అభివృద్ధినిరోధక అణచివేత సైనికులు ఉరితీసేప్రదేశములో చెలరేగిన గడబిడలో అరిచారు. ఇనుపసంకెళ్ళువేయబడి, రక్తపు మరకల చొక్కాతో ఒక స్త్రీ పురాతన దేవస్థానపు మెట్లమీదకు తీసుకరాబడుతుంది. ఆమె కారుచీకటిలో కాంతిని వెదజల్లే వెలుగురేఖలా కన్పించింది. అగ్నిగోళంలా ప్రజ్వరిల్లుతున్న కళ్ళతో ఆమె నిర్భయంగా, విప్లవించాల్సిన ఆవశ్యకత ఎందుకో చుట్టూ గుమిగూడిన ప్రజాసమూహానికి వివరించింది. "కేవలం మార్క్సిజం మాత్రమే చైనాను రక్షించగలదు! కేవలం చైనా కమ్యూనిస్టుపార్టీ ఒక్కటే కార్మిక కర్షకులను సంరక్షించే నక్షత్రం!" అని ఆమె ధైర్యంగా ఉద్బోధించింది

హఠాత్తుగా గుంపు మధ్యనుండి ఒక ఆజ్ఞాపూర్వకమైనకంఠం ప్రతిధ్వనించింది. మారువేషాలతో ఉన్న లై కాంగు. అతని రైతాంగదళాలు పిడుగులా 'పౌరదళాల'పైన పడ్డాయి ఖైదీని విడిపించారు

వారెంతో కాలంనుండి వెదుకుతున్న కమ్యూనిస్టుపార్టీ సంబంధం దొరకగానే, లై కాంగ్, అతని రైతాంగయోధులు కోహ్సియాంగుకు తమ సాయుధబలాల్తో, పార్టీ ప్రతినిధిగా ఘనస్వాగతమిచ్చారు.

ఐతే అక్కడ నుండి వారుపోతున్నపుడు దారిలో వారిమధ్య వైరుధ్యాలు తలెత్తాయి. పార్టీ నాయకత్వాన్ని ఏర్పరుచుకోనుటకై వారు తమ ప్రాణాలను సైతం ఒడ్డినప్పటికీ, లై కాంగు తదితరులలో విప్లవంగూర్చి సక్రమ అవగాహనలేదు. వారి దృష్టిలో "విప్లవమంటే ప్రతీకారమే. కేవలం తమ శత్రువులను చంపటానికిమాత్రమే పార్టీ నాయకత్వం వహించాలనే వారు వాంఛిస్తారు. మార్క్సిస్టు-లెనినిస్టు పంథాను, విధానాలను వారు అర్థంచేసుకోలేకపోయారు. చైనా విప్లవంయొక్క నిర్దిష్ట పరిస్థితులకు తగ్గట్టుగా పార్టీ అన్వయించిన నిర్దేశక సూత్రాలను వారు అవగాహన చేసుకోలేదు. ఆవిధంగా కోహ్సియాంగు ఎర్రపూల పర్వతానికి వచ్చినరోజు దగ్గర్నుండే పార్టీ విధానానికీ, రైతాంగ యోధులలోవున్న శ్రామికవర్గేతర ఆలోచనా సరళికీ మధ్య వైరుధ్యం వుంది. నూతన నియమ నిబంధనలకూ, అంతవరకూ యోధులు అవలంబిస్తున్న పాతవాట్కికీ మధ్య తలెత్తిన సంఘర్షణపైన వైరుధ్యం కేంద్రీకృతమైంది.

పాతనియమాల ప్రకారం ఆత్మరక్షణ దళయోధులు, తాము స్వాధీనంచేసుకొన్న ఏ ఆస్తినైనా పంచుకోవచ్చు. వర్తకులను పట్టుకోవచ్చు ఖైదీలను చంపవచ్చు. రైతాంగ దళానికి అవశ్యంగా విజ్ఞానం కల్గించాలనీ, శ్రామికవర్గ సిద్ధాంతంతో వారిని దృఢతరం చేయాలనీ పార్టీ కార్యకర్తగా కోహ్సియాంగుకు తెలుసు. ఆవిధంగా చేయకపోయినట్లయితే, విజయం అసాధ్యం కనుక తక్షణమే ఆయన పార్టీ పంథా, విధానాలను వివరించి అమలుచేయ నమకట్టింది. కొత్త నియమ నిబంధనలను పాటించాలని యోధులకు పిలుపిచ్చింది.

ఏదేమైనా కొత్త నియమాలు తామింతవరకూ పాటిస్తున్న సూత్రాలకు విరుద్ధంగా వున్నాయని లై కాంగ్ భావిస్తాడు. దీనికి తోడుగా, లోగడ ధనిక, భూస్వామ్య కుటుంబానికి చెందిన వెన్-చి-చ్యూ అనునతడు వర్గపంథాయెడల జనంలో తికమక సృష్టించేందుకై పాత నియమాలను ముందుకుతోసి పరిస్థితులను మరింత వ్యతిరేకం చేస్తాడు. ఇతను దళాలకు ఉపనాయకుడుగా ఎగబాకాడు ప్రజలను బెదిరించి, పీడించే ఒకరకం యుద్ధ ప్రభువుల ముఠాగా రైతాంగదళాలను తయారుచేయాలని అతనికోరిక

కోహ్సియాంగును కూడా అతను వ్యతిరేకిస్తాడు. కోహ్సియాంగు, లైకాంగ్ మధ్య విభేదాలను ఎక్కువ చేయటానికై అతను సర్వప్రయత్నాలుచేస్తాడు "క్రూరభూస్వామి" యొక్క మనిషని, అతనికి సరుకులను చేరవేస్తాడని చెప్పి ఒక వ్యక్తిని పట్టుకొని, అతనిని కొట్టవలసిందిగా, ఒక అనుచరుని, వెన్ ఆజ్ఞాపిస్తాడు.

అది పార్టీ విధానానికి వ్యతిరేక చర్య అని కోహ్సియాంగ్ భావిస్తుంది. ప్రజా శత్రువులకు మిత్రులకు మధ్యగల తేడాను ఉద్దేశపూర్వకంగా తుడిచివేసేచర్య అని ఆమె తలుస్తుంది. ఆ వ్యక్తిని కొట్టబోయే బడితెను వారివద్దనుండి ఆమె లాక్కుంటుంది. ఆన్‌యువాన్‌లో గనులత్రవ్వే కూలీగా తన స్వంత తాత, తండ్రులు దోపిడీచేయబడి పీడించబడిన విధంగానే క్రూరత్వానికి గురికాబడుతున్న ఆ కిరాయిమనిషికి జరుగబోయే అమానుషత్వాన్ని ఆమె చూసి సహించలేకపోయింది.

ఈ అవకాశాన్ని తీసుకొని వెన్-చు-చ్యూ కపటంగా రెచ్చగొట్టడంతో లైకాంగ్ ఉగ్రుడయ్యాడు. బల్లపైన తన కాలును మోపి కత్తితో బల్లను బాదుతూ లైకాంగు ఆమెను ఖండించాడు: "మమ్మల్ని నీవు ఆ క్రూరుణ్ణి కొట్టనియ్యవు. వ్యాపారులను, ఖైదీలను విడిచి పెట్టాలంటావు. అసలు నీవు కమ్యూనిస్టువేనా, లేక మారువేషంలో వున్న మోసకత్తెవా?"

రైతాంగ యోధులు చాలామంది కోహ్సియాంగ్‌ను కోపంతో చూశారు. బల్లెలు బాకులు పైకిలేచాయి. కాని ఆమె ప్రశాంతంగావుంది. తన ఆశయంపైగల దృఢనమ్మకంతో ఆమె వారి నిలా ప్రశ్నించింది. "మీలో ఏ క్రూరమైన భూస్వామికింద దాస్యం చేయనివారు, పనిచేయనివారు లేరా? చేతులెత్తండి!"

గంభీరమైన, నిశ్చలమైన ఆమెమాటలు వారిలో భూస్వాముల దోపిడి. దౌర్జన్యాల, స్మృతులను రేపినవి. ఒకరితర్వాత ఒకరిచేతులు లేచాయి, లైకాంగుకూడా పూర్తిగా చలించిపోయాడు. ఎందుకంటే అతను స్వయంగా స్థానిక నిరంకుశ భూస్వామిని పల్లకీ- కుర్చీలో మోసేవాడు, ఆ బానిసపనిని అతను ఐదేళ్ళకుపైగా చేశాడు.

అప్పుడు కోహ్సియాంగ్. లైకాంగ్‌వద్దకు నడచి ఒక సూటిప్రశ్న అడుగుతుంది. "దీనివల్ల మనమంతా దుర్మార్గులైన భూస్వాములక్రిందనే లెక్కా? మనమంతా విప్లవకారులచేత దెబ్బలుతినవల్సిన వారమేనా?" అప్పుడామె చైర్మన్ మాటలను వారికి చెప్పుతుంది. "మన శత్రువులెవ్వరు? మన మిత్రులెవ్వరు? విప్లవానికిది ప్రధమ ప్రాముఖ్యతగల ప్రశ్న." కూలీని కట్టివేసిన తాళ్ళను విప్పివేసి, అతనికి కొంతడబ్బును బట్టలను ఇస్తుంది. దీనికి పూర్తిగా కదలిపోయిన ఆ మనిషి తనకొక రైఫిల్ ఇమ్మన్నాడు. తద్వారా తాను పార్టీని అనుసరిస్తూ విప్లవంలో చేరగలనని చెప్పాడు.

విప్లవపోరాటంలో ఎవ్వరిపైన ఆధారపడాలి, ఎవ్వరితో ఐక్యమవ్వాలి, ఎవ్వరిని ఎదుర్కోవాలి అన్న ఉద్యమ అవగాహన, పంథా, సమస్యను ఇప్పటికి లైకాంగ్ అర్థం చేసుకొన్నాడు.

ఆత్మరక్షణ దళాలు శిక్షణ పొందడానికై, పర్వతారణ్యాలలోకి వెళ్ళిన పక్షం రోజులతర్వాత, స్థానిక దుర్మార్గపు భూస్వామి "నాగుబాము" తన "పౌరదళాలను" కూడగట్టుకొని పర్వత పాదంవద్దనున్న సంకువాన్ యొక్క సంతపట్టణానికి వస్తాడు. అతడు లైకాంగ్ పెంపుడుతల్లి — టు అప్వా—ను బందిస్తాడు. ఆమెను తాళ్ళతో కట్టివేసి, ఆమెచుట్టూ కట్టెలు పేరుస్తాడు ఆమెను సజీవంగా దహనం చేయబోతున్నానని పుకార్లు వ్యాపింపజేస్తాడు. తద్వారా తల్లిని విడిపించుకోవటానికి లైకాంగ్, అతని ఆత్మరక్షణదళాలు పర్వతందిగి కిందికివస్తాయని, అప్పుడు వాటిని తను నిర్మూలించ వచ్చునని అతడి ఆశ.

ఆ "నాగుబాము"వేసిన పట్టరాని ద్వేషంతో లైకాంగ్ తన తల్లిని విడిపించటానికి తాము కిందికివెళ్ళాలని డిమాండ్‌చేస్తాడు. అప్పటికే రైతాంగదళానికి ద్రోహం చేసి శత్రువుతో చేతులుకలుపుతున్న వెన్‌చి-ఛ్యూ లైకాంగ్‌ను బుట్టలో పడవేయడానికి అతనిని ఎగదోశాడు. కొహ్సియాంగ్ చేసిన హెచ్చరికలను లైకాంగ్ పెడచెవిన పెట్టాడు. తాను మరణించినప్పటికీ. ఆ "నాగుబాము"ను చంపితీరవల్సిందేనని. అతను వ్యక్తిగత నిర్ణయానికి వస్తాడు.

శత్రువు బలంగావుండి, విప్లవశక్తులు బలహీనంగా వున్న ఆ పరిస్థితులలో వ్యక్తిగతంగా ప్రతీకారం తీర్చుకోవాలనే సంకుచిత అభిప్రాయానికి ప్రాధాన్యతనిచ్చే బదులు కోహ్సియాంగ్ మాత్రం విప్లవ ప్రయోజనాలను మొత్తంగా పరిగణలోకి తీసుకొంది. గెరిల్లాయుద్ధం సాగించమని చింగ్‌కాంగ్ పర్వతాల నుండి పార్టీ ఆదేశించింది." శత్రువు ముందుకు వస్తున్నప్పుడు మనం తిరోగమిస్తాం" అనే చైర్మన్ మావో ఎత్తుగడను అవలంభించమని పార్టీ ఆదేశించింద. అంటే అజాలియా పర్వతం నుండి రైతాంగ దళాలను ఉపసంహరించటం, శత్రువును తుడిచిపెట్టడానికి పార్టీ రెగ్యులర్ సైన్యంలో చేరిపోవటమన్నమాట.

రైతాంగ దళాలు గనుక సంత పట్టణానికి కిందికి పోయినట్లయితే, అవి శత్రువు వేసివుంచిన మాటులో పడటం ఖాయమని కోహ్సియాంగ్‌కు బాగా తెలుసు. అతనిని అపుచేయటానికి ఆమె యెంత ప్రయత్నించి నప్పటికి, లైకాంగ్ వినక వెళ్ళిపోతాడు. శత్రువుకు పట్టుబడ్డాడు.

ఇది రైతాంగం యొక్క మనోనిబ్బరాన్ని దెబ్బతీస్తుంది. రైతాంగ యోధులను మోసపుచ్చి, వారిని కిందకు దీసుకపోయి, శత్రువుచేతిలో పడేటట్లు చేసేందుకై,

మొదట కోహ్సియాంగ్‌ను, దెబ్బతీయటానికి వెన్‌చు-చ్యూ ఈ అవకాశాన్ని వాడుకొంటాడు. కోహ్సియాంగ్ స్థానికురాలు కాదనే వాస్తవాన్ని స్వార్థానికి ఉపయోగించుకొని, ఆమెకు, రైతాంగ నాయకులకు యోధులకు మధ్యగల సత్సంబంధాలను అతడు పాడు చేయ తలపెట్టాడు. వారి మనోనిబ్బరాన్ని కృంగదీయటానికి విప్లవ శక్తులను ధ్వంసం చేసి శతృవుతో కలియటానికి ప్రయత్నిస్తాడు.

ఈ అత్యవసర పరిస్థితి అసలు ఆత్మరక్షణ దళాల అస్తిత్వానికే ఎసరు తెచ్చి పెట్టింది. ఐనా కోహ్సియాంగ్ దృఢంగా నిలబడింది. మావో సైనిక పంథాను కాపాడటానికి తన ప్రాణాలను సైతం అర్పించటానికి సిద్ధపడింది. "గడ్డుపరిస్థితులలో మనం గుడ్డివాళ్ళం కాకూడదు. తప్పొప్పుల మధ్యగల తేడాను జాగ్రత్తగా కనిపెట్టాలని" ఆమె యోధులకు చెప్తుంది.

వెన్‌చి-చ్యూ ప్రవర్తనపైన -అతను రైతాంగదళాలకు విద్రోహిగా మారటాన్ని బహిర్గతంచేసే ఎత్తుగడను ఆమె అవలంబించింది. అతను కర్కోటకపు భూస్వామ్య కుటుంబానికి చెందిన విషయాన్ని, సైనిక విషయాలలో సామాన్య జ్ఞానం లేకపోయినప్పటికి సర్వజ్ఞానిలా వ్యవహరించే అతని నటననూ బట్టబయలు చేసింది. వాస్తవానికి అతడు అభివృద్ధినిరోధక సైనికాధికారనీ, దళంలో వుంటూనే దళం నాశనం చేయడం అతని పన్నాగమని ఆమె విశదీకరించింది.

ఆకాశమంతా కారుమబ్బులు తుఫాన్‌లా పరుగులు పెడ్తున్నాయి. దేవదారు వృక్షాలు గాలికి రెప రెప లాడ్తున్నాయి. తుపాకీ కాల్పులధ్వని గాలిలో మోగుతూంది. పరిస్థితులు ఎంత గడ్డుగా విషమిస్తుంటే దృఢనిశ్చయంతో పార్టీ పైన, ప్రజానీకంపైనా ఆధారపడాలనే, ఛైర్మన్ మావో ఉద్బోధనను అంత ఎక్కువగా కోహ్సియాంగ్ స్మరిస్తుంది. ఆమె తక్షణమే దళంలోని పార్టీ సభ్యులను సమావేశపరుస్తుంది. పరిస్థితులలో వచ్చిన ఆకస్మిక మార్పును ఆమె పేర్కొంటుంది. "మనం కనుక లైకాంగ్‌ను విడిపించుకోక పోయినట్లయితే, దళాలమనోనిబ్బరం దిగజారుతుంది. దళాల ఉపసంహరణ మరింత కష్టమౌతుందని" ఆమె పరిస్థితిని వారికి విప్పి చెప్పింది.

లైకాంగ్‌ను విడిపించడానికి సమావేశంలో వివరమైన పథకం వేయబడింది. తన పార్టీపని బాధ్యతను తీసుకోమని, లీషీ-చీన్‌ను ఆమె ఆజ్ఞాపించింది. యోధులను సురక్షిత ప్రాంతంలోనికి నడపించమని ఆదేశించింది. తర్వాత దళాలన్నీ పర్వతాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాయని శతృవు భావించేటట్లు చేయటానికి, ఒక స్క్వాడును ఆమె పంపుతుంది. తద్వారా "నాగుబాము" తన ప్రధాన బలగాన్ని సంత పట్టణానికి అవలంబిస్తున్న కీలకమైన పర్వతకనుమలోనుంచి పంపేటట్లు ఆమె ప్లానువేస్తుంది. లైకాం

గును రక్షించటానికై మెరుపుదాడిచేసే దళానికి స్వయంగా ఆమె నాయకత్వం వహిస్తుంది, చుట్టు దారిద్వారా పట్నంలోకి ప్రవేశిస్తుంది.

మొదట పర్వతపాదంవద్ద భూస్వామిచే చంపబడ్డా కామ్రేడ్ చాహోఫ్సెన్,

కోహ్సియాంగ్ యొక్క భర్త అని, జైలులో టు-అప్పద్వారా లై కాంగ్ తెలుసు కొంటాడు. కాని తన దుఃఖాన్ని బాధను ఆమె యెన్నడూ బైటపెట్టలేదు. వ్యక్తిగతంగా తనకు వాటిల్లిన తీరని వ్యధను దిగమింగి, పార్టీ ఆదేశాలప్రకారం నడుచుకొనే ఆమెయొక్క శ్రామికవర్గ విశ్వాసానికి, ధీరత్వానికి లై కాంగ్ హృదయం ద్రవీభూతమైంది.

రైతాంగబలాలు రాష్ట్ర సరిహద్దువైపుగా కదలిపోతున్నాయనే వార్త భూస్వామికి చేర్తుంది. వారు ఉపసంహరించబోతున్నారని భూస్వామికి, వెన్ చి-ఛ్యూ కబురు పంపిస్తాడు. తక్షణమే భూస్వామి తన ప్రధానబలగాన్ని కీలకమైన పర్వతకనుమలోకి పంపిస్తాడు. కేవలం ఒకే ఒక దళాన్నిమాత్రం సంకువాన్ లోవున్న చెరసాలను కాపాడటానికి అట్టిపెడ్తాడు.

అదొక తుఫాన్ రాత్రి, కోహ్సియాంగ్, మెరుపుదాడిచేసే ఆమెదళం నిటారుగా వుండే ఒక కొండశిఖరాన్నిఎక్కి చెట్లతీగలతో పెద్ద అగాధాన్నిదాటింది పట్నం చేరుకోగానే చెరసాలపైన హఠాత్తుగా దాడిచేసి, అక్కడి కావలాదళంతో పోరాడి, లైకాంగును అతని తల్లిని బంధ విముక్తులనుచేస్తుంది. వారు పర్వతానికి మళ్ళీతిరిగివస్తారు.

ఇంతలో కోహ్సియాంగ్ లేని అవకాశాన్నిచూసి మిగతా దళాన్నంతా తన చెప్పుచేతుల్లోకి తీసుకోవటానికి వెన్ చి-ఛ్యూ కుట్రపన్నాడు. ఆమె భూస్వామియొక్క ఎత్తుగడను భంగంచేయటమేకాక తన సైన్యాలనుతీసుకొని లై కాంగ్ ను చెరనుండి విడిపించిందన్నవార్త అతనిని కలవరపెడ్తుంది.

ఇంకో శత్రు భూస్వామియైన 'చిరుతపులి'-ల్యా నాయకత్వానగలబలాలకు రైతాంగదళాలు లొంగిపోయేటట్లు నడిపించటానికి అతడిప్పుడు ప్రయత్నిస్తాడు, కాని కోహ్సియాంగ్ లేనిసమయంలో పార్టీకి ప్రాతినిధ్యంవహిస్తున్న లిషి-చిన్, "సైన్యాన్ని పార్టీ నడిపిస్తుంది!"అని ఖచ్చితంగా వక్కాణిస్తాడు. యోధులు తమ స్థానాన్ని వదలిపెట్టిపోకుండా వుండటానికి. ఎర్రజండాను కాపాడటానికి ఆయన వారిని ఒప్పించాడు.

కోహ్సియాంగ్, లై కాంగ్ లు తిరిగి వచ్చినప్పుడు మళ్లీ వెన్ చి-ఛ్యూ బుద్ధిమంతుడిలా. విశ్వాసపాత్రుడిలా నటిస్తాడు, అతనొక "బృహత్పథకాన్ని" ప్రతిపాదిస్తాడు, చిరుతపులి ల్యూ సైన్యాలుండే ప్రదేశం గుండా వెళ్ళటం ద్వారా శత్రువ

యొక్క చుట్టివేతను గండి కొట్టడం తన పథకాన్ని వివరించడానికి అతనికి ఆమె అవకాశమిస్తుంది తర్వాత అతను శత్రువుకురాసిన రహస్య ఉత్తరాన్ని ఆమె మెల్లగా యోధులకు చూపుతుంది దానిని ఆమె మధ్యలో అడ్డగించి పట్టుకొంటుంది. వెన్ బండారం పూర్తిగా బట్టబయలైంది లైకాంగ్ తన పిస్తోలును తీసి. విద్రోహిని కాలుస్తాడు. వెన్ చి-చ్యూ శవం పర్వత శిఖరంపై నుండి క్రిందకు దొర్లిపోతుంది.

తన స్వంత తప్పిదాలవల్ల అనేకసార్లు వాటిల్లిన అపజయాలకు లైకాంగ్ మనఃపూర్వకంగా పశ్చాత్తాపపడ్డాడు. అతని నుదుటిమీద పడిన రక్తాన్ని తుడుస్తూ— వ్యక్తిగత ప్రతీకారం చేయాలనే అతనిలోని సంకుచితపు కోర్కెయే అతని తప్పిదాలకు మూలకారణమని ఆమె పాటరూపంలో విశదీకరిస్తుంది.

స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలకై జానిసలు
తెగించి పోరాడారు తరతరాలు,
ప్రయోగించారు నిరంతరం
యుద్ధ భేరీలు
వ్యూహం, లక్ష్యం, లోపభూయిష్టమై
తిరుగుబాటుదారులకంతా అగమ్యగోచరమై
గందరగోళంలో మునిగి,
అపజయంపాలయ్యారు.
అసంఖ్యాక వీరులు
అనుపమాన త్యాగాలుచేసినా
తమ రక్తాలు ధారపోసినా
ఆశించిన ఆశయం
అందుకోలేకపోయారు
కాలం, కర్మాన్నే తిట్టుకొన్నారు.
ఐతే, పార్టీని అనుసరించాలి నేడు
రైతాంగ సాయుధ బలాలు
అప్పుడే, అలా అనుసరించిననాడే—
ఉరకలు - పరుగులతో ఉవ్వెత్తుగా
పారే మహా నదిలోకి
సంగమించే సెలయేరులా శక్తివంతులౌతారు.

నిజానికి కోహ్వాయాంగ్ చైనా రైతుల గత పోరాటాల గుణపాఠాలను అందులో సమీక్షించింది.

పార్టీ ప్రతినిధి నాయకత్వాన, రెగ్యులర్ సైన్యంతో సమన్వయం చేసుకొంటూ రైతాంగ ఆత్మరక్షక దళాలు 'నాగుదామా' భూస్వామిని ఆయన 'పౌరరక్షణ దళాల'ను

పర్వత దుర్గంలోపలికి బాగా లాక్కువచ్చాయి. వాటిని నిర్మూలించాయి. తర్వాత అవి కార్మిక-కర్షక విప్లవ సైన్యంలో భాగమైపోతాయి. చైర్మన్ మావోను కలుపటానికై చింకాంగ్ పర్వతాలకు పయనిస్తాయి.

సంక్లిష్టమైన, తీవ్రతర వైరుధ్యాలలో పార్టీ "ఎఱ్ఱపూల పర్వతం" సృష్టిస్తుంది. ఆమె పార్టీ విధానాలను గట్టిగా అంటిపెట్టుకొని వుంటుంది. ఆమె శక్తి సామర్థ్యాలుగల రాజకీయ, సైనిక నాయకురాలు. పార్టీకోసం విశ్వాసపాత్రంగా పనిచేస్తుంది. ప్రజలతో మక్కువగావుండి వారితో ఐక్యమౌతుంది, విశాలమైన దృష్టి ఆమెకువుంది.

ఈ సంగీత-నాటకం ఒక రైతాంగ యోధుణ్ణి- లైకాంగ్‌ను కూడా సృష్టించింది. యాదృచ్ఛిక పోరాటంలో ఒక రైతుగాపాల్గొన్న లైకాంగ్, సాహసంగా తిరుగబడి, ఎట్టి అవాంతరాలను లెక్కచేయకుండా అధిగమిస్తూ, చైతన్యపూరితమైన, క్రమశిక్షణాయుతమైన, శ్రామికవర్గ యోధుడిగా రూపొందిన విధానాన్ని అది కళ్ళకుకట్టినట్లు చూపుతుంది.

"సైద్ధాంతిక, రాజకీయ పంథాయొక్క
సవ్యాపసవ్యాలే ప్రతిదాన్ని నిర్ణయిస్తాయి"
అనే నిజాన్ని "ఎఱ్ఱపూల పర్వతం" చిత్రిస్తుంది.

[చైనా రీకన్‌స్ట్రక్ట్స్, ఫిబ్రవరి 1974]

యూజిన్ పాట్టియర్‌పై లెనిన్

ఫ్రెంచి శ్రామికవర్గ రచయిత, విస్తృత ప్రజాదరణ పొందిన శ్రామికవర్గ గీతమయిన అంతర్జాతీయ గీతం (మేలుకోండి పేదప్రజలారా...) రచయిత, యూజిన్ పొట్టియర్, అమరుడయి గత నవంబర్ మాసానికి (1912) ఇరువై అయిదు సంవత్సరాలయింది

అంతర్జాతీయ గీతం (Internationale) అన్ని భాషల్లోకి తర్జుమా చేయబడింది. తన మాతృదేశాన్ని విడిచి సుదూర దేశానికి ఒక వర్గచైతన్యంకల కార్మికుడుపోతే, ఆ దేశంలో ఆ కార్మికుడు భాషతెలియని సమస్యవల్ల, మిత్రులు లేకపోవడంవల్ల కష్టాలకు లోనయి, ఒంటరితనంతో, తాను ఆ దేశానికి పరాయివాడు అన్నభావన అతనిలో కలగవచ్చు. కాని ప్రపంచ కార్మిక గీతమయిన అంతర్జాతీయ గీతాన్ని పాడినపుడు మిత్రులు, కామ్రేడ్స్, తనవర్గంవారు అతనిచుట్టూ తప్పక చేరుతారు.

ప్రపంచ కార్మికులందరూ తమ వర్గపు అగ్రగామి పోరాట వీరుడయిన శ్రామికవర్గరచయిత పొట్టియర్ గీతాన్ని తమందరి పాటగా, పిలుపుగాచేసి ఆ గీతాన్ని ప్రపంచ వ్యాపితంగా శ్రామికుని గీతం చేశారు.

అందుకే ఈనాడు యూజిన్ పొట్టియర్ అమరస్మృతిని గౌరవిస్తున్నారు. అంతర్జాతీయ గీత రచయిత తన జీవితం అంతా బీదరికంలో గడిపినట్టుగానే ఈనాడు ఇంకా జీవించి ఉన్న ఆయన భార్య, కుమార్తె కూడా బీదరికంలోనే జీవిస్తున్నారు. ఆయన పారిస్‌లో 1816 అక్టోబర్ 4న జన్మించాడు. "స్వాతంత్ర్యము చిరకాలం వర్ధిల్లుగాక" అన్న తన మొదటిగీతాన్ని రచించినపుడు ఆయన వయస్సు పదునాలుగు సంవత్సరాలు. 1848 లో కార్మికులు, బూర్జువాలకు వ్యతిరేకంగా జరిపిన బ్రహ్మాండమయిన చారిత్రాత్మక పోరాటంలో ఆయన అగ్రభాగాన బారికేడ్లవద్ద పోరాడిన పోరాటవీరుడు.

పొట్టియర్ బీదకుటుంబంలోజన్మించి, ఒక శ్రామికుడిగా, బీదవాడుగాజీవించాడు. ప్యాక్ చేసేవానిగా, అద్దకం పనివానిగా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు,

1840వ సంవత్సరంనుండి ఫ్రాన్స్‌చరిత్రలో జరిగిన గొప్ప సంఘటనల కన్నిటికీ స్పందిస్తూ తన పోరాటగీతాలతో పీడితవర్గాల వర్గచైతన్యాన్ని మేల్కొలిపాడు. ఫ్రాన్స్ బూర్జువాలను, బూర్జువా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో శ్రామికవర్గం ఐక్యం కావలసిందని పిలుపిచ్చాడు

చారిత్రాత్మకమయిన పారిస్ కమ్యూన్ (1871) రోజులలో కమ్యూన్ సభ్యుడిగా పొట్టియర్ ఎన్నుకోబడ్డాడు. పోలయిన 3,600 వోట్లలో ఆయనకు 3,352 వోట్లు పడ్డవి. మొట్టమొదటి శ్రామికవర్గ ప్రభుత్వమయిన కమ్యూన్ కార్యకలాపాలన్నిటిలోనూ ఆయన పాల్గొన్నాడు.

పారిస్ కమ్యూన్ ఓటమితో పొట్టియర్ మొదట ఇంగ్లండుకు, అటునుంచి అమెరికాకు పారిపోవాల్సివచ్చింది. ఆయన ప్రసిద్ధ గీతం అయిన 'అంతర్జాతీయ గీతం' జూన్ 1871 లో అంటే– మే మాసంలో కార్మిక కమ్యూన్ రక్తసిక్తమయిన ఓటమి పొందిన తర్వాత– వ్రాయబడింది.

కమ్యూన్ అణచివేయబడినా పొట్టియర్ అంతర్జాతీయగీతం మాత్రం ప్రపంచ కార్మికవర్గం అంతా మారుమోగింది. అంతేకాకుండా అది ఎప్పటికంటెకూడా ఇప్పుడు ఇంకా సజీవంగా ఉంది.

1876 లో ప్రవాసంలో ఉన్నపుడు పొట్టియర్ "అమెరికా శ్రామికవర్గాన్నుంచి ఫ్రాన్స్ శ్రామికవర్గానికి" అన్న గీతం రాశాడు. దానిలో ఆయన పెట్టుబడి కాడికింద కార్మికుల బాధామయ జీవితాన్ని వర్ణించాడు. వారి పేదరికాన్ని, ఎముకలను పిండిచేసే శ్రమను, దోపిడీని, విప్లవ విజయంలో కార్మికులకుండే దృఢవిశ్వాసాన్ని వర్ణించాడు.

పారిస్ కమ్యూన్ తరువాత తొమ్మిది సంవత్సరాలకు పొట్టియర్ ఫ్రాన్స్‌కు తిరిగివచ్చి వెంటనే 'వర్కర్స్ పార్టీ'లో చేరాడు. ఆయన రచించిన గీతాల సంపుటి

మొదటి భాగము 1884 లో ప్రచురింపబడ్డది. 'విప్లవ గేయాలు' అన్న రెండవ భాగం 1887 లో ప్రచురింపబడ్డది. ఆయన అమరుడయిన తర్వాత ఆ కార్మిక రచయిత గీతాలు ఇంకా చాలా ప్రచురింపబడ్డవి

1887 నవంబర్ 8 న పారిస్ కార్మికులు పొట్టియర్ భౌతికకాయాన్ని, ఉరితీయబడ్డ కమ్యూన్ పోరాట వీరులందరూ ఎక్కడ సమాధిచేయబడ్డారో, అక్కడికి— పేరీ లెషైస్ సిమెటరీకి— తీసుకవెళ్ళారు. ఊరేగింపుగా పోతున్న ఆ కార్మికుల చేతినుండి ఎర్రజండాను లాగివేయాలన్న ఉద్దేశ్యంతో పోలీసులు క్రూరంగా వారిపై దాడిచేశారు. వేలాది మంది కార్మికులు పాల్గొన్న ఆ ఊరేగింపులో "అమరవీరుడు పొట్టియర్ వర్ధిల్లాలి!" అన్న నినాదాలు అన్ని పక్కలనుండి మిన్నుముట్టినవి.

పొట్టియర్ బీదరికంలో మరణించాడు. కాని ఆయన, శాశ్వతంగా నిలిచిపోయే ఒక స్మృతి చిహ్నాన్ని— అంతర్జాతీయ గీతాన్ని— మనకు వదిలివెళ్ళాడు. తమ పాటల ద్వారా ప్రచారంచేసే గొప్ప కార్యకర్తలలో ఆయనొకడు. ఆయన తన మొదటి గీతాన్ని రాసేటప్పుడు సోషలిస్టు శ్రామికులు పదులలో లెక్కబెట్టదగ్గవారుగా ఉండేవారు. కాని ఈనాడు కోట్లాది శ్రామిక ప్రజల హృదయాల్లో, వారి పోరాటాల్లో, ఆయన చరిత్రాత్మక గీతం— అంతర్జాతీయగీతం (Internationale) మారుమోగుతోంది.

ఓట్లు - శ్రామికజనం

శ్యామ్‌కుమార్

"మాపటికుంటె పొద్దటి కుండదు. పొద్దటికుంటె మాపటికుండదు— గసుంటో శ్శము మేము— ఓట్లేస్తె ఏమొస్తుంది మాకు? ఓట్లేస్తె బువ్వొస్తదా? కూరొస్తదా? మాపటికి లేకుంటె ఓట్లు పెడ్తయాయేంది?"

"ఓట్లెయ్యకముందు కమ్మగ, తియ్యగ మాట్లాడుతరు. ఓట్లేసుకున్నాక మొఖమె కనబడదు— గెల్చినంకైతే దొరలలెక్క, అసాములలెక్క కాలుమీదకాలేసుకొని దొరతనం సూపిస్తరు— ఓట్లేసుకునేముందు 'ఏమె ఎల్లి, ఏమె పోశి, ఒరే మైసిగ ఇటు రారా జోరికెలొడె' అనేటోడు ఓట్లకాలంరాగానే ఏమే యెల్లమ్మ, ఓ పోశమ్మ యెటో పోతున్నవ్! అని పల్కరిస్తడు— గసుంటి మనుషులుఈళ్ళు. ఇగమనం 'ఏంజెయ్యాలె దొర మాపటికి కూడులేదు, కుమ్మలేదు— ఐదారురోజులాయె ఓపూట తిన్నట్టు, ఓపూట తిననట్టు నడుస్తుందికాలం— ఇంటాయన ఏడికని కష్టపడుతడు— కష్టపడ్డా కడుపునిండుత లేదు— నేనుకూడ రెక్కలిర్సుకున్న ఏమిట్లకేమైత లేదు— కూలేమొ తక్కువాయె— బజార్ల రాషన్ మండిపోబట్టె, ఏదికొనబోదమన్న అగ్గి, అగ్గిమండినట్టు మండుతుంది— నల్గురు

పోరగాళ్ళ మేము బతకాలంటే శాన కష్టమైతుంది దొర- శానంటే శాన తక్లీఫ్ యెల్ల బోస్తున్నం- ఆయనైతే కడుపుకుబట్టగట్టుకోని పనికిపోతుండు- ఐనా ఇంట్లకు సాలుత లేదు- ఏదో ఇజ్జత్‌కుబతుకుతున్నం, ఈ బతుకుబతికెకన్న సచ్చిందినయముంది దొర- మా వనవాసం యెవరికి శెప్పుకుందుము- శెప్పుకుంటె యెవరు దీర్చుతరని- మా బతుకులె అన్నాయం బతుకులైనయ్- ఎంతకష్టపడ్డ, ఎంత రెక్కలిర్సుకున్న ఛేతికందుత లేదు పొందుత లేదు-' అని మా కష్టాలు చెప్పుతుంటే ఆదొర ఇదే సందనుకొని తన మాయమాటలు విప్పుతడు."

'గంత కష్టమొస్తె నాదగ్గరికి రాలేదేమె- నాదగ్గరికి రావొద్దా, వొస్తె యెలగొట్టునా? ఎదో ఉన్నదోలేందో ఇస్తుంటిని- ఐదో, పదో రూపాయిలిస్తుంటి- పైసల్ లేకపోతే కుండెడో, బుడ్డెడో వొడ్లు ఇస్తుంటి- గంత ఆదుకోకపోదునాయె నేను- ఇంతవరకు యెవడన్న నాదగ్గరకొస్తె లేదన్ననా? లేకుంటే లేదంట, ఉంటే ఉన్నదంట- ఉంచుకోని లేదంటనా నేను- గసుంటోన్నైతే ఇన్నిరోజులు ఊర్లె బతుకకనే పోతుంటి అ(... అదంత పోనీగని దొరసాని దగ్గరికిపోయి నా పేరుజెప్పి కుండెడొడ్లు కొలుపుమని జెప్పి తెచ్చుకో! మల్ల పీదగ్గర యెల్లినప్పుడు ఇద్దువుగాని- కష్టమొచ్చిందని సస్తరా పిచ్చిదాన- ఎట్లన్నో దినం ఎల్లగొట్టుకోవాలిగాని, కడుపుమాడి సావుకుదెగ్గైతారే- ఊర్లెఉన్నకాడికి ఒకరికొకరు ఆదుకోవాలెనే- వొడ్లయితె తెచ్చుకో... అ(- మర్చిపోయిన! ఓట్లు దగ్గరొస్తున్నయ్- జెర మీఇంటి ఓట్లు, మీ బస్తి ఓట్లు నాకే పడేట్టుసూడు- అ కోమటోడుకూడ నిలబడుతున్నట్టుంది- నాకెయ్యకు వానికే పేరు- వాడు యేద్దదోసుకుని బతికెటోడు- జెర మర్శిపోకు ఓట్లు...' అని తేనెపూసినమాటలు శాన బాగమాట్లాడుతడు 'మా దొర'"

"మాతోటి అవసరమున్నప్పుడె, గట్లమాట్లాడుతడు- కమ్మగతియ్యగ మాట్లాడి పనెల్లగొట్టుకుంటడు- మాతోని పనిలేకుంటె దోమను తీసేసినట్టు తీసేస్తడు దెగ్గరకుపోతె- కడుపుకాలి సస్తున్నాగాని 'అయ్యో' అనడువాడు- అసుంటోడు ఓట్లకాలంవొస్తె తియ్యగ మాట్లాడుతడు- అక్క, అమ్మ అనుకుంట అవసరం ఎల్లగొట్టుకుంటడు- శాన మోసకారోడు- వానిదేంజబ్బనో ఏమోగాని మాచెడ్డజెల్మ వానిది. శాన కనికరం లేనోడువాడు- పురుగులబడి సస్తడువాడు- ఈ ఓట్లేసుకునేటోల్లంత అందుతే జుట్టు పట్టుకుంటరు. అందకుంటే కాళ్ళు పట్టుకుంటరు. గసుంటి బాపతుగాళ్ళు పీల్లంత- ఈ ముండకొడుకులను నమ్మొద్దు, నమ్మితె నట్టేట్ల మునిగినట్టె- శాన పుశారుండాలె ఇసుంటోళ్ళతోటి- లేకుంటె బతుకులల్ల మన్నుబోయనీకి కూడ యెనకముందాడరు."

అని ఒక మధ్యవయస్కురాలైన, కూలినాలి జేసుకొని బతికే కష్టజీవి తన ఓట్లనుభవాన్ని తెలిపింది- మధ్యవయస్కురాలైనాగాని జీవితంలోని కష్టాల్లో, బాధల్లో

రాటుదేలిపోయింది. ఆమె జీవితం ఎన్నో ఎదురుదెబ్బలు తగిలి, వయసులో చాల పెద్దదిగ కనిపిస్తూంది. చిన్నవయసులోనె ఎన్నో అనుభవాలను పొందింది- అనుభవం వల్లనే ఓట్లను వొద్దంటుంది.

అరవైయేండ్ల ముసలాయన ఓట్లగురించి ఈవిధంగ చెప్పుతున్నాడు.

"ఓట్లేస్తే మనకేమొస్తుంది, అమ్మాని మొద్ద- ఎందుకెయ్యాలె- అంగ్రేజోడు పోయినప్పటినుండి ఓట్లేస్త నేపున్నం ఓట్లళ్ళ గెల్సినంక వాళ్ళు ఎవన్నిపొడుగుజేశింద్రు- ఎవన్ని పెద్దజేశింద్రు. ఎవన్ని ఉద్ధరించింద్రోంట! కాంగ్రెజోడొస్తె వాన్కి వోటేసి గెలిపిస్తిమి- వాళ్ళు మాకేమన్న ఒరగబెడ్తరేమో, మాబతుకులను జెర ఉద్ధరిస్తరేమో నగం కడుపుకు, సారెకడుపుకు తినెబదులు రెండుపూటలు తింటమేమో. జెర బట్టబాత మంచిగ కట్తమేమో, జెర మాపోరగాల్లు సదువుకొని కొలువులజేస్తరేమోనని ఆశపడి కాంగ్రేసును గెలిపిస్తె, వాడుమాకు తెడ్డుజూపి వాన్దివాడు సూసుకోని వాడే పెద్దగయి పోతుండె- మిద్దెలమీదమిద్దెలు, బంగ్లలమీద బంగ్లలు మారెక్కల సొత్తుతోటి కట్టబట్టె- మేము పండించిన పంటనే మాకు దక్కకుంటజేయవట్టె- ఉన్న భూములు, బోరం బొక్కలు వానిపాలె గావట్టె- పెండ్లాంమెడల పుస్తెకూడ వానిదగ్గరనే కుదవబెట్టిమి- లేనోళ్ళ మొఖమె సూస్తలేరు- ఓటు ఏసుకునెముందు ఒకమాట- ఓటు ఎసుకున్నంక ఒకమాట- గెల్సినంక మొఖమెకనబడదు- బంగారమైతది వానిమొఖం సూద్దామంటె- ఏమైన శెప్పుకుందామంటె కూడ దొరకడు-"

"ఇగ కమ్యునిస్టోడువొస్తె వాన్కివోటేసి వాణ్ణిగెలిపిస్తిమి- ఓట్లెయ్యకముందు భూములిప్పిస్తము, ఇండ్లుగట్టిస్తము, మాన్యాలిప్పిస్తము, మక్తలిప్పిస్తము, పున్నిప్పిస్తము, దున్కి ఇప్పిస్తమని జెప్పి ఓటేసుకున్నాక బొంటచెయ్యి సూపిచ్చి వాడు అవతలపడె- వాడు మిద్దెలు, మేడలు గట్టుకోని వాడు సుఖంగఉండె- ఇగ మేమె అద్వానపు బతుకు బతుకుతున్నం- కుక్కకంటె అన్నాయంగుంది మా బతుకులె- వాళ్ళె రోజురోజుకు ఉన్నోళ్ళుకావట్రి- మేమె రోజురోజుకు అడ్కతినబడ్తిమి- మా కడుపు కొలదా గిట్లయితె మేము మనుషులంకాదా? మేము గాడుదులమా? మనిషికి పుట్టలే? శెప్పుకుంటె శానుంది, శెప్పుతె తెల్లారదు, పొద్దీకదు-"

"ఎవన్ని నమ్మేటట్టులేదు ఇయ్యాలరేపు- ఎవన్దివాడు జూసుకోని పెద్దగయితుంద్రు- వానిమేలు వాడుసూసుకోని బతుకుతుంద్రి- 'తనుతింటె దరిద్రంబాశెనన్నట్టు ఈ దొరలు తలిగింద్రు మా పానానికి- వాడు కడుపునిండ తింటెపాలు వేరోల్లు తిన్నరనుకుంటడు- గసుంటోళ్ళు దావరమైనరు- ఆడ సీటుదొరుకుతదోలేదొ ఈడు పల్లకెక్కనంత వనైతది- ఈడ మమ్ములను దేకటోడెవుండడు- మాకుజెప్పిన భూములసంగతి, కొలువుల సంగతి గంగల గలుస్తయి, మేము ఏట్లగలుస్తము-"

"ఇదివరకు అది జేస్తము, ఇదిజేస్తము అనేటోళ్ళేగాని మాకు ఏదిజేశినోళ్ళు గాదు- పనిపడ్డప్పుడే గుర్తుకొస్తము మేము- పనయిపోయినంక వాడెవడో మేమెవరమో గట్లుంది జమాన."

"కాంగ్రెజోళ్ళ గెలిపించినా, కమ్యూనిస్టోళ్ళ గెలిపించినా మాకొచ్చింది ఏమి లేదు- వాడు మోసంజేసిండు వీడుమోసంజేసిండు ఇద్దరు దొంగలబిడ్డకొడుకులే- వాడేమి సుద్దపూసగాడు, వీడేమి సుద్దపూసగాడు- మమ్ములను దోచుకబతికేటోళ్ళు వీళ్ళంత-"

"అంగ్రెజోడు పోయినప్పటినుండి ఇప్పటిదాక, కట్టెపిట్టోలెనే బతుకుతున్నం- పొద్దంత రెక్కలిర్చుకోని పొద్దీకి ముక్కిపోయిన నూకలగూడు తినాలె, అండ్లకు కూరలా? నారలా? గింత కారమో, తొక్కో కలుపుకోని మింగాలె- అది తిన్ననాడు తిన్నట్టు లేనినాడు లేనట్టు- ఒక్కోసారి గంజికూడ దొరకదు తాగుదామంటె గట్లున్నయ్ మా బతుకులు- ఎప్పుడు అయినతిండి ఎరుగం- అయిన బట్టబాతలెరుగం ఇగో సాలిసాలని గుడ్డపేగు ముడ్డికి సుట్టుకోని దినమెల్లగొడ్తున్నం అంగి ఐతే ఎప్పుడైన వూరికిపోతెనే యేసుకుంటం, లేకుంటే బరిబాతల తిరుగుతం- ఆ వున్నఅంగి కూడ చీరుక చింపులైంది- ఏదో అతుకులబొంత పెయిమీద యేసుకొని పనెల్లగొడ్తున్నం- నెత్తికింత రుమాలుపేగు మాత్రం వుంటది- అదిగూడ పొక్కలీ పొక్కలే అయింది- ఏదో ఇజ్జత్‌కు బతుకుతున్నం- ఇగ గిట్లుంటే ఎవడయ్యా మమ్ములను ఉద్దరించింది- ఎవడయ్యా మమ్ములను ఆదుకున్నది- రెండేండ్లకు, మూడేండ్లకు వోటేయమని అడిగెటోళ్ళేగాని. మా బతుకులగురించి జెరంతనన్న ఆలోచనజేసేటోడు ఎవడయ్యా- మేము ఏట్లెగలిసినా గంగల గలిసినా పట్టిచ్చుకునె మొగోడెలేడు- మేము సస్తె ఏమి బతుకుతె ఏమి? వాళ్ళైతె హాయిగుంటరు- ఇప్పుడు మాత్రం నాకోటెయ్యి, నాకోటెయ్యి అని గడప గడపకు తిరుగతరు- ఈడ చెట్టుకు గాసినట్టు, దాశిపెట్టినట్టు చిటుక్కనవొస్తరు- ఏమన్న సిగ్గుశరముండాలె లంజకొడుకులకు ఓట్లుఅడగనీకి- 'వాళ్ళకు మనమేంజేసినం, ఎప్పుడాదుకున్నం, గంత కరువులు, కష్టాలొస్తె మనమేమి అందజేసినం' అన్న ఆలోచన మర్శి ఉరుకొస్తరు- ఈసారి ఎవడైన 'వోటెయ్యి'మని వొస్తె చెవ్వుతీసుకొని కొడ్తనుండి-"

అని అరవైయేండ్ల ముసలతను తన జీవితంలోపడ్డ కష్టాలు, నష్టాలు క్లుప్తంగ చెప్పి, ఓట్ల యొక్క బూటకం తెలిపాడు. అధికారుల అధికారదాహం, వాగ్దానాల కుక్కగొడుగులను వివరించాడు- మితవాద కమ్యూనిస్టుపార్టీ వాళ్ళ బండారం బయట పెట్టాడు- ఈ కాంగ్రేసు పాలనలో బీదవారికి అవగింజంతైన సుఖం దక్కలేదని, ఈ ప్రభుత్వం ధనవంతులదని, ధనవంతులు బీదవారిని ఉద్ధరిస్తారని నమ్మడం పగటికల అని అనుభవం ద్వార వివరించాడు.

ఇంకో ముసలామె ఓట్లగురించి ఈ విధంగ వివరిస్తుంది.

"ఈ ఓట్లుపాడుగాను- లేనోళ్ళము ఓట్లేస్తె మమ్ములను ఉద్ధరించెట్టుంది వీళ్ళు? మాదిగోళ్ళను, మాలోళ్ళను. లేనోళ్ళను ఇగ ములుపుకొస్తరు ఈళ్ళు! మావటికిలేక కూటికిలేక మేముంటే, వాళ్ళేమొ మోచేతిదాక నెయ్యికారంగ తినుకుంట, ఎటు వొద్దు పోక ముండకొడుకులు మీకు అదిజేస్తం, మీకు ఇదిజేస్తం మన్నుజేస్తం మషాణం జేస్తం అనుకుంట లేనిపోని మాటలు జెప్పి మాయజేసినట్టుజేసి ఓట్లేసుకుంటుండ్రు."

"మాకు మావటికిలేకపోతె పొయికుండ ఎక్కిస్తరా వీళ్ళు? వీళ్ళ మొఖాలల్ల మన్నువడ! వీళ్ళు చేయవట్టె గాసం గింత పిరమయింది- అంగ్రేజోడున్నప్పుడు రూపాయి తీస్కపోతె మోయలేనన్ని బియ్యమొచ్చేయి- తాగినంత కల్లు, సార దాగె టోళ్ళం- ఉప్పుమిరపకాయ ఎంత అగ్వఉండె- నాల్గుపైసలుపెడ్తె నాలుగుపూటలకు సరి పోయె మిరపకాయలొచ్చేయి- ఇంట్ల బోలెడంత గాసం మూలకుండేది- ఓయమ్మో ఇప్పుడు సూడు రూపాయిడిపిస్తె ఒక్కపూట కూరగాయకాదు- బియ్యమైతే బంగారం ధరైంది- రూపాయిబిళ్ళ పోరగాని ఇచ్చితోలిస్తే జేబులపట్టేంత సామానొస్త లేదు- ఇంక ఇప్పుడు అప్పటికంటె ఎక్కువ పండుతుంది, మరి ఏమైతుందో ఏమో? ఏట్ల గొట్కపోతుందో, గంగల గొట్కపోతుందో పండిన పంటంత- ఉన్నోళ్ళ బొందలల్ల పోసుకుంటుండ్రో పండిన పంటంత- ఎద్ద గింత అన్యాయమా- అవ్వ! సిగ్గుబోతది చెప్పుకుంటె-"

"పొయిలకు కట్టెలేదు, పొయిమీది కుండకులేనోళ్ళం మమ్ములను కష్టపెడ్తరు- మావటికి లేనోళ్ళంరా అంటె ఓటెయ్యనీకి ఇంటికాడ ఉండమంటరు- ఓటేసెటినాడు కూలినాలి బంద్అయి వాని ంబొదకు వోటెయ్యాలె- అయ్యల్ల కూడుండదు, కుమ్ముం డదు- వీన్కి ఓటేస్తె మాకొచ్చేది ఏందోంట?"

"మాచేతులతోటి పెద్దగయ్యి, మమ్ములనే దోసుకుంటరు- మారెక్కల కష్టమే అంత- పందిబొందలకు దన్పరియ్యాలి చేసిందంత- ఇమానంలేని ముండకొడుకులు-"

"జెన కూలి ఎక్కువజేసిస్తం, జీతాల్ ఎక్కువజేసిస్తం అన్న మాటేరాదు నోటికి గాని నాకోటెయ్యి, నాకోటెయ్యి అని మాత్రం ఇంటిసుట్టు తిరుగతరు- మా లేనోళ్ళ ఇండ్లళ్ళకు గాయాల్ల రాబుద్ధయితది వాళ్ళకు- వేరెప్పుడు మా వాసననే పడదు ముండ కొడుకులకు- మా వాసనపడనోళ్ళకు మా ఓట్లెందుకో మరి-"

"వాడొచ్చి ఓటెయ్యమంటడు, వీడొచ్చి ఓటెయ్యమంటడు- ఎవన్కి ఎందు కెయ్యాలె- ఎవన్కివోటెయ్యక మా పనేందో మేముజూసుకుంటం- మాపటికిలేకుంటె పెట్టెటోళ్ళుకారు, తీర్చెటోళ్ళుకాదు- అసలు ఓట్లతెరువు పోనెవద్దు! ఓట్లు బువ్వపెట్ట

టియికావు, కూరపెట్టిటియికావు- రోగమొస్తె, నొప్పొస్తె ఆదుకునేటియికావు- అసలు ఓట్లెయ్యకుంటె కొడ్తరా ఏంది? 'మాకు ఇష్టంలేదు మేమెయ్యం' అంటె ఖతం, వాడే మన్న పిల్గితె చీపురుకట్ట అందుకోని ఎంబడిబడ్తె సక్కగైతరు కొడుకులు-"

"మా అమ్మకడుపులకేలి బయటపడ్డప్పటి నుంచి ఇంతదాక కష్టాలతోనె పొద్దు పోయింది- ఎన్నడు తిని సుఖపడిందిలేదు, తాగి సుఖపడిందిలేదు ఎప్పటికీ కష్టాలే- ఈ కష్టాలల్లమున్నవడ, మేంజేసిన కష్టమంత యెటుబోతుందో ఏమోమరి (?) కూటికి అందదు- పొందదు- ఎవని నోర్లల్ల మన్నువడ్తుందొ, ఎవని చేతులకు జెట్టల్‌పుడ్తయొ మారెక్కల కష్టం తినలేక- గీ రాషన్ అగ్వజేస్తం- గీ కూలిపెంచుతం అనేటోడే లేడు- అన్నా జేసెటోడెలేడుగాని నాకోట్లెయ్యి నాకోట్లెయ్యి అనిమాత్రం చిటుక్కనొస్తది నోటికి- తోలు నాల్కెకు ఏంబాధైతది అననీకి, అన్ని అనొచ్చు కాని చేసి సూపెట్టాలె- వాన్ని మనిషంటరు- గది లెక్కంటరు- ఓర్నియవ్వ, ఓట్లేసిననాడు కన బడ్డ మొఖం, మల్ల సూద్దామంటె కంటికి కనబడదు- గసుంటి ముండకొడుకులున్నరు బూమ్మీద-"

"ఇగ ఇప్పుడు ఎవడైన ఓటెయ్యమని అడగనీకివస్తె, వాని మొఖంమీద కాకరిచ్చి ఊంచి, పదిమందితోటి ఊంచిపిస్త- ఇగ గప్పుడన్న సిగ్గుశెరానొస్తయి కొడుకులకు-"

అని ఆ ముసలామె తనజీవితంలో ఎదురైన బాధలు, కష్టాలు, కన్నీళ్ళు ఓట్ల కాలమప్పుడు జరిగే తంతు, వారి వాగ్దానాలను, బూటకపు మాటలను వివరించింది. తన జీవితకాలం మొత్తం ఏ సుఖాన్ని ఎరుగక, ఏ సంతోషాన్ని పొందక కష్టజీవిగ గడిపింది. ఇటు పిల్లలతోటి ఆడుకున్నట్టు, పాడుకున్నట్టులేదు- అటు పెనిమిటితో సుఖపడ్డట్టులేదు. నిన్నప్పుడు కష్టాలే, వయసులో కష్టాలే, ముసలితనంలో కష్టాలే. ఒక్కమాటలో చెప్పాలంటే కష్టాలు, బాధలు తానై, తనే కష్టాలు, బాధలుగ గడిపిన అనుభవశాలియైన ముసలామె నోటినుండి ఎన్నికల బహిష్కరణ విన్నాం- అనుభవాన్ని మించిన గుణపాఠం ఇంకేముంది?

తర్వాత ఇంకో పాతికేండ్లు దాటిన యువకుడు ఎన్నికల గురించి ఈవిధంగ వివరిస్తున్నాడు.

"ఓటడుగుతె జూతతోని కొట్టాలి పాలెగాళ్ళను- ఎవన్కి ఓటేసిన ఎవడేమి సి- జేండు అందరు లంగపాలెగాళ్ళే! పనున్నప్పుడె అయ్యప్ప క్షీరు- పనయినంక తంగేళ్ళపడ్తరు- అప్పుడు వాన్దివాడుజూసుకుంటడు, ఇగ మా ఏద్పేందో మేమేద్వాలె."

"ఓట్లు నెల, రొండ్నెల్లుందనగానే యిగ తిరుగుతరు- పీటలు, వందిళ్ళయేశి సభలు జేస్తరు- లోడస్పీకర్లుబెట్టి నోరు బొంగురుబోయెదాక ఒర్లుతరు- మెన్కటి ముచ్చట్లు

కథలు, మన్ను మషాడం ఎత్తుకొచ్చి మా దమాకులల్లబోస్తరు- బుర్రకథలు. సుద్దులు జెప్పి మావోళ్ళను ఆకట్టుకుంటరు- 'యిగ ఈసారన్న మంచిగైతయేమో బతుకుల'ని మావోళ్ళు మోసపోయి ఓట్లేస్తుపోతుంద్రు- వాళ్ళు గెలిసి మావోళ్ళకు తెడ్డుసూపెట్టి బయటపడిపోతుంద్రు- గిట్లనే కాలం జరుగుతూపోతుంది గాని మేము పశువులోలె మనుషుల్లెక్క వున్నమా, ఏమన్ననా ?"

"మా కీవూరే ప్రపంచం- ఎన్నటికైన ఒకనాడు ఊరుదాటి పొరుగూరికిపోతె అదే పెద్ద ఘనకార్యమైతది- పొద్దునలేస్తేనే పొలంల కురకాలె, మల్ల అంబటాల్లకు యింత తిని మల్ల మర్లాడాలె పొలంల- యిగ అద్దుమ్మరాతిరికి యింటికొచ్చి బుక్కెడు తిని కావలుంటె కావలికిపోవాలె, లేకుంటె బాయికాడ పండుకోవాలె- పెండ్లయినగాని వాడు యే గంట రెండుగంటలే యింటికాడ వుండాలె- మిగితా పొద్దంతా వాని సేవనే జెయ్యాలె- గింతజేసిన చేసిన అప్పు తీరదు మన్నులేదు. మా కష్టమంత మిత్తి పైసలకే సరిపోదంట- కష్టమంత మిత్తికే సరిపోతుంటే మేమేమితినాలె, పిల్లలకేమిపెట్టాలె బట్టబాతలేమి కట్టుకోవాలె, ఇల్లు సంసారం ఏమిగావాలె ?"

"గింత కనాకష్టం యెల్లబోస్తుంటే, కమస్కమ్ ఊర్లెఉన్న సర్పంచ్‌గాడు మమ్ములను పల్కరియ్యడు- జీతాల్‌గాని, కూలిగాని ఎక్కువ జేపియ్యడు. ఆ సాలె గాన్కె నూరునూటయాభై ఎకరాల భూముంది- యాభైమంది జీతగాళ్ళున్నరు- జీతాల్ ఎక్కువజేస్తె వాని యాభైమంది జీతగాళ్ళకు ఎక్కువ జీతాళ్ళు ఇవ్వబడ్తదని జీతాల్ ఎక్కువ జేపియ్యడు, మన్నులేదు- ఎవరైన 'సంఘ'పోల్లు వొస్తె వాళ్ళను ఊర్లెకెర్రాని య్యడు జీతగాళ్ళకు కూడ నూరిపోస్తడు 'సంఘపోళ్ళు మంచోళ్ళుకారు- మనుష్యులను సంపుతరు, ఆడోళ్ళను కరాబుచేస్తరు, గుడిసెలు తగులబెడ్తరు' అని- మా జీతగాళ్ళకు. కూలోళ్ళకు సంఘపోళ్ళ గురించి బాగతెలుసు- గసుంటి పనులు చెయ్యరని మావోళ్ళకు శాన నమ్మకం-"

"ఊర్లెఉన్న సర్పంచ్‌గాడే మమ్ములను దేకుతలేడంటే, ఎవడో మినిష్టరు, గిని ష్టరు వొచ్చి మమ్ములను ఉద్దరిస్తడని నమ్మకమేంది. వీడు శిన్నదొంగైతే వాడు పెద్దదొంగైతడు- అంతేగాని వాడుద్దరిస్తడన్న నమ్మకమేపోయింది- శాన బాదలుపడ్డం. శాన యేగినం మాకాన్దాన్నంత బాదలల్ల మునిగితేలింది. మా తాత సుఖపడలేదు, మా తాత సుఖపడ్డంత మా నాయ్న సుఖపడలేదు- మా నాయ్న సుఖపడ్డంత మేము సుఖపడుతలేము- గీ కష్టాల కన్నిటికి మునుము ఎవడో, ఏందో మాకు జెర జెర తెలుస్తుంది- పోయి పోయి గసుంటి దోసుకునెటోళ్ళకు ఓటేస్తమా ఇంక ? సచ్చినాగాని ఎయ్యం- ఎవడు దావ యేసుకుంటడో యేసుకోనీ- ఎవడైన నూరుజెప్పని పెయ్యిజూప్పని

మేము ఈసారి ఓట్లుయేసేదిలేదు- మేముకూడ శానరోజులైంది ఈఆలోచన చెయ్యబట్టి- తెగిడిస్తె తెడ్డేలింగం అన్నట్టు ఈసారి తెగిడిస్తెనె పనయితది. లేకుంటెలేదు-"

అవి పాతికేండ్లుదాటిన యువకుడు ఎన్నికలపై తన ఆగ్రహం తెలిపాడు- ఎన్నికలలో పాల్గొనే దోపిడి దొంగలపై కసిని ఆపుకోలేక విపరీతంగ తిట్టిపోసాడు. ఓట్ల కాలమప్పుడు ప్రజలను ఏవిధంగ మోసంచేస్తారో వివరించాడు ఈ ప్రభుత్వం, ఈ వ్యవస్థ వాళ్ళను ఎంత అజ్ఞానులుగ ఉంచిందో అమాయకంగ వివరించాడు- 'సంఘం' అంటే వాళ్ళకుగల సదభిప్రాయం ఎంతో ఇక్కడ తెలిపాడు. సర్పంచ్ వద్దనుండి మినిష్టరు వరకు అంతా దొంగలే అని అనుభవంవల్ల ఇప్పుడిప్పుడే తెలుసుకోని వాళ్ళను వాళ్ళవ్యవస్థను నమ్మ నిరాకరించాడు- చివరికి ఈ ఓట్లవల్ల సుఖంరాదని తెలిపాడు. సుఖం దొరకాలంటే ఏదో ఒకటి చెయ్యాలని ఉబలాటను ప్రదర్శించాడు. అంటే ఎన్నికలు పేటే వ్యవస్థను చిగురింపజేయవని దృఢంగ నమ్మాడు.

పాతికేండ్లు దాటిన యువకుడు పైవిధంగ తన అభిప్రాయం తెలుపగానే వెంటనే అక్కడి ఇంకో యువకుడు ఈ విధంగ చెప్పుతున్నాడు.

"ఇప్పుడు అందరు ఓట్లెయ్యం, ఓట్లెయ్యం అని వాన్ని వీన్ని తిడుతుండ్రు గాని ఓట్లకాలమప్పుడు వాడొచ్చి కల్లుబొట్టు తాగిపిస్తె 'సరె దొర నీకే ఏస్తం' అంటరు- ఈడొచ్చి రొండు రూపాలిస్తె 'మంచిద్దొర నీకే ఏస్తం' అంటరు- అప్పుడు, ఇప్పుడు మాట్లాడిన మాటలన్ని మర్శిపోతరు- వాడొస్తె వానిసంకల జొర్రుతరు, వీడొస్తె వీని సంకల జొర్రతరు- మనదాంట్ల మనకే ఒకటిలేదు-"

"ఇప్పుడు మాట్లాడినట్టె అప్పుడు మాట్లాడాలె- ఈ ముసలోళ్ళు ఇప్పుడు తల కాయలూపుతరు, అప్పటికి వాని ఎంగిలి మెతుకులకు, వీని ఎంగిలి మెతుకులకు ఆశ పడ్తరు- కుక్కకు బొక్కేసినట్టు రొండు రూపాలుపడేస్తె వీళ్ళు ఆడికే సంబరపడి కల్లుదుకొండ్ల లాగుకుంట కూసుంటరు- ఇగ బతుకు మంట్లెగలిసిపోని, యేట్లెగలిసి పోనీ- ఇప్పుడు మాత్రం ముద్దుగ మాట్లాడుతుండ్రు-"

అని అనగానే. రోశంగ అక్కడి ఒక ముసలతను ఈవిధంగచెప్పుకొస్తున్నాడు.

"అరే, కల్లుగాగి ఉచ్చబోస్తె ఉచ్చల పోతదిరా! ఎవడ్రా కల్లుకాసపడ్డోడు- వీనిఅమ్మ ఎలెక్షన్లకున్నలౌడ, మా పానాలు మాగినకుండైనట్టు ఐతే కల్లు, సారకు ఎవడ్రా ఆసపడ్డోడు- వాని ఎంగిలికి ఎవడ్రా తొంగిసూసినోడు- మాబతుకులన్ని పెంక మీద గింజలేగినట్టు ఎగుతుంటె వాని రొండుమూడు రూపాలకు ఆసపడి కూసున్నాంరా? 'లొటపెట పెదవులకు నక్కాసపడ్డట్టు'గ బతుకు యెల్లబోయలేదురా, రెక్కలన్ని ఇర్సుకోని బతికినంరా- మా రెక్కలన్ని పుండ్లయి సొనలుగారినా పనికిపొయినంరా.

మా నెత్తిల ఎన్నిపొక్కులున్నాయి మీకేం తెలుసురా, పెయ్యెత్తినం, పిడకెత్తినం, కట్టెలుకొట్టినం, రాళ్ళుకొట్టినం, బంగ్లలు గట్టినం ఇప్పుడు గుడిశెలల్ల ఉంటున్నాం"

"అరే మీకే తెలుస్తదనకొంటుండ్రి, మాకన్నా జెరంతన్న తెలుసు ఇన్నేండ్లు కష్టబడ్డది యేళ్లెగలిసింది. ఇంకా యేళ్లెగల్వనిస్తమా? మాకు ఉడుకు రక్తం లేకపోవచ్చుగాని జెర ఆలోచన జెసె దమాకుంది. ఇన్నేండ్లువాన్ని పెద్దగజేసి, వీన్ని పెద్దగజేసి మేము యేడున్న గొంగడి ఆడినే వున్నట్టు బతుకుయెల్లబోస్తు వచ్చినం. ఇంకా అట్లనే జరుగుతదనుకోకు.

అని ముసలతను కసిగ ప్రతిజ్ఞచేస్తున్నట్టుగ మాట్లాడాడు. తన మాటల్లో నూటికి నూరుపాళ్ళు నిజముందన్నట్టు గర్వంగ ఆ యువకునివైపు చూసాడు.

ఈవిధంగ శ్రామికులు ఎన్నికలతో చాల విసిగి వేసారిపోయిండ్రు- ఎంత విసిగిపోయారో ఒక్కొక్కప్పుడు చెప్పనీకి మాటలే రావు నోటికి- అంతగ అపనమ్మకమైంది ఎన్నికల తతంగం.

స్వా(హా)తంత్రం వచ్చిన ఈ 28 సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో శ్రామికుల అనుభవాలు వారి జీవితాలలో మైలురాళ్ళుగ నిలిచిపోయాయి. ఈ బాధాకరమైన మైలురాళ్ళను ఇంకెన్ని మోయలేరు శ్రామికజనం. తమ బాధలను, కష్టాలను, తమ సమస్త సంకెళ్ళను ఛేదించుకొనీకి వెల్లువలా శ్రామికజనం ఉప్పొంగుతున్నారు- తరంగంలా ఉవ్వెత్తున పైకిలేస్తు, పడ్తు లేస్తు తీరంచేరేవరకు ఈ శ్రామికజన తరంగం ఆగదు.

అతి తొందరలోనె వారి ఆశయం నెరవేర్చుకోనీకి మహావెల్లువలా ముందుకొస్తున్నారు- ఆ వెల్లువను ఆపడం ఎవరితరం?

1. బూటకపు ఎన్నికలను బహిష్కరించండి.
2. తుపాకి గొట్టంద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుంది.
3. సాయుధ మార్గమే శ్రామికుల మార్గం.
4. ఓటడుగుతె జూతతోని కొట్టాలి.
5. సాయుధ విప్లవం వర్ధిల్లాలి.

జననాట్యమండలితో సృజన ఇంటర్వ్యూ

ప్ర: జననాట్యమండలి అవసరం ఏమిటి?

జ: నేడు మనదేశానికి విప్లవం అవసరం. దానికి ప్రజా సైన్యంతోపాటు సాంస్కృతిక సైన్యంకూడా అవసరం. అందులో భాగంగానే జన నాట్యమండలి అవసరం.

ప్ర: జన నాట్యమండలి ఎలా ఏర్పడింది,

జ: క్రితంలో 'ఆర్ట్ లవర్స్' అనే సామాన్య సాంస్కృతిక సంస్థగా ఉండేది. దేశంలో వచ్చిన రాజకీయ మార్పుల కనుగుణ్యంగా 1970 కల్లా సభ్యుల ఉత్సాహంతో ఆ సాంస్కృతిక సంస్థకాస్త విప్లవ సాంస్కృతిక సంస్థగా మారింది. ఈ నూతనవెల్లువ మొదట్లో సాహిత్యగోష్ఠులను, కవి సమ్మేళనాలను మాత్రమే నిర్వహించేది. కవి సమ్మేళనాలద్వారా గ్రామ గ్రామాన విప్లవ ప్రచారానికి పూనుకున్నది. సుమారు 10 మంది సభ్యులు సైకిళ్ళపై లౌడ్‌స్పీకర్ కట్టుకొని గ్రామాలకువెళ్ళి, కాస్త ఎత్తయిన చోట్లో, లేక రచ్చబండవద్ద ఒక టేబుల్‌వేసి రికార్డులుపెట్టి జనాన్ని ఆకర్షించి వాళ్ళు అక్కడ గుమిగూడగానే తమ తమ కవితలు చదివి వినిపించేవారు. ఏస్థలమూ అనుకూలంగా లేకపోతే ఒక వీధిలో చాప పరిచి దానిపై మైక్ పెట్టి వినిపించేవారు. పట్టణాలలోనైతే స్కూల్ హాల్‌లోనో, లైబ్రరీలోనో కవి సమ్మేళనాలు జరిపేవారు. ఈ కార్యక్రమాలు బస్తీలలోని మధ్య తరగతి జనానికి అర్థమయ్యేవిగాని గ్రామాలలోని రైతాంగానికి పూర్తిగా అర్థమయ్యేవిగావు. ఈ కవి సమ్మేళనాలతో, సాహిత్య గోష్ఠులతో ఒక సంవత్సరం గడవడంతో సమీక్షించుకొని కొన్ని గుణపాఠాలు తీసుకోవడం జరిగింది అది-ఈ కవి సమ్మేళనాలకంటే పాటలు, నాటకం, ఇతర జానపద కళారూపాలు జనానికి బాగా అర్థమౌతాయని. దాంతో సంస్థ సభ్యులు (సభ్యులువాళ్ళే, రచయితలు వాళ్ళే) కవితల బదులు పాటలు రచించాలని, ప్రదర్శించాలని నిర్ణయంజరిగింది, పాటలు మొ॥ వాటి కార్యక్రమం మొదలెట్టేవరకు మంచి ఫలితాలు వచ్చాయి. ఆ ఉత్సాహంతో నాటిక Takeup చేశాం. అవసరంలో మిగితా కళారూపాలు.

ప్ర: జన నాట్యమండలి ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు కళాకారుల్ని ఎలా కూడవేశారు? వారిలో ఉన్న కళా చాతుర్యాన్ని (artistic talent) బట్టా? లేక వారికున్న రాజకీయ అవగాహనను బట్టా?

జ: మొదట్లో కళా చాతుర్యంగల కళాకారులపై ఆధారపడ్డాము. వాళ్ళు మొదట్లో కొస్తు బాగానే ఉపయోగపడ్డారు. వారికి ఏ అవగాహనలేదు: మిత్రులైనందువల్ల వచ్చి మా సభ్యుల పాటలకు బాణీలు కట్టి పాడేవారు. ఆ తరువాత మేమే చొరవ తీసుకొని,

వీళ్ళ సహకారంతో వివిధగ్రామాలలో యువకులను కలిసి ప్రదర్శనలు ఇచ్చేవారం. ఐతే అలా గ్రామాలకు వెళ్ళేప్పుడు 6 నుండి 20. 45 మైళ్ళవరకు సైకిళ్ళపై ప్రయాణించ వలసి వచ్చేది. ఈ కళాకారులకు రాజకీయ అవగాహన లేనందున ఒకటి రెండుసార్లు వచ్చి ఆ తర్వాత మానేసారు. దాంతో మాలోఉన్న కాస్త కళానైపుణ్యంతో పాటలు మేమే స్వంతగా పాడేవాళ్ళం. ఢోలక్, హార్మనీ వాయించేవాళ్ళు నటులు మాలో మొదట్నించి ఉన్నందున కొంత అనుకూలించింది. మేము పాడే పాటల దరువులు అంత చక్కగా పాడక పోయినా మొదట్లో గ్రామాల్లో జనం వాటికి ఎక్కువ ప్రాముఖ్యత నివ్వలేదు. పైగా వారు ఎంతో ఎత్తేజితులైనారు. మాకు చాలా ఉత్సాహాన్నిచ్చారు. అదే మాకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది. అలాగే మా సభ్యులు మంచి కళాకారులుగా (ప్రజలభావాలకనుగుణ్యంగా) రూపొందడం కొత్త కళాకారుల్ని ఆకర్షించి చేర్చుకోవడం, నెమ్మదిగా వాళ్ళను రాజకీయంగా అభివృద్ధి చేయడం జరిగింది

ప్ర. కళాకారుల్ని అట్టడుగు వర్గాలనుండి తీసుకున్నారా? లేక కళా ప్రవేశమున్న ఏ వర్గపు వారినైనా తీసుకున్నారా?

జ: మొదట్లో మాలో మధ్య తరగతి నుండి వచ్చిన వారే ఎక్కువ మంది. కాని అతి కొద్ది కాలంలోనే శ్రామిక వర్గంనుండి వచ్చిన వారిని ఆకర్షించడం, చేర్చుకోవడం జరిగింది. ఇక కళానైపుణ్యమా! నిజం చెప్పాలంటే మాలో చాలా మందిని విప్లవ రాజకీయాలు, ప్రజలకు సేవచేయాలనే తహతహనే మంచి కళాకారులుగా మలచింది.

ప్ర: పై వర్గాల నుండి, మధ్యతరగతి నుండి వచ్చిన పెడదోరణు లేమైనా ఉన్నాయా?

జ: వర్గసమాజంలో వివిధ వర్గాల భావాలు అన్ని పార్టీలలోనూ, సంస్థలలోనూ ప్రతిబింబిస్తాయి. జ. నా. మంలో వివిధ వర్గాల నుండి వస్తారు కనుక అందులో కార్మిక వర్గేతర భావాలు చొరబడే అవకాశం చాలా ఉన్నది. దానిని సరైన విప్లవ సంస్థగా తీర్చిదిద్దాలంటే సిద్ధాంత పోరాటం చాలా అవసరం. ఆచరణే సరిఅయిన సిద్ధాంతాన్ని కల్గియున్నామనేందుకు గీటురాయి. మా సభ్యులలోని వివిధరకాల పెడధోరణులను ఈవిధంగానే ఎదుర్కొన్నాము.

ప్ర: క్రింది వర్గాల వారిలో త్రాగుడు మొ॥ దురలవాట్లుంటే వారిని చేర్చుకుంటామా? చేర్చుకుంటే వారితో ఎలా ప్రవర్తించాలి?

జ: శ్రామకవర్గంలో సర్వసామాన్యంగా త్రాగే అలవాటు ఉంటుంది. అలాగని వాళ్ళని కాదని మనం ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేం; ఐతే పూర్తిగా తాగుడుకు బానిసలు కానివారే తక్కువమంది ఉంటారు. మాలోకి వచ్చిన కొందరు సభ్యులు

తమ విధానాల్ని చాలావరకు సంస్కరించుకున్నారు. మన రాజకీయాలు, ప్రజలకొరకు చిత్తశుద్ధితో పనిచేయాలన్న దీక్ష వాళ్ళను సంస్కరించింది. సభ్యునిగాచేరిన ఒక కూలీ కుర్రవాడు తన త్రాగుడు వ్యసనాన్ని కొస్త పవరించుకొని మరో సభ్యునితో ఒకసారి ఇలా అన్నాడు "మిమ్మల్ని చూస్తుంటే నాలోని చెడ్డ లక్షణాలు ఒక్కొక్కటే పోతున్నాయ్!"– మా ఆర్గనైజర్లు కొంతమంది రైతులతో కూలీలతోపాటు కల్లుదుకాణానికి వెళ్ళి, వాళ్ళతో అలా స్నేహంచేసి వాళ్ళను మన రాజకీయాలపట్ల, ఆకర్షించిన సంఘటనలు కూడా లేకపోలేదు! అందుచేత ఇక్కడ త్రాగటమా! మానటమా!! అన్నది సమస్యకాదు. మన రాజకీయాలను ప్రచారంచేయడానికి ఆర్గనైజేషన్ విషయంలో ఎంత చురుకుగా, గాడితప్పకుండా మెదలాలి అన్నదే మనం దృష్టిలో ఉంచుకోవాలి.

ప్ర: జ. నా. మం లో స్త్రీ పాత్రలకు స్త్రీలు అవసరమా? లేక పురుషులే నటించవచ్చునా?

జ: జ. నా. మం లో మొదట్లో స్త్రీ పాత్ర మగవాళ్ళే ధరించేవారు. మన రాజకీయాలవేపు ఆకర్షించబడిన అమ్మాయిలు ఆ తర్వాత చేరి కార్యక్రమాలకు మరింత సహజత్వాన్ని పుష్టిని ఇచ్చారు.

ప్ర: రిహార్సల్స్‌కు అందరూ అనుకున్న సమయానికి వచ్చేవారా? వచ్చేటట్లు చేయడానికి ఏంచేసేవారు?

జ: కొత్తలో కాస్త క్రమంగానే వచ్చేవారు. ఐనా సమయానికి రాకపోవడం, డుమ్మాకొట్టడం మేం కూడా ఎదుర్కొన్నాం. ఐతే ఆర్గనైజర్స్ పట్టుదలతో, దీక్షతో వాళ్ళ ఇల్లిల్లు తిరిగి, లెటర్స్ పంపి ప్రోగుచేసేవారు. అలాగే సమావేశాలుపెట్టి సమయానికి రిహార్సల్స్‌కుగాని, ప్రోగ్రాంకుగానీ రాకపోయినందువల్ల, మానేసినందువల్ల ఎంత నష్టం జరిగిందో చెప్పి విమర్శించేవాళ్ళం. దాంతో ఈ సమస్య కొంతవరకు పరిష్కారం అయింది!

ప్ర: రోజూ అందరూ కలిసి ప్రాక్టీసు చేసేవారా? లేక రెండురోజులకొకసారా? లేక ఇళ్ళలో ప్రాక్టీసుచేసుకొని వారానికొకసారి అందరూ కలిసి ప్రాక్టీసు చేసేవారా?

జ: తప్పనిసరిగా రోజూ రిహార్సల్స్ చేయడమే సరైన పద్ధతి. లేకపోతే అది రిహార్సల్స్ అవదు. ఐతే అందరూ రాకపోతే పార్ట్‌పార్ట్‌గా చేసేవాళ్ళం. ఐనంతమటుకు అందరం కలిసి ప్రాక్టీసు చేయడానికి ప్రయత్నించేవాళ్ళం. ఇళ్ళల్లో రిహార్సల్స్‌చేసే పద్ధతిలేదు! ఒకవేళ వేరే గ్రామంలో ఎక్కువమంది సభ్యులున్నట్టయితే అక్కడో అనుకూల స్థలం చూసుకొని అక్కడ చేసేవాళ్ళం.

ప్ర: ఎక్కువ మంది ఉన్నచోట రూం తీసుకున్నారా? లేక పోలీసుల నిఘా లేనిచోట తీసుకున్నారా? రూము పక్కవారికి అభ్యంతరంకానీ, పోలీసుల నిఘాకానీ లేదా? ఉంటే ఏంజేయాలి?

జ: మనకు రిహార్సల్స్‌కు ఎక్కడ అనుకూలంగా ఉండి అందరూ రాగలుగుతారో అక్కడ రూం తీసుకోవచ్చు. ఇక పోలీసుల నిఘా అంటారా? వాళ్ళ నిఘా లేనిచోటు మొత్తం ఇండియాలో ఎక్కడైనా ఉండగలదా? ఐనా మనది బహిరంగ కార్యక్రమం గనుక మన కార్యక్రమాల్ని బహిరంగంగానే ప్రదర్శిస్తాం కాబట్టి ఆ ఆలోచనే అనవసరం. ఇక పక్కవాళ్ళకు అభ్యంతరం కలగకుండా చూసుకోవాలి! వాళ్ళతో కలుపుగోలుతనంగా ఉంటే ఈ సమస్య కొంతవరకు పరిష్కారం కాగలదు.

ప్ర: వాయిద్యాలు అన్నీ సమకూర్చుకొని ప్రాక్టీసు మొదలెట్టారా? లేక క్రమంగా వాటిని సమకూర్చుకున్నారా?

జ: క్రమంగానే సమకూర్చుకున్నాం.

ప్ర: క్రమంగా సమకూర్చుకుంటె మొదట కావలసిన వాయిద్యాలెవ్వి?

జ: డప్పు, డోలక్, గజ్జెలు ఉంటే పని ప్రారంభించవచ్చు. హార్మోనీ ఉంటే మరీ మంచిది.

ప్ర: మీరు పాటలకు బాణీ ఎలా కట్టేవారు?

జ: సహజంగా మేము జానపదపాటలపై కేంద్రీకరించాం కాబట్టి, ఆ దరువుల కనుగుణ్యంగా పాటలు రాసుకొని ఆ దరువులపైనే పాడుతాం.

ప్ర: మీరు ఎక్కువమంది నగరాల్లో ఉండేవారు కదా! గ్రామాలలోని వివిధ కళారూపాలు ఎలా పట్టుకోగల్గారు?

జ: గ్రామాలలో పనిచేసి, రైతాంగంమధ్య తిరిగితే, ఆ అనుభవంతో వారిలో ప్రచారంలో ఉన్న కళారూపాలు పట్టుకోవడం అంత కష్టంకాదు; దానికి పట్టుదల, కృషి కావాలి!

ప్ర: మన పాటలకు ప్రజలకు నచ్చిన (Popular.) సినిమా రాగం (Tune) పెట్టవచ్చా?

జ: అలాచేయవచ్చు. మనసాహిత్యం, కళలు కత్తిలా ఎలా జనంలోకి తీసుకపోవాలన్నదే ముఖ్యంకాని సినిమా ట్యూనా, మరొకటా అన్న వివాదం అనవసరం!

ప్ర: పట్టణాల్లో మధ్యతరగతి వారికి, మేధావులకు, కార్మిక వర్గానికి, అలాగే పల్లెల్లో రైతాంగానికి వేర్వేరు పాటలు నాటికలు రాయాల్సిన అవసరంలేదా?

జ: తప్పకుండా ఉన్నది. గ్రామాలలోగానీ, పట్టణాలలోగాని ఆయా ప్రజల స్థాయి ననుసరించి మన ప్రమాణాలను అభివృద్ధి చేసుకోవాలి: అలా చేయడంద్వారానే మనం విస్తృత ప్రజా బాహుళ్యానికి సేవచేయాలన్న దృక్పథంనుండి తప్పిపోము.

ప్ర: డప్పులు, ఢోలక్ లేకాక మోతర్ గన్, గిటార్ లాంటి వాయిద్యాలు (Instruments) వాడవచ్చా ?

జ: మన ప్రజలలో విశేషంగా ప్రచారంలోఉన్న ఢోలక్, డప్పు, హార్మనీ మొదలగు వాయిద్యాలతో మనం విశేషంగా ప్రచారం చేయగలం పేద రైతాంగాన్ని ఆకర్షించడానికి, వారిని కార్యోన్ముఖుల్ని చేయడానికి నడుంకట్టాం కాబట్టి మన కార్యక్రమాలు సాధ్యమైనంత పొదుపుగా ఉండాలి. ఖనంతమటుకు హంగామాలవేపు వెళ్ళకూడదు.

ప్ర: శాస్త్రీయ సంగీతంలో పాటలు మీలో ఎవరైనా పాడతారా ? దాని వలన జనాన్ని ఉత్తేజ పర్చగలమా ? శాస్త్రీయ సంగీయ పరిజ్ఞానం ఉండి మన అవగాహన ఉంటే, ఇప్పటికన్నా బాగా పాడగలుగుతారా ? లేక భేధమేమీ ఉండదా ?

జ: శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం ఉంటే మంచిదే : కాని దానికోసం ఇప్పుడు పనిగట్టుకొని నేర్చుకోవల్సిన పలలేదు. మాలో ఆలా పాడేవారు ఎవరూలేదు : ఇక శాస్త్రీయ సంగీతంతో జనాన్ని ఉత్తేజపర్చగలమా అన్నసమస్య : మనదేశంలో అధికశాతం నిరక్షరాసులు అన్నసంగతి అందరూ తెలిసిందే : వారిని కదల్చాలంటే జానపద రూపకాలే ముఖ్యంగా చేపట్టాల్సిఉంటుంది. శాస్త్రీయ సంగీతం లాంటివి తీరిగ్గా ఆలోచించవల్సిన విషయాలు.

ప్ర: మీరు ప్రధానంగా గద్దర్ పాటలే ఎందుకు పాడతారు ? విరసం రచయితల పాటలకు, శివసాగర్ మొద॥ వాళ్ళ పాటలకు ఎందుచేత బాణీకట్టలేకపోయారు ?

జ: మొదట్లో మేము విరసం రచయితల పాటలే పాడేవారం. ఆ తర్వాత గద్దర్ పాటలు రాశాడు. అవి గ్రామాలలో, ఇటు పట్టణాలలో కూడా విశేష ప్రజాదరణ పొందాయి. ముఖ్యంగా జానపదరీతిలో ఉండి, ప్రజాభాషలో ఉట్టిపడుతున్నాయి కాబట్టి, విప్లవ రచనలలో అవి విశిష్ట స్థానాన్నిపొందాయి. వాటిని జనంకోరుతున్నారు అందుచేత జనం కోరికపై గద్దర్ పాటలే ఎక్కువ పాడుతున్నాం.

ప్ర: జననాట్యమండలి కార్యక్రమాలు ప్రజలలోకి చొచ్చుక పోవడానికి వాటిలోని భావమే కాకుండా, ఇంకేమైనా కారణాలున్నాయా ? అందుకు అవలంభించిన పద్ధతులేమిటి ?

జ: జ. నా. మం. కార్యక్రమాలు ప్రజలలోకి చొచ్చుకపోవడానికి వాటిలో భావం (రాజకీయాలు) ముఖ్యకారణమైనప్పటికీ. దానితోపాటు రూపం, భాష కూడా ముఖ్యమైనవి. ఈ మూడింటి సమన్వయం కుదిరినప్పుడే అవి ప్రజలలోకి బలంగా వెళ్ళగలవు

ప్ర: ప్రదర్శన ఇవ్వడానికి స్టేజీ అవసరమా? స్టేజీలేనిచోట ఎలా ఉండాలి? ప్రేక్షకులు ఎటువేపు కూర్చుంటారు? కళాకారులు ఎటుతిరిగి నటించాలి?

జ: స్టేజీ ఉంటే మంచిదే; లేకపోతే ఏ ఎత్తయిన ప్రదేశాన్నయినా స్టేజీగా ఉపయోగించుకోవచ్చు. స్టేజీ అనుకూలతనుబట్టి ప్రేక్షకులు కూర్చుంటారు ఒక్కొసారి (తప్పని సరైనప్పుడు) స్టేజీచుట్టూ జనం కూర్చున్నా ప్రదర్శన ఇవ్వగలగాలి; ఐతే ఇక్కడ నటులు గమనించదగ్గ విషయమేమంటే ఏదో ఒక పక్క ఎంచుని అటువేపే తిరిగినటించాలి. చుట్టూ ప్రేక్షకులుఉన్నారు కాబట్టి చుట్టూ తిరిగి నటించగూడదు.

ప్ర: ప్రదర్శనకు కర్టన్లు అవసరమా? కనీసం ముందు కర్టన్ ఐనాకావాలా? సెట్టింగులు అవసరమా? అవసరమైతే ఎక్కడ అవసరము?

జ: కర్టన్లు అవసరమాలేదా అన్నది సమస్యకాదు; అవి మనకు అందుబాటులో ఉన్నాయా లేవా అన్నది– కర్టన్లు ఉంటే వాడుకోవాలి; ఐతే అవి లేనిచోట కూడా ప్రదర్శన ఇవ్వడానికి మనం సిద్ధంగాఉండాలి. ఇక సెట్టింగ్ అవసరాన్ని. వీలునుబట్టి.

ప్ర: ఎక్కడేనా, పట్టణాల్లోగూడా మైకులులేకుండా మన ప్రదర్శన విజయవంతమవుతుందా?

జ: ముందు అనుకున్నట్టు తక్కువ హంగామాతో ఎక్కువ ఫలితాన్ని సాధించడం ధ్యేయంగా ఉంచుకోవాలి; మైకు, కర్టన్లు, సెట్టింగులు మొ॥ అన్ని విషయాలలో అదే పద్ధతి అవలంబించాలి; effect గా ప్రదర్శించగలగాలేకాని మైక్‌గాని మరొకటిగాని లేకుండా ప్రదర్శన ఎందుకు విజయవంతంకాదు;

ప్ర: కొన్ని గ్రామాలలో కరంటుగాని, పెట్రోమాక్సు లైట్లుగాని అందుబాటులో లేకపోతే మన కార్యక్రమం ఎలా నడపాలి? లేక ఆపివేస్తామా?

జ: ఆపివేస్తామా; అన్న సమస్యతో ప్రారంభమయితే ఎన్నోసమస్యలు ఎదురై కార్యక్రమాలు అసలు కొనసాగవు. కాబట్టిఎదురయ్యే ప్రతిసమస్యను మనం ఆచరణలో పరిష్కరించుకోవలసిందే; కరంటు రాకముందు అసలు ప్రదర్శనలే జరుగలేదా; ప్రజలకు సేవచేయడం అంటే ప్రజలలోకి చొచ్చుకపోయి సొంతచొరవతో ప్రదర్శనలివ్వాలి. అప్పుడు లైట్లు మైక్ అనే సమస్యలు చాలా సులభంగా పరిష్కారం ఐపోతాయి.

ప్ర: గ్రామీణ ప్రాంతాల్లో మనకు అందుబాటులో ఉండే మేకప్ (Make-up) ఏమిటి? లేక ప్రతిచోటికి మేకప్ సామాగ్రి మనతో తీసుకవెళ్ళాలా?

జ: మేకప్‌సామాగ్రి మనతో తప్పక తీసుకవెళ్ళాలి। ఒకవేళ మనం అంతగా తీసుకపోలేని పరిస్థితివస్తే, గ్రామాలలో సామాన్యంగా ప్రజలు వాడుకునే సామాగ్రి తోనే మనం వేదిక ఎక్కవలసి ఉంటుంది.

ప్ర: మేకప్, డ్రెస్ ఎలా ఉండాలి?

జ: పాత్రలకు అనుకూలంగా ఉండాలి; అతి సామాన్యంగా కూడా ఉండాలి.

ప్ర: ఏ పాత్రకైనా కావలసిన బట్టలు, ఆభరణాలు (ఉదా: గొంగడి, కంబళ్లు మొ॥) మీరు సొంతానికి సంపాదించుకున్నారా? లేక ఏ ఊరికెడితే ఆ ఊళ్ళో ప్రజల వద్దనుండి సేకరించారా? ఎలా చేశారు?

జ: గ్రామీణ వాతావరణాన్ని చిత్రించే రూపకాలే ఎక్కువ ప్రదర్శిస్తాం కాబట్టి గోచీలు, ధోతులు, రుమాల్లు: చీరెలు, సెల్లాలు (భుజంపై వేసుకునే కండువా) మొదలగునవి మనం సంపాదించడం అవసరం. అవి మన వెంబడి ఉంటే ఎప్పుడు ఎక్కడ ప్రదర్శన ఇవ్వాలనుకున్నా మనకు తేలిక అవుతుంది. లేకపోతే- ప్రతిదీ తడుముకో వలసివస్తుంది ప్రతిసారి. సమయానికి ఏదీదొరకదు. ఇక మోయలేని గొంగళ్ళు మొ॥ ప్రదర్శన ఇచ్చే గ్రామాల్లో రైతులనుండి సేకరించి, వాడుకొని ప్రదర్శన ఐపోవడం తోనే పాడుచేయకుండా తిరిగి జాగ్రత్తగా ఇచ్చివేయాలి। జననాట్యమండలి బట్టలు (Castooms) క్రమంగానే సంపాదించుకున్నది.

ప్ర: మీ డ్రామాకు స్క్రిప్టు (రచన) లేదట నిజమేనా? స్క్రిప్టు లేకుండా ఎలా ప్రాక్టీసు చేశారు? ఎలా ప్రదర్శించారు?

జ: ఇంతవరకు "బీదలపాట్లు" నాటికకు స్క్రిప్టులేనిమాట। నిజమే। ఇప్పటి ప్పుడే సాంస్కృతిక సంస్థల ప్రదర్శనార్థం స్క్రిప్టు తయారు చేస్తున్నాం. ఐతే ఇంత వరకు Extempore గా వేసేవాళ్ళం. అందుకు నటకుల చొరవ, ప్రజ్ఞ అవసరం. ప్రయత్నిస్తే మిగతా దళాలు కూడా చెయ్యవచ్చు. కాని స్క్రిప్టు లేకుండా ఉండడమే ప్రత్యేకం అనేదిగా తయారుకావద్దు.

ప్ర: ప్రదర్శన ఇచ్చే ఒకటి రెండు రోజులముందు, ఆ గ్రామ పరిస్థితి తెలుసుకుంటారా? వాటిని మీ ప్రదర్శనలో ప్రస్తావిస్తారా? దాని ప్రభావం ఎలా ఉంటుంది?

జ: అలాచేస్తే మంచిదే। అలా అవకాశం ఉండి తెలుసుకోగలిగితే అక్కడి ప్రజలకు అర్థమయ్యేలా మన నాటికలో, ఇతర రూపకాలలో కొన్ని మార్పులతో (స్థానిక సమస్యలు) ప్రదర్శించి అక్కడి ప్రజల అభిమానం మరింత చూరగొనవచ్చు.

ప్ర: ప్రదర్శన ముందు మీ ఎడల ప్రజల ఆదరణ ఎలా ఉంది? ప్రదర్శన తర్వాత ఎలా ఉంది?

జ: ప్రజలు బూటకపు పార్టీల ప్రచారానికి చాలాకాలం నుండి బలవుతూవచ్చారు. మనం విప్లవ పార్టీ రాజకీయాలు ప్రచారం చేస్తాం కాబట్టి వాళ్ళ జీవితాలకి పరిష్కారం కనిపిస్తున్నట్లు వాళ్ళ ముఖాలు వింతకాంతితో వెలుగుతాయ్‌. ఇందుమూలంగా ప్రజలు ఎంత సంతోషిస్తారో, భూస్వామ్యవర్గాలు అంత బెంబేలెత్తి పోతాయి.

ప్ర. ప్రాక్టీసు పూర్తయేవరకు ఒక రూంలో ప్రాక్టీసు చేస్తూ ఉంటూ. బాగా వచ్చిన తర్వాతనే ప్రజలవద్దకు పోయి వినిపించడం మంచిదా? వీటిలో ఏ పద్ధతివలన కళాకారులు నైపుణ్యం సంపాదించగలరు?

జ: చిత్తశుద్ధితో రిహార్సల్స్ చేయడం మొదటి కర్తవ్యం. కాస్త బాగానే వచ్చింది అనుకుంటే, ప్రజలలో ప్రదర్శనలు ఇస్తూనే స్థాయిని పెంచుకోవాలి. ఆలోపల ప్రజలనుండి విమర్శలను స్వీకరిస్తూ మనల సంస్కరించుకోవాలి। అలా రాను రాను ప్రదర్శనలు సమర్థవంతంగా వచ్చి కళాకారులు రాటుదేలుతారు.

ప్ర: మీరు ప్రదర్శనలకు చందాలు వసూలు చేస్తారా? ఎందుకు? ఏవిధంగా చేస్తారు?

జ: సాంస్కృతిక దళం నడపడమంటే ఆర్థికంగా ఇబ్బందులుంటాయని అందరకూ తెలుసు. మన ప్రదర్శనలు ప్రజలగురించే గనుక మనం ఆ సమస్య పరిష్కరించుకోవడానికి ప్రజలపైనే ఆధారపడుతాం। అంటే హృదయపూర్వకంగా పళ్ళెం పట్టుకొని ప్రదర్శన జరుగుతూ ఉండగా ప్రజలలోకి వెళ్ళి వసూలుచేయడమే।

ప్ర: ప్రభుత్వ, భూస్వాముల నిర్బంధం ఉంటే ప్రదర్శనకు ముందు ప్రచారం ఎలా చేసేవారు?

జ: అలాంటి గ్రామాల్లో సొంత చొరవతో సాంస్కృతిక దళ సభ్యులే డప్పులు వాయిస్తూ ప్రచారం కొనసాగించేవారం. అలానే చేయవలసి ఉంటుంది.

ప్ర: వీధి మలుపుల్లో ప్రదర్శనలిస్తే (Mobile cultural squad) ఏయే కళా రూపాలు ప్రదర్శించాలి.

జ: Extempore drama (చిన్నవి- 10, 15 నిముషాలు కలవి) పాటలు, దూలా మొ॥ ప్రదర్శించవచ్చు.

ప్ర: పాటల్లో, నాటకాల్లో ఏయే అంశాల వద్ద జనం ఉద్రూత లూగారు? ఉద్రేకపడ్డారు?

జ: మనదేశంలో నేడు జనం విపరీతమైన అణిచివేత అనుభవిస్తున్నారు. అందుకుగాను పీడితవర్గాలపైన, వారిని కాపాడే పోలీసు బలగాలపైన వారికి లోలోన

తీవ్రమైన కసి ఉన్నదన్న విషయం కూడ బద్దలు కొట్టినట్లు మా ప్రదర్శనల ద్వారా రుజువయింది. భూస్వామిని ఖతం చేసినప్పుడుగానీ, పోలీసులపై దాడిచేసినప్పుడు గానీ ప్రజలు ఉద్రేకులాగి చప్పట్లుకొట్టడం, నినాదాలు ఇవ్వడం గమనించదగ్గవి.

ప్ర: జ. నా. మం. లో ఎంత తక్కువ మందితో ఎంత ఎక్కువ ప్రదర్శనలు ఇవ్వగలరు? ఏంత సేపు ఇవ్వగలరు?

జ: తక్కువ మంది సభ్యులతో ఎక్కువ ప్రదర్శనలు ఇచ్చే పద్ధతే అవలంబించాం. సుమారు 7 మందితో 3 గం॥ కార్యక్రమం (పాటలు, నాటిక, నృత్యాలు మొ॥) ఇవ్వవచ్చు.

ప్ర: జ. నా. మం. ని పిలువాలంటే చాల డబ్బు ఖర్చవుతుంది దాన్ని పేద ప్రజలు భరించలేరుకదా! కనుక చౌకగా, తక్కువ వాయిద్యాలతో జనాన్ని ఉత్తేజ పర్చే కళారూపాలేవి?

జ: వొగ్గుకథ, బుర్రకథ, గొల్లసుద్దులు, పాటలు మొద॥

ప్ర: పాటల పుస్తకాలను ఎలా ప్రచారం చేయాలి?

జ: అతి చౌకగా పాటలు, ఇతర జానపద కళారూపాలు ప్రచురించి సామాన్య రైతుకూలీలకు సహితం అనుకూలంగా ఉండేట్లు చూడాలి: ప్రదర్శనలు జరుగుతున్నప్పుడు తిరిగి ఎక్కువ సంఖ్యలో పాటల పుస్తకాలు అమ్మాలి: అలాగే మనకు పరిచయాలున్న గ్రామాలలోకూడా పనిగట్టుకొని ప్రజలలో విరివిగా అమ్మాలి: దరువులు చెప్పాలి: పేదరైతులు రోజూ పాడుకునే సాధనాలుగా తయారవ్వాలి విప్లవ రచనలు.

ప్ర: పెండ్లిండ్లలో, చావులలో, ఉత్సవాలలో, పండుగలకు ప్రోగ్రాంసు ఇవ్వవచ్చా? పండుగ రోజులలో మన కార్యక్రమమేమిటని కొందరి అనుమానం. మీ ఉద్దేశం ఏమిటి?

జ: పైన పేర్కొన్న అన్ని సందర్భాలలోనూ మన కార్యక్రమాలు ఇవ్వవచ్చు. ఇవ్వాలికూడా: ఇచ్చేది మన కార్యక్రమమైనప్పుడు, మనకు పోయేదేమీలేదు: ప్రజలలో మన కళలూ, సాహిత్యం విస్తృతంగా ప్రచారం కావడానికి అవసరమైన అన్ని పద్ధతులూ మనం అవలంబించాలి.

ప్ర: కొత్తగా నేర్చుకునే వారికి మీరు ట్రైనింగ్ ఇస్తారా?

జ: ఔను దానికి జననాట్యమండలి చాలా ప్రాముఖ్యత నిస్తుంది

ప్ర: విరసం ఐదేళ్ళలో చేయలేని విప్లవ ప్రచారం జ. నా. మం. రెండేళ్ళలో చేసిందని పరిశీలకుల భావన, దానికి కారణమేమిటి?

జ: భారత విప్లవంలో విరసం నెరవేర్చిన పాత్ర చాలా చారిత్రాత్మకమైనది. కాబట్టి విరసం ప్రాముఖ్యత దానికున్నది. పోతే ప్రజలలోకి బలంగా వెళ్ళడానికి ప్రజాప్రక్రియ చేపట్టవలసిన బాధ్యత, ప్రదర్శించవలసిన బాధ్యత నేడు ఎంతో ఉన్నది. జననాట్యమండలి బలంగా ప్రజలలోకి వెళ్ళడానికి కారణాలు : 1. ప్రజలకు సంబంధించిన సరైన రాజకీయాలు 2. ప్రజా ప్రక్రియ (రూపం, భాషతో కూడి ఉన్నది) 3 సభ్యులలోని పట్టుదల, దీక్ష.

ప్ర: జననాట్యమండలి తరపున ప్రజాకళాకారులకు మీ సలహా ఏమిటి?

జ: దీర్ఘకాలం శ్రమకోర్చి, ప్రజలసేవలో అంకితమై పనిచేస్తూ, మన దేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో, సాంస్కృతిక సైన్యంగా తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించి వేలాది నూతన కళాకారుల్ని సృష్టిస్తూ, విప్లవాన్ని త్వరిత పరిచి, కోట్లాది ప్రజాసైనికులను సృష్టించాలి. అశేష రైతాంగాన్ని సమీకరించాలి. దీనికంతకూ విమర్శ, ఆత్మవిమర్శపద్ధతిని అవలంబించి, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని, మార్గదర్శకంగా తీసుకొని పురోగమించాలి. ఇదే నేడు ప్రతి ప్రజా కళాకారుని పవిత్ర కర్తవ్యం...

ఇప్పుడు మనం సాంస్కృతిక రంగంలో చేస్తున్న కృషికన్నా చర్చలు ప్రారంభమైనాయి. ఇక ఇప్పుడు వాటి ఆధారంగా విస్తృత ప్రాతిపదికపై సాంస్కృతిక ఉద్యమం నిర్మించి విపరీతమైన ప్రచారం కొనసాగించవలసి ఉన్నది. ఆచరణలో మనం మరెన్నో సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చు. అందుచేత ఆచరణపట్ల పూర్తి సీరియస్‌నెస్ అవసరం. సాంస్కృతిక దళాలు దినరాత్రులు పనిచేయాలి; ఇదే నేటి సాంస్కృతిక, అందునా విప్లవ సాంస్కృతిక సంస్థల ధ్యేయం.

వెలువడినయ్!!

జననాట్య మండలి హైద్రాబాద్ వారిచే పాడబడుతున్న

1. చెల్లీ చెంద్రమ్మ ఒగ్గు కథ వెల: 0-40
2. రైతుకూలీ విజయం [బుర్రకథ] వెల: 1-00

ప్రతులకు : సృజన, హనుమకొండ, వరంగల్-506001.

మలయాళ సాహిత్యంలో నూతన ధోరణులు

ప్రియనందనన్

అన్నిచోట్లవలెనే, కేరళ యువకులుకూడ అశాంతిలో ఉన్నారు. విద్యావంతులయిన నిరుద్యోగులు బీడీలుతాగుతూ రోడ్లమీద, వీధుల్లో రాబోవు ఉపద్రవానికి సంకేతాలవలె తిరుగుతున్నారు. నిరుపేదలుగా మార్చబడిన వ్యవసాయ కూలీలు, కార్మికులు, వృత్తులు కోల్పోయి మరేపని దొరకకుండావున్న నేతపనివారు, కడుపుకు చాలీచాలని తిండితో కటకటపడుతున్న రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సమ్మెలు, బంద్‌లు– ఇవీ కేరళలో మనకు కనిపించే దృశ్యాలు. ఈ నదుల, వృక్షాల దేశంలో ఎవ్వరూ సంతోషంగాలేరు. 80% కన్నా ఎక్కువమందే పేదరికం ప్రమాణాలకన్న నికృష్టమైన ప్రమాణాల్లో బతుకుతున్నారు. కేరళ మారుమూల ప్రాంతాల్లో పేదరికం మరింత దుర్భరంగా వున్నది.

ప్రజలమీద ప్రభుత్వం నిఘా ఎంతతీవ్రంగా వున్నదంటే, యిదేమయినా యుద్ధకాలమా అన్నట్లున్నది. పోలీసులు ఎప్పుడూ గస్తీలు తిరుగుతుంటారు. రాత్రి మరీ పొద్దుపోయాక రోడ్లమీదనో, చిన్నవంతెనల మీదనో ముగ్గురునలుగురు ఒకచోట కూర్చొని కనిపించినాచాలు వాళ్ళ ప్రశ్నలతో వేధించి తరుముతారు. ఈప్రజలు తమకు వ్యతిరేకంగా ఏదోకుట్ర చేస్తున్నారా అన్నట్లు వుంటుంది వీళ్ళవైఖరి. కేరళపోలీసులతో వాదించి ప్రయోజనంలేదు. వాళ్ళు భయంకరమైనవాళ్ళు, పాశవికమైనవాళ్ళు.

మిశ్రమ మంత్రివర్గం తనకు అత్యధిక సంఖ్యాబలంవున్నదని ధీమాగా చెప్తుంది. ఇందులోవున్న పార్టీలన్నీకూడ యీ మంత్రివర్గం ఐదేళ్ళు పూర్తిచేసుకున్నదని గర్వంగా చెప్పుకుంటాయి. కేరళలో ఏ మంత్రివర్గమూ యింత దీర్ఘకాలం నిలువలేదు మరి! అయినా ప్రభుత్వానికి ప్రతి యువకుడూ ఎప్పుడూ బ్రద్దలవడానికి సిద్ధ గా వున్న ఒక అగ్నిపర్వతంలా కనిపిస్తాడు, అధికారానికి అంటిపెట్టుకొని వుండాలన్న తన వెర్రి ప్రయత్నాలకు యువతరం ఒక ప్రమాదంగా కనిపిస్తున్నది యీ ప్రభుత్వానికి, ఒక నిప్పురవ్వ దీన్ని నిరంతరం వెన్నాడుతున్నది,

కేరళలో యువకులు కోపంగాలేరా? వాళ్ళెందుకు తిరుగబడరు? రకరకాల రాజకీయ పార్టీల నాయకత్వంలో నిర్వహింపబడుతున్న ప్రదర్శనలు, యింకా యితర అహింసాయుత, నిరసనరూపాలు వున్నాయి. ఈ పార్టీలేవీ యువకులను 'క్రమశిక్షణ' తప్పిపోనివ్వవు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆహారవస్తువుల కొరత యింకా యితర న్యాయమైన కోర్కెలకోసం సంతకాలు సేకరించి శాంతియుత ప్రదర్శనలద్వారా

ప్రభుత్వం దృష్టికి తేవలసిందిగా కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) సాహిత్య వారపత్రిక 'దేశాభిమాని' బడిపిల్లలకు హితవుచెపుతుంది. ఈ ఆందోళనాపద్ధతి యువకుల పోరాట పటిమను బలహీనపరుస్తుంది. ఇది నిర్మాణాత్మకమైన కోపం అభివృద్ధి చెందకుండా కుంటుపరుస్తుంది. కాని ఎంతకాలం వీరికోపాన్ని అణచివేయగలరో చూడవలసివున్నది.

యువకులందరూ యీరాజకీయ దెబ్బగాళ్ల నాయకత్వం కిందనేలేరు. కేరళలో కూడ ఒక సంఘటితశక్తి వున్నది. 'వసంత మేఘ గర్జన' ప్రభావంలో ప్రభవించినశక్తి అది. క్రమక్రమంగా యిందులోకి అన్నిరంగాల్లోని ప్రజలు ఆకర్షింప బడుతున్నారు. మార్పుయొక్క అవసరాన్ని సమగ్రంగా గుర్తిస్తున్నారు. చట్టబద్ధ కమ్యూనిస్టు పార్టీల ద్రోహాన్ని వీళ్ళు స్పష్టంగా గ్రహించారు. వర్గీస్, ఆయనపై నాటు యింకా అరుణా రుణంగా వున్న జ్ఞాపకాలు. అన్ని రాజకీయ ప్రతిపక్షులకన్న సిపిఎం యీ 'దారితప్పిన యువకులను విమర్శించడంలో విశంకక్కుతున్నది. ఈ యువకులు తనకు శక్తివంత మయిన శత్రువులని అదిగ్రహించింది. కుళ్ళిపోయిన తనశరీరంమీద యీగలు ముసురు తున్న తన పుండు స్పృహ దానికున్నది. 'వామపక్ష ఉద్యమాన్ని ఛిన్నాభిన్నం చేయ డానికి బయల్దేరిన' నక్సలైట్ల విషయంలో అప్రమత్తులై వుండాలని హెచ్చరిస్తూ వాళ్ళ ఏరియా కమిటీలకు సిపిఎం రహస్య సర్క్యులర్లు పంపింది.

మళయాళ సాహిత్యంలో కోపోద్రిక్తత యిప్పుడు కనిపిస్తున్నది. యువతరం రచయితల్లో అగ్రగాములు యీ వ్యవస్థకు వ్యతిరేకంగా మాత్రమేకాక బహుశా అభ్యు దయ రచయితలకు వ్యతిరేకంగా కూడా కత్తులు నూరుతున్నారు. కాఫ్కా, కామస్, అస్తిత్వవాదం పట్ల మోజు అదృశ్యమయి పోయింది. తొలిదశలో యువ మళయాళ రచయితలకు దీనిపట్ల కొంత ఆదరణ కలిగింది. ఏదో కొత్తదనం వస్తున్నది. కొత్త దేదయినా ఆహ్వానించదగిందే అనుకున్నారు పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం వుండడానికి అవకాశాలున్న కొంతమంది మళయాళ రచయితలు కావాలనే ఒక గందర గోళాన్ని యీ రూపంలో ప్రవేశపెట్టారు. పాశ్చాత్యమైంది ఏదయినా గొప్పే అను కొనే రోజులవి. కాని అదినిజజీవితాన్ని, దుర్భరమైన జీవితాన్ని ప్రతిబింబించలేదు గనుక క్రమంగా తన పదును కోల్పోయింది ఇప్పుడది ఒక నకిలీ ప్రక్రియగా చెత్త బుట్టలోకి విసిరివేయబడింది. ఇప్పుడు కొత్తగాలి వీస్తున్నది. మూడో ప్రపంచం, అణచబడిన ప్రజల సాహిత్యం యువ మలయాళ రచయితలను ఆకర్షించింది. మూడో ప్రపంచ ప్రజల జీవితాలనుంచి, సమస్యలనుంచి తాము వేరుకాదని, మూడో ప్రపంచం లోని వేరే ప్రాంతాల్లోని తమసోదరులకూ తమకూ సామాన్యమైన సమస్యలెన్నో వున్నాయని వీరుగుర్తించారు. ఫాసిజం ఉక్కుపాదాలు అంతటా ఒక్కటే. ఈ ప్రభవి స్తున్న నూతనతరం, యీ కోపోద్రిక్తయువతరం కుండ బద్దలుకొట్టి మాట్లాడుతున్నది.

సమూలమైన మార్పును కోరుతున్నది. సహజంగానే హింసాత్మక మార్గాన్ని ఎంచు కున్నది. పాత విలువలను, పాత సంకేతాలను నాశనం చేస్తున్నది. వీళ్ళు సాహిత్యంలో సాయుధ విప్లవ సందేశాన్ని అందిస్తున్నారు. వీళ్ళు విప్లవకారులతో వున్నారు. అణ గారిన వారికి అక్కరకురాని బ్యాలెట్ కాగితాలను ముక్కలు ముక్కలుగా చించేయండి. వీటితోపాటు పీడకుల పీడ వదిలించండి.

హఠాత్తుగా నివురుకింద కొత్త గీతం చిగురించింది
వానపడింది—
నలభై రోజులు విసుపకుండా
నేలా, హృదయమూ స్పందించాయి
అటు
వాన చన్మోన కుడుస్తూ—
కొత్త గడ్డి, కష్టజీవులూ, పాటలూ, పువ్వులూ
వికసిస్తున్నాయి.
ఇది వెనకటి ఆకలికాదు
యివ్వాటి ఆకలి
యివ్వాటి ఆకలి
చరిత్ర రక్తనాళాలను కొలిములుగా మార్చింది.
అది కాలాన్ని దిమ్మెమీదపెట్టి సమ్మెటతో కొడుతున్నది
కాలం సాహసాకాంక్షల నూతన సూర్యుడు రూపొందేదాకా.........

ఈ చరణాలు సచ్చిదానందన్ రాసిన దీర్ఘమైన, రెచ్చగొట్టే కవితలోనివి. ఈ కవి నూతన తరానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అప్రతిహతమైన యువకుడు. సంప్రదా యంగా వస్తున్న మాటలు, నుడికారాలు నిరాకరించి యింతకాలమూ నిషిద్ధంగా భావించ బడుతున్న మాటలు, నుడికారాలు వీళ్ళు వాడుతున్నారు. అయినా, కొత్తసాహిత్యం కేవలం నినాదప్రాయమైందీ, కళారహితమైందీ కాదు. ఈ సాహిత్యాన్ని ఆదరించడానికి, ప్రశంసించడానికి కూడ కొత్త దృక్పథం కావాలి.

ఈ ప్రగతిశీల రచయితలమీద సిపిఎం సాహిత్య విమర్శకులు తమ దేశాభిమాని స్టడీ సర్కిల్స్ వేదికలుగా విషప్రచారం సాగిస్తున్నారు. ఈ నూతన తరాన్ని సిఐఎ ఏజంట్లని నిందిస్తున్నారు. పలాయనవాద— భావవాద రచయితలకు, ఈ కోపోద్రిక్త యువతరానికి తేడా ఏమీ లేదని ప్రజలను మభ్యపుచ్చజూస్తున్నారు. ఈ కొత్త సాహి త్యాన్ని వీళ్ళు నక్సలైట్ సాహిత్యమని పిలుస్తున్నారు. రాజకీయ రంగంలోవలెనే, సాహిత్య రంగంలోకూడ యీ నూతనతరం సిపిఎంకు శక్తివంతమైన శత్రువుగా కనిపి

స్తున్నది. తమను వదిలి కొంతమంది రచయితలు వీళ్ళవైపు వెళ్తున్నారన్నది కూడ వీళ్ళకు ఆందోళనగా వున్నది. తమ కుహనా అభ్యుదయవాదం, మార్క్సిస్టు ముసుగు బట్టబయలు చేయబడుతున్నాయని దేశాభిమాని స్టడీసర్కిల్ తెలుసుకున్నది. మళయాళ సాహిత్యంలో లోతైన ప్రవేశంలేని సిపిఎం నాయకులు సాహిత్యంమీద ప్రసంగాలుచేసే బాధ్యతను నిస్సంకోచంగా చేపట్టారు. నంబూద్రిపాద్ ఏ వేదికమీద మాట్లాడినా సాహిత్యం గురించి ఏదో ఒక వ్యాఖ్యానం చేయకుండా అందులోకూడ తన పిడివాదం చొప్పించకుండా ప్రసంగం ముగించడు. నిజానికి ఆయన తనకు తాను మలయాళ సాహిత్య సిద్ధాంతవేత్తగా భావించుకుంటున్నాడు. కేరళలో ప్రతి మారుమూల ప్రాంతాల్లో కూడ దేశాభిమాని స్టడీసర్కిల్ సాహిత్య సమావేశాలు, చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నది. ప్రతిచోట సిపిఎం పెద్దలు వేదికనలంకరించకుండా ఉండరు.

అరాచక ధోరణి:

ఈ నూతన తరం ఒక్కోసారి ,అసంబద్ధంగానూ, విశృంఖల ధోరణిలోనూ ఉండడం కూడ జరుగుతున్నది. విప్లవంపట్ల వీళ్ళకున్న నిజాయితీని శంకించడానికి వీలులేదు కాని వీళ్ళలో క్రమశిక్షణ లోపించడమే అందుకు కారణం. ఆంధ్రలో విప్లవ రచయితల సంఘంవలె వీళ్ళకొక సంస్థలేదు. తమ సృజనాత్మక శక్తిని చర్చించుకోవడానికి వీళ్ళకు వేదికలేదు, చిత్రమేమిటంటే, ఈనూతన సాహిత్యం చాలవరకు బూర్జువా పత్రికల్లోనే ప్రచురింపబడుతున్నది. ఒకవేళ ఒకపత్రిక తేవాలనుకున్నా, ప్రకటనలు లేకుండా దాన్ని పోషించడం కష్టం. బలమైన సంస్థఉంటే తప్ప యీపత్రికలు బతకవు. ఉరుములు, మెరుపులతో 'పరాశక్తి' వెలువడింది. రెండు సంచికలు వచ్చి అదృశ్యమయింది. 'దిస్ట్రిట్' యింకా వెలువడుతున్నది. ఇందులో సాహిత్యానికి కొంత స్థలముంటుంది. కాని యిది కూడ ఆర్థిక యిబ్బందులవల్ల నెలల తరబడి వెలువడదు. ప్రచురణ పొందాలన్న తపన విప్లవ రచయితలు బూర్జువా పత్రికలను ఆశ్రయించేలా చేస్తున్నది. ఈ బూర్జువా పత్రికలు సర్క్యులేషన్ను గుత్తతీసుకున్నవి. ఈ నూతన సాహిత్యాన్ని ప్రచురించడంలో ఉదారంగా ఉంటున్నవి.

ఈ కోపోద్రిక్త యువతరం ధోరణి మలయాళ సాహిత్యానికే పరిమితమైంది కాదు. ఇది అఖిలభారత ఉద్యమంలో భాగమే. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉన్నది. వాళ్ళు కాలంతోపాటు కదిలి విప్లవ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కాని మలయాళంలో నూతన సాహిత్యం ప్రాథమిక దశలోనే వున్నది. ఇది పుట్టి మూడు నాలుగు సంవత్సరాలయిన ఇది యింకా తనముద్రను గాఢంగా పాదుకొల్పాల్సేవున్నది. పరిణతి చెందాలంటే ఒకసరియైన కార్యక్రమాన్ని రచించుకొని ఒక సంస్థను ఏర్పాటు చేసుకోవాల్సి వుంది. పాలకవర్గాల సాహిత్యానికి వ్యతిరేకంగా

పీడితవర్గాల సాహిత్యాన్ని సృష్టించడం యీసంస్థ లక్ష్యంగా వుండాలి. ప్రచార సాధనా లన్నీ కూడ బూర్జువా ఆలోచనా ధోరణికి వేదికలయి పోయాయి. పీడిత ప్రజల ఆకాంక్షలకు వాటిలో చోటులేదు. ఈ నూతన సాహిత్యం ప్రజలు రాజకీయ చైతన్యం పెంపొందించు కోవడానికి తోడ్పడి ప్రస్తుత సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడ డానికి ప్రోత్సహించాలి. దీనితోపాటు, వాస్తవానికి యీకుళ్ళు వ్యవస్థకు సేవకులయిన కుహనా కమ్యూనిస్టులు ప్రబోధిస్తున్న కుహనా సోషలిజం, కుహనా ప్రగతివాదం అసలు రూపాన్ని ప్రజలకు బట్టబయలు చేయాలి

ఇది ఒక ఆకాంక్ష మాత్రమే. ఇప్పటికయితే కేరళలో విప్లవ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసుకునే ప్రయత్నమేమిలేదు. ఈ ప్రయత్నం చేస్తేతప్ప, ఈ కోపోద్రిక్తతరం నిజాయితీ చెల్లాచెదరుగానే వుండిపోతుంది. అది విప్లవానికేమీ తోడ్పడదు.

[25-1-75 ఫ్రాంటియర్‌లో వచ్చిన వ్యాసానికి యిది అనువాదం]

తెలంగాణా పోరాట సాహిత్యం

కె. వి. రమణారెడ్డి

ఏ. కె. గోపాలన్ ఏకపక్ష ప్రకటనతోటి ఆయుధాలు దించివేసిన కొన్ని మాసా లకే తెలంగాణా పోరాట ప్రాంతాలలో బుల్లెట్లమూలంగా లభించిన ప్రజాభిమానాన్ని వోట్లుగా మార్చుకొని ప్రజలను విప్లవమార్గంనుండి పార్లమెంటరీమార్గానికి కమ్యూనిస్టు పార్టీ తిప్పివేయబూనింది. 1951 అక్టోబర్‌లో గోపాలన్ ప్రకటన వెలువడింది, 1952 లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో ఒక సంఘటన—

మిర్యాలగూడెం నియోజకవర్గంలో నిడమానూరు గ్రామం. అందులో కమ్యూ నిస్టుపార్టీ ఎన్నికల ఆఫీసు దానిలో అతిరథమహారథులైన మాజీ విప్లవోద్యమ నాయ కులు— రావి నారాయణరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య వగైరా. వీధిలో అల్లరి రౌడీమూక. కాంగ్రెసు రౌడీమూక. కమ్యూనిస్టు వ్యతిరేకోన్మాదం. ఆఫీసుమీద దాడి. నారాయణరెడ్డికీ సుందరయ్యకూ బలమైన కర్రదెబ్బలు!

ఎంతలో ఎంతమార్పు! పోలీసు యాక్షన్ పేర యూనియన్ సైన్యాలు చేసిన దండయాత్ర తర్వాత, ఊళ్ళకు వూళ్ళను చుట్టివెయ్యడం, మిలిటరీ కేంపుల్లో కమ్యూ నిస్టులనూ అభిమానులనూ హింసించడం, పట్నాలకు పారిపోయివుండిన "దొరలు" తిరిగి పల్లెలకు చేరుకుని కాంగ్రెసువేషం ధరించడం, పటేల్‌మార్కు అహింస నెహ్రూ బ్రాండు సోషలిజంతో కలిపి విముక్త తెలంగాణా గ్రామాలలో తిరిగి రాక్షసరాజ్యం

ఏర్పాటు చెయ్యడం, త్వరత్వరగా జరిగిపోయాయి. రావి నారాయణరెడ్డి సుంద రయ్యా చెరవిడిపించిన భూతంచేతుల్లో తామే తొలిదెబ్బలు రుచిచూస్తే, తెలంగాణా ప్రజల మాటేమిటి? వారి మెడలమీద, తలలమీద మళ్ళీ ఎక్కికూర్చుంది.

తెలంగాణా విప్లవ పోరాటం ఆగిపోలేదు— ఆపుచేయబడింది అది పరాజయం పొందలేదు— స్వపక్ష విద్రోహానికి గురైంది. కొనసాగితుంటే భారతదేశం ఈనాటికి మరొక చైనా అయివుండేదా లేదా అనేదికాదు ప్రశ్న. ఆ మార్గంలో చాలా దూరం నడిచి అంతిమ గమ్యానికి చాలాచేరువై ఉండేది

నైజాం నరకాసుర పరిపాలనను అంతమొందించడం మాత్రమే తెలంగాణా విప్లవపోరాటానికి లక్ష్యంకాదు. ఇండియన్ యూనియన్ స్వర్గమైతే కదా, 'హెలంగాణా' (కుందుర్తి) అయిన తెలంగాణా యూనియన్‌లో చేరడమనేది ఒక్కటే లక్ష్యమయ్యేది? జాగీర్దార్ విధానాన్నీ, దేశ్‌ముఖ్, పటేల్, పట్వారీ పరిపాలననీ, "జన్మజన్మాల బూజు" (దాశరధి) అయిన నైజాంతోటి తన్ని తగలవేసి ప్రజల ప్రజాతంత్రాన్ని స్థాపించడమే తెలంగాణా పోరాటానికి విప్లవ పోరాట స్వభావాన్ని యదార్థంగా సమకూర్చగలిగింది, భూమి, భుక్తి, విముక్తి— ఈమూడు దానికి త్రిరత్నాలు, అది విప్లవం కాదనడం, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాతంత్ర వెల్లువలో ఒకభాగం మాత్రమేననడం విద్రోహకాండలో ప్రధాన పాత్రధారియైన రావి నారాయణరెడ్డికే చెల్లు, ఆంధ్ర మహాసభ అనే పడవకు చుక్కాని పట్టడంతోటే (తిరునగిరి సీతారామాంజనేయులు) ఆయన పాత్ర ముగిసింది, "కొందరు" పేదరైతు కూలీలు పోరాటం సాగించాలన్నారట గాని మధ్యరకం రైతులు ధనికరైతులూ వ్యతిరేకించారట, అందుకోసమే ఆపారా పోరాటం? వినోబా భూదానోద్యమానికి గూడా తానే మార్గదర్శినని చెప్పుకొనే నారాయణరెడ్డి, పేదరైతు కూలీలను సగం దారిలో దిగవిడచేందుకే సిద్ధమై బొంబాయికి చేరుకొని డాంగే, అజయ్ ఘోష్, ఘాటేలతో కూడిన పార్టీ హెడ్ క్వార్టర్స్ ముఠాతో షరీకై, పోరాటం సాగుతున్నప్పుడే దానిని బహిరంగంగా వ్యతిరేకించసాగాడు, పోలీసు యాక్షన్ తర్వాత పోరాటం నిలిపివేసి ఉండవలసిందని జనమే పోరాటంనుంచి తప్పుకొన్నాక సాగిందంతా వ్యక్తిగత హింసాకాండేనని చెప్పడం, పేదరైతులూ కూలీలూ వారి నాయకులూ కొనసాగించిన విప్లవ పోరాటాన్ని నిందించడమే పోలీస్‌యాక్షన్ కమ్యూనిస్టు వ్యతిరేక సైనిక జోక్యమైనంతగా నైజాం వ్యతిరేక, లేగా భూస్వామ్య వ్యతిరేక, చర్యకాలేదు.

1952 ఎన్నికల ఫలితాలు, కమ్యూనిస్టుల ఓట్ల సీట్ల 'విజయాలు' ఈ విప్లవ పోరాటాన్ని తెలంగాణా పోరాట ప్రాంత ప్రజలు ఆమోదించినట్టే లెక్కగావి, అయు

దాల దించివేత పేరిట లొంగుబాటును ఆమోదించినట్లు లెక్కకాదు. గెలుచుకొని సొంతపరచుకొన్న భూములకు గ్యారంటీలేకుండా, విముక్తి పొందిన మూడువేల తెలంగాణా గ్రామాలు, గెరిల్లా ప్రాంతాలు, మొత్తంగా యూనియన్ సైన్యాలకూ వారి అండజేరిన దొరలకూ లొంగుబాటయ్యాయంటే సుందరయ్యగాని బసవపున్నయ్యగాని ఆ బాధ్యతనుండి తప్పుకోలేరు. తెలంగాణాలో జరిగిన పోరాటం రైతాంగ సాయుధ పోరాటంగానే సాగినా, దానికి పట్టి భూస్వామ్య వ్యతిరేకత మాత్రమేగాక, రాజ్యాధికార సంపాదన కూడా లక్ష్యమనే విషయాన్ని ఎవరు దాచిపెట్టలేరు. దేశమంతటా విప్లవ పరిస్థితి ఏనాడు ఉండదు. దేశానికంతా కలిసి ఒక్కపెట్టున విముక్తి కలగదు. తెలంగాణాలోని మూడువేల గ్రామాల మీద ఎగిరిన ఎర్రజెండాలు, గెలుపొందిన ప్రజల చేతుల్లోని బరిశెలు, వడిశెలలు, భర్మార్లూ బందూకులూ, చివరకు గైతర్లుకూడా, ఏర్పడిన వీరగెరిల్లా దళాలు, కలిగిన పోరాటానుభవాలు, వ్యాపించసాగిన ఉత్సాహం ఉత్తేజం ఇవి తప్పనిసరిగా నైజాంరాజ్యపు సరిహద్దులను పలువైపులదాటి యూనియన్ ప్రాంతాలలోకి విస్తరించి ఉండేవి. కాబట్టి రాజకీయాధికారం కోసం కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వ పతనంకోసం పోరాటం కొనసాగించి ఉండాల్సింది కాదనడం, చేజిక్కిన సదవకాశాన్ని చేజేతులా వదులుకొన్న మాజీ విప్లవవాదులు చెయ్యంగల పనికిమాలిన వాదంమాత్రమే. అదే అంతిమ విప్లవ పోరాటంగానీ దాని మధ్యభాగంగానీ కాకపోయి ఉండవచ్చు. అంత మాత్రాన, ఆ ఉజ్వలారంభాన్ని చూడకపోవడం పొరబాటే కాదు, నేరం.

రాజ్యాధికారం అనేది ఇండియాలాంటి భూస్వామ్యదేశంలో సాయుధ రైతాంగ పోరాటంద్వారానే సాధ్యమౌతుంది. అకాశానికి నిచ్చెనవెయ్యడం కాదిది. విప్లవపోరాటం సాధించిన విజయాలను పరిరక్షించుకోవడంతో బాటుగా, అంతకంటె ఉన్నతమైన దశవైపు ఆ పోరాటాన్ని తిప్పడమొక్కటే ప్రాజ్ఞతగాని, ఆ ప్రారంభదశనుగూడా విస్మరించేలా, పోరాటాన్ని పార్లమెంటులోపలేగాని బయట జరగనీయనివిధంగా మార్చడమంటే, కొద్దిమాత్రపు విప్లవ అవకాశాలనైనాసరే పరిమార్చడమే అయింది. అంతిమ విప్లవదశకు కావలసిన సన్నాహాలు అప్పటికి లేకపోయి ఉండవచ్చు. రష్యా ఆమోదం లభించి ఉండకపోవచ్చు. సరియైన తరుణంలో తెలంగాణా సాయుధపోరాటం జరగలేదేమోనని 1950 జూన్‌లో చైనాకూడా సూచించి ఉండవచ్చు. అంత మాత్రాన, పోరాటమే కూడదనడం జరిగిన పోరాటాన్ని అవమానించడమే. చైనాలో విప్లవం పరిపూర్తి పొందకముందే మావో సిద్ధాంతాలకు తెలంగాణా గ్రామసీమ ప్రయోగశాల అయింది. భారతప్రజల ప్రజాతంత్ర విప్లవం తాలూకు వ్యూహానికీ ఎత్తుగడలకూ సంబంధించిన సమస్యలన్నిటినీ అది ముందుకుతెచ్చింది. భారతీయ జనతా ప్రజాతంత్ర విప్లవానికి అది అకాలంగా ఆపివేతకు గురైన గొప్ప ప్రారంభం, ప్రస్తుత విప్లవదశకుగూడా అది మేలి నమూనా.

2

తెలంగాణా పోరాటం ఆద్యంతం ప్రజలగుండెల్ని తాకింది. ప్రజా రచయితలను సృష్టించింది. జాతీయోద్యమంలో భాగంగానూ, ప్రజాతంత్ర విప్లవంలో, ప్రథమదశగానూ, మధ్యతరగతి రచయితలనెందరినో కదిపింది. ఈ పోరాట సాహిత్యం రాశిలోనేగాక గుణంలోకూడా పెద్దది. దాన్ని సమీక్షించడమంటే మాటలుకాదు నవల, నాటకం, కథ, పద్యం, గేయం, వీధిభాగవతం, గొల్లసుద్దులు, ఉయ్యాలపాటలు, చుట్టుకాముడుపాటలు— అసంఖ్యాకంగా వెలువడ్డాయి. ప్రసిద్ధులూ అప్రసిద్ధులూమాత్రమేగాక, అజ్ఞాత రచయితలుకూడా ఈ పోరాట సాహిత్య సృజనలో పాల్గొన్నారు. గదుల్లోమాత్రమేగాక వీధుల్లోనూ, పత్రికల్లోనేగాక జైలుగోడలమీదనూ, తీరుబాటుగా మట్టుకేగాక పోరాటం సందడిలోనూ ఈ సాహిత్యం పుట్టిపెరిగింది. మధ్యతరగతి రచయితలు ఏ ఒకరిద్దరుచేసిన ఒకటిరెండు రచనలోతప్ప, తక్కినవన్నీ పుస్తకాలలో ఉండిపోయాయిగాని, ప్రజా సామాన్యంనుంచి అనామధేయంగా బయల్పడిన రచయితలుకట్టిన పాటలూ, పదాలూ పోరాటప్రాంత ప్రజల జిహ్వారంగంమీద ఇంకా నర్తిస్తూనే ఉన్నాయి. అదే విశేషం,

అదొక్కటే కాదు— తెలంగాణా ముక్కూమొగమూ తెలియకుండానే కొందరు, వార్తాపత్రికల సమాచారాన్నీ గ్రంథాల పరిజ్ఞానాన్నీ మాత్రమే ఆధారంగాచేసుకొని మరికొందరూ, ఆ ప్రాంతంలో సాగిన పోరాటానికి సాహిత్యరూపాలను సృష్టించారు. వ్యక్తిగతంగా వాళ్ళ చిత్తశుద్ధిని శంకించవలసిన పనిలేదుగాని, సాహిత్యపరంగామాత్రం వాళ్ళ చిత్తశుద్ధిని శంకించకతప్పదు. కిషన్‌చందర్‌లాంటి ఉత్తరాది రచయిత తెలంగాణాలో గోధుమ పంటను చూశాడంటే అతడు ఇతరులందించిన భోగట్టాను ఆధారం చేసుకొని తన 'జైత్రయాత్ర' రచించాడులెమ్మని తోసివెయ్యవచ్చు. కాని, సర్కారు జిల్లాల రచయితలకు తెలంగాణా స్వరూపంకూడా తెలియకుండా వాళ్ళు తెలంగాణా గురించి రచనలు చేశారంటేనే ఆశ్చర్య విషాదాలు కలుగుతాయి. ఒకరికి దేవరుప్పుల గ్రామం మునగాల దాటగానే కనిపిస్తే మరొకనికి మధిరతాలూకాలో పాల్వంచ కనబడిందని ఆరోజుల్లోనే ఒక విలేఖరి విశాలాంధ్ర పక్షపత్రికలో విమర్శించవలసివచ్చింది.

పైగా, తెలంగాణా పోరాటం బాగా తీవరించిన తర్వాతగాని, సర్కారాంధ్రజిల్లాల రచయితలు మేల్కొలేదని చెప్పవచ్చు. 1946 అక్టోబర్‌లోనే ప్రారంభమైన అభ్యుదయ పత్రిక కూడా తన తొమ్మిది సంచికలలో తెలంగాణా పోరాటాన్ని ప్రస్తావించలేదు. ఆ పత్రికే అలాగైతే, ఇతర పత్రికల వూపెందుకు?

పోరాటప్రాంతంలో ఆ పరిస్థితి లేదు, ఎలాగూ ఉండదు. సర్కారాంధ్ర రచయితల్లాగా సానుభూతిచూపి దూరంనుండి ఆశీర్వదిస్తూ తడిపొడిమాటల కూర్పులతో

ఉత్సాహమిచ్చే ప్రయత్నం. గుడ్డిలో మెల్లలాగా కొంతవరకే మేలు, నిజమైన నికరమైన పోరాటసాహిత్యం పోరాటం ఆటుపోటులను, గెలుపోటాలను, సుఖదుఃఖాలను స్వయంగా అనుభవించే జనంమధ్యంనుంచే వస్తుంది. అది మాత్రమే చెల్లేనాణెం. తక్కినది చెల్లని నాణెం. పై పైకి రెండూ ఒక్కలాగే కనిపించవచ్చునని కూడా చెప్ప లేనంతటి మౌలికమైన తేడా అరెంటికీ ఉంది, ఉండక తప్పదు కూడా. మరొక విషయంలో కూడా ఇలాంటి తేడాయే ఉంది. సర్కారాంధ్ర రచయితలలో తెలంగాణా పోరాటాన్ని బలపరచినవాళ్లు హెచ్చుగా 'అభ్యుదయ' రచయితలు. తెలంగాణా రచయితలు దాదాపు అందరూ 'ప్రజా' రచయితలు, 'విప్లవ' రచయితలు, దాశరథి, అళ్వారుస్వామి, కాళోజీ, పొట్లపల్లి రామారావు లాంటి విద్యాధికులు సకృత్తు. జనం అట్టడుగునుంచే అక్షరాలా ఊరూ పేరూలేని రచయితలే అధికసంఖ్యాకులు. పోరాటాన్ని కొసవరకూ సాగించినవాళ్ళూ వీళ్ళే. మధ్యలో కొందరు ప్రాణాలు విడిచారు, హింసలకు గురయ్యారు, కాని ప్రజల్ని విడవలేదు. తిరునగరి సీతారామాంజనేయులు సర్కారాంధ్రలో పల్నాటి మనిషై ఉండీ, అత్తవారి ఇలాకాతో తెలంగాణాకు దత్తుడయ్యాడు. ఇక సర్కారాంధ్ర రచయితలలో ఒక్క గంగినేనికే ఈ పోరాటంతోటి కాస్త దూరపు సంబంధమైనా ఉంది. అతనివి కూడా ఎక్కువగా ఊహాజనిత పోరాటచిత్రాలే గాని ప్రత్యక్షానుభవంనుంచి పుట్టినవికావు. కాకుంటే గంగినేని సర్కారాంధ్రకూ తెలంగాణాకూ సరిహద్దులో పోలీసుకేంపు నిర్బంధాలనుభవించాడు. పోరాటం ఆరిపోయాక ఆ ప్రాంతాన్ని పర్యటించి గెరిల్లావీరుల యథార్థగాథలను సేకరించి 'ఎర్రజెండాలు' రాయగలగడం కూడా, మిగతావారితో పోలిస్తే ఒక గొప్పే. తెలంగాణా రచయితలతో పోలిస్తే మాత్రం ఈ గొప్ప ఒక గొప్పేమీకాదు.

అయితే తెలంగాణా పోరాటాన్ని అభిమానిస్తూ రాసిన సర్కారాంధ్ర రచయితలు ఎక్కువమంది కమ్యూనిస్టులో కమ్యూనిస్టు సానుభూతిపరులో కావడం, ఒకవిధంగా ఆ పోరాటాన్ని వక్రీకరించకుండా చిత్రించేందుకు తోడ్పడింది. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర్‌రావు, తుమ్మల వెంకటరామయ్య, బొల్లిముంత శివరామకృష్ణ, మహీధర రామమోహనరావు, కొండేపూడి లక్ష్మీనారాయణ, కోగంటి గోపాలకృష్ణయ్య, నార్ల చిరంజీవి, వీళ్లు ఒకయెత్తు, సోమసుందర్, ఆరుద్ర, నారపరెడ్డి, చంద్రారెడ్డి, శశాంక, రమణారెడ్డి, వగైరా ఇంకోఎత్తు. ఇలా, తెలంగాణా సాహిత్య సృజన చేసినవారిలో ఎన్నో అంతరాలు ఉన్నాయి, గమనించదగిన ముఖ్యమైన విషయం. అటు శ్రీశ్రీగానీ ఇటు కొడవటిగంటిగానీ ఈపోరాటాన్ని తమరచనలలో ప్రస్తావించక పోవడం, రెండో ప్రపంచ యుద్ధకాలంలో తెలుగుదేశానికి దూరంగా సైనిక సంబంధమైన ఉద్యోగాలు చేస్తూఉండడం దీనికి కారణం కావచ్చు. ఏమైనా వీరిద్దరి సాహిత్య సహకారం ఆ మహోద్యమానికి లోపించింది, అది చిన్నలోటేమీ కాదు.

(ఇంకా వున్నది)

ఓడ రేవు కార్మికుడూ- కవీ- హువాంగ్ షెంగ్-సియావో

హువో పాయ్-లిన్

పూర్వం ఓడలకు సరుకులు ఎత్తడం యమబాధ
కాళ్ళు నొప్పెట్టేవి
వీపు విల్లులా వొంగేది
భుజాలు బరువుతో నలిగిపోయేవి
కాని యిహాళ
కార్మికులు యంత్రాలను నిర్మిస్తారు
సరుకులు ఎత్తడం మహదానందం
ఒక మనిషి మీట నొక్కుతాడు
గిడ్డంగి సరుకులన్నీతానే బయట పడేస్తుంది—

మధ్యయాంగ్సీనది ఓడరేవు యిచాంగ్‌కు చెందిన అనుభవనీయుడైన కార్మికుడు హువాంగ్ షెంగ్-సియావో అక్కడి రేవుకార్మికుల నూతన జీవితాన్నీ, రేవు పని విధానంలో వచ్చిన అద్భుతమైన మార్పులనూ కీర్తించడానికి రాసిన వాక్యాలివి.

1949 లో నవచైనా స్థాపించబడ్డనాటి నుండీ హువాంగ్ షెంగ్-సియావో వేయికిపైగా కవితలూ, వ్యాసాలూ రాశాడు. అందులో సుమారు నాలుగువందలదాకా జాతీయ, రాష్ట్రీయ, నగరపాలన శాఖకు చెందిన వివిధ పత్రికల్లోనూ, వార్తాపత్రికల్లోనూ ప్రకటించబడ్డాయి. ఇప్పటివరకు-అతనివి "గట్టిగా నిలబడ్డ యాంగ్సీ అధినేతలు" (Masters of the Yangtze who have stood up) అనే పెద్ద కవిత యొక్క మొదటి రెండు భాగాలతోసహా ఆరు కవితాసంకలనాలు వెలువడినాయి. అతని కొన్ని రచనలు మాధ్యమిక పాఠశాల పాఠ్యపుస్తకాల్లోనూ కన్పిస్తాయి.

1972 నుండి కర్మాగారాల్లో, సైనిక యూనిట్లలోనూ యిప్పటివరకు మొత్తం 58000 వేల మందికి సృజనాత్మక రచనల్లో తన అనుభవాల గూర్చి చెప్పాడు.

హువాంగ్ షెంగ్-సియావోకు యిప్పుడు 56 సంవత్సరాలు. ఇచాంగ్ ఓడ సిబ్బంది మరియు రేవు కార్మికుల క్లబ్బుకు అతడధ్యక్షుడు. యాంగ్సీ ఓడల సిబ్బంది, రేవు కార్మికుల యూనియన్ సభ్యుడుకూడా. పాత సమాజంలో అతని కుటుంబీకులు చదువుకునే అవకాశంలేని కష్టజీవులు. అతని తాత బతుకంతా యాంగ్సీనది పొడుగునా పడవలాగి బతికినవాడు. తండ్రి తన పన్నెండవ యేటి నుండే పడవలు నడుపుతూ జీవితం వెళ్ళబుచ్చాడు. తల్లి పస్తులతో చచ్చిపోయింది, ఇక హువాంగ్ షెంగ్-

సియావో 9వ ఏటనుండే ఓడరేవు కూలీగా భుజాన కావడిమీద మోయలేని బరువులు మోశాడు. ఇట్లా అతని కుటుంబీకులంతా గుర్రాల్లా ఎద్దుల్లా పనిచేసి, పందుల, కుక్కల ఆహారాన్ని భుజించారు. అతని పిల్లల్లో ఒకడు ఆకలిమంటలకు ఆహుతి అయిపోయాడు. ఒక కవితలో సియావో కోపంగా సమాజాన్ని యిట్లా దూషిస్తాడు.

ఎంత అసహ్యాకరమైన నేరపు సమాజం!
మా భుజాల మీద బరువైన కావళ్ళు
కారే చెమటా, నెత్తురు చుక్కలూ
కాలజాడల తోవలు, గాయపుమచ్చల దేహాలు
మేం బియ్యం మోసాం- మా కడుపులు ఖాళీ
గుడ్డలను ఓడల్లో నింపాం- గోనెపట్టా ధరించాం
వంటచెరుకూ, బొగ్గూ ఎత్తినం
మా పొయిల్లో పుల్ల లేదు
ఇటుకా, గూనా తోలినం
కప్పులేని గోతుల్లో ముడుచుకొన్నం
శ్రమగీతం ప్రతిదీ
ద్వేషంతో నిండి, గుండెల మాడ్చేసింది.

1949లో యిచాంగ్ విముక్తి చేయబడింది. పూర్వం పెట్టుబడిదార్ల, అధికార్ల అణచివేతకూ, బాధలకూ, దోపిడీకీ గురిచేయబడ్డ కార్మికులు యిప్పుడు తమ దేశానికి అధినేతలై పోయ్యారు. ఓడరేవు పనినిర్వహణలో భాగస్వాములై, మాతృదేశంలో సోషలిజం నిర్మాణానికి నిస్వార్థంగా పాటుపడటం మొదలుపెట్టారు. తరతరాలుగా కార్మికులు సరుకులను తమ భుజాలమీద, వీపులమీదా మోయడంపోయి క్రమంగా క్రేన్లు వచ్చేసినై. సరుకులు ఎత్తడం దించడం ఎక్కువగా యంత్రాలే చేస్తున్నయ్.

ఈ మార్పులన్నీ చూసిన హువాంగ్‌షెంగ్-సియావో గుండె యాంగ్ట్సీనది ప్రవాహంలా పరవళ్ళుతొక్కింది. బాల్యంనుండే ఓడరేవులో కష్టపడ్డ తాను సమాజపు పాపాలను దూషిస్తూ సోషలిజాన్ని తన కవితలో గానంచేయాలనుకొన్నాడు. ఎలా రాయాలో తెలియక మొదట శ్రామికుల శక్తినీ, శ్రమగౌరవాన్నీ తెలిపే కొన్ని శ్రమ గీతాల రచించాడు. ఈ పాటల పాడుతూ రేవు కార్మికులు ఉత్సాహంతో నిండిపోయి తమ పనులను నిర్ణీత సమయంకన్నా ముందే చేయడం మొదలుపెట్టారు.

హువాంగ్‌షెంగ్-సియావో సృజనాత్మక రచనలు మొదటినుంచీ ప్రజల, నాయకుల దృష్టిని ఆకర్షించి ప్రోత్సాహాన్ని పొందినయ్. 1951 లో అతడు యిచాంగ్‌కు చెందిన ప్రథమశ్రేణి ఆదర్శ ప్రచారకుడుగా పేర్కొనబడ్డాడు. తనకు ఒక కలం

బహుమానంగా యివ్వబడ్డప్పుడు అతడు ఎంతో కదలిపోయి యిట్లా అనుకొన్నాడు "పాత సమాజంలో వేలకొద్ది కలాలను వీపున మోసాను కాని అందులో ఒక్కటి కూడా నాకు చెందిందికాదు. కాని యిప్పుడో; కమ్యూనిస్టు పార్టీ నాకోకలం యిస్తున్నది. దీంతో కార్మికులమైన మా మనసుల్లో పార్టీ యెడా, చెయిర్మన్ మావో యెడా ఎలాంటి భావాలున్నాయో, సోషలిజం గూర్చి ఏం పాడుతామో రాస్తాను" ఇలా అనుకొన్న అతని కలంనుండి "చెయిర్మన్ మావో నాకో కలం యిచ్చాడు" అనే కవిత వెలువడింది.

పాత సమాజంలో వేలకొద్దీ కలాల పెట్టెలు మోస్తూ
నా భుజాలు వేలసార్లు రాపిడిగొన్నాయ్
నాశక్తి వ్యయమైపోయింది
కాని నేనుమోసిన కలాల్లో ఒకటికూడా నాదికాదు
నెత్తురు సముద్రంలో ముంచిన, పెట్టుబడిదారుని కలం
కార్మికుల రక్తం కార్చింది
కూలీల మూల్గులు పీల్చింది
ప్రతి ఓడరేవునూ, ఆక్రమించుకొన్న తెల్లదేలుమనిషి
కావడికొయ్యకు కిరాయీ, వడ్డీలాగేవాడు.
అతని కలంయొక్క ఒకపోటుతో
యాంగ్సీనది పొడుగునా
మా కన్నీళ్ళు కురిసేవి
చెయిర్మన్ మావో విప్లవంలో మమ్మల్ని ముందునడిపాడు
మా శక్తి సీమలులేనిదై
మా వీపులపైనుండి *మూడు పర్వతాలనూ
తొలగించివేసింది.
ఈభూమ్మీద చీకటియుగాన్ని
బద్దలుకొట్టినం
యాంగ్సీనదీ, ఓడలూ, నేలా
తిరిగి మాకు వచ్చినయ్
ఘోర సముద్రంనుండి నేను బయటికీదూకాను
ఈ నేలకు, యీ సంస్కృతికి యజమానిని

---

* మూడు పర్వతాలు. 1. సామ్రాజ్యవాదం 2. భూస్వామ్యవిధానం
3. విరంకుశ పెట్టుబడిదారీ విధానం

నాకలం నాకు తిరిగి యివ్వబడింది
చెయిర్మన్ మావో నాకోకలం యిచ్చాడు
పార్టీ మాకోసం చేసిన మేళ్ళను నిరంతరంగా రాస్తాను.
నా గుండెలో ఎర్రటిసూర్యుడు ఉదయిస్తాడు
నేను అనురాగం, ఆనందంగురించి రాస్తాను
సాహితీరంగంలో నేను యుద్ధభేరీ మోగించసాహసిస్తాను (ఇక్కడి)
ఉపరినిర్మాణంమీద ఎర్రజెండా నిలబెడతాను.
మా సోషలిస్టు మాతృదేశంలో కొత్త అద్భుతాలు
సృష్టించిన లక్షలాది యోధులగురించి రాస్తాను

హువాంగ్ షెంగ్-సియావో పనిచేస్తూనే అధ్యయనమూ, కవితాభ్యాసంగమూ కొన సాగించాడు. శిక్షణ యివ్వడానికి పార్టీ యితణ్ణి కార్మికుల విరామకాల పాఠశాలకు పంపించి అతని రచనల తిరిగి సరిచూడడంలో సహాయపడేందుకు అనుభవనీయులైన రచయితలను నియమించింది. ఈ కవి అనుభవం మరింత విస్తృతపరిచే ఉద్దేశంతో పీకింగ్, షాంఘై, యింకా యితర స్థలాల్లోని అభివృద్ధిచెందిన కార్మిక, కర్షక సైనిక జనంతో మాట్లాడ్డానికి యితణ్ణి పంపింది.

హువాంగ్ షెంగ్-సియావో చెయిర్మన్ మావో రచనలు ఎంతో మనఃపూర్వక మైన పట్టుదలతో చదివాడు. సాహిత్యమూ కళలపై మావో యేనాన్ ప్రసంగం చది విననాటినుండీ అతడు మరింత చైతన్యంతో సోషలిస్టు పోరాటానికీ, సోషలిజం నిర్మా ణానికీ తన కవితను ఒక ఆయుధంగా ఉపయోగించాడు. 1954లో అతడు కమ్యూ నిస్టు పార్టీ సభ్యుడైనాడు.

1958 'పెద్దముందడుగు' (Creat Leap Forward) కాలంలో దేశంలోని అందరు ప్రజల్లాగే యివాంగ్ రేవు కార్మికులుకూడా ప్రజ్వరిల్లే విప్లవోత్సాహంతో, సాహసంతో నిండిపొయ్యారు. అణచశక్యంకాని తీవ్రమైన విప్లవావేశంతో హువాంగ్ షెంగ్-సియావో "పెద్దముందడుగు" ఉద్యమాన్ని పొగడుతూ ఎన్నో ప్రసిద్ధమైన కవి తలు రాశాడు 'జనసాహిత్య కార్యకర్తల' 'జాతీయసదస్సు'లో పాల్గొనేందుకు అతడు పీకింగ్ వెళ్ళాడు.

సాంస్కృతిక విప్లవంలో ఉక్కు దృఢత్వంపొందిన హువాంగ్ షెంగ్-సియావో ఉత్సాహం సృజనాత్మక రచనారంగంలో మరింత విజృంభించింది. శ్రామిక జన సాంస్కృతిక విప్లవ విజయాన్ని గానంచేస్తూ, మావో విప్లవమార్గాన్ని తీవ్రంగా

ప్రచారంచేస్తూ చాలా చురుకుగా విప్లవపోరాటానికీ, ఉత్పత్తిరంగంలో పోరాటానికీ, సమన్వయపూర్వకమైన తన సహకారాన్ని అందించాడు.

గత రెండేళ్ళకాలంలో అతడు 20కి పైగా కవితారచనలు చేశాడు. "ప్రజా సాహిత్య ప్రచురణాలయం" దేశమంతటికీచెందిన కార్మికులు, కర్షకులు, సైనికులురాసిన కవితా సంకలనం వెలువరించింది. అందులో 'పర్వతాన్నీ, సముద్రాన్నీ మోస్తూ నేను పార్టీని అనుసరిస్తాను' అనే అతని 180 పంక్తుల గీతం ప్రచురించబడింది. ఆ కవితలో అతడు యిలా రాస్తాడు.

రేవుకార్మికుడు తన స్వేచ్ఛ, సగర్వ
భావాలను వ్యక్తపరుస్తాడు
ఆనకట్ట ద్వారాల వెల్లువలా
అతని హృదయం పొంగి పొరలుతుంది
రేవు నీటిమార్గం ఒడ్డుమీదనిలబడి
అతడు ఓడరేవులమీదికి చూస్తాడు
చూసినాకొద్దీ అతని ఉత్సాహం
మరింత పొంగిపోతుంది.
*క్రేన్ల శ్రేణులు తన పెద్దచేతులను ఆడిస్తాయి
అత్యంతవేగంగా కదులుతాయి
గూడ్సుబళ్ళు, ఎడతెరపిలేకుండా
వేగంగా వస్తూనే ఉంటాయి
ఈ ఓడరేవుల్లో ఎంత గొప్ప మార్పువచ్చింది!
రేవు కార్మికుని హృదయభావాల రాయటానికి
నేను లోయల్లోంచి ఒక శిఖరాన్ని
కుంచెలా పైకెత్తుతాను
ప్రతి పంక్తి ఒక పాట
ప్రతి పదమూ ఒక పూలచెండు
పార్టీయే నన్ను ఘోర సముద్రంనుంచి కాపాడింది
రేవు కార్మికుడు యిప్పుడు యీనేలకు అధినేత
పార్టీయే అతని మార్గాన్ని చూపుతుంది
ఓడ రేవు పనులు యిప్పుడు యంత్రాలతో నడుస్తాయి
యాంగ్సీనది పొడుగునా విన్నటి బానిసలు

నేడు యజమానులు
పర్వతాలూ, సముద్రాలూ మోయగల
శక్తి సంపన్నులు
ఉక్కూ, యినుమూ, ధాన్యం, పత్తి
వరుసగా అడుగులేస్తూ మా ముందుకు వస్తాయి
వాటిని అన్నిచోట్లకూ ఓడల్లో పంపించే పని
మాతృభూమి మాకు ఒప్పగిస్తుంది.
శ్రమగీతం ప్రతిదీ యిప్పుడొక
చక్కని గానం
ప్రతి చెమట బిందువూ ఒకపూవు
వసంత పవనం అనుభూతితో
రేవు కార్మికుడు
ప్రజల కోసం నూతన దేశం నిర్మించేందుకు
సంపూర్ణ శక్తివంతుడై ఉన్నాడు
మేం దేవుళ్ళమీదా, చక్రవర్తులమీదా
ఆధారపడం
'మహామేధావుల' మీదా, విగ్రహాల మీదా
మాకు నమ్మకం లేదు.
మేం ప్రజల శక్తిమీద ఆధారపడతాం
శ్రమే నూతన ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

ప్రస్తుతం లిన్‌పియావో మరియు కన్‌ఫ్యూషియస్‌ను విమర్శించే ఉద్యమంలో గాఢమైన శ్రామికభావాలతో హువాంగ్ షెంగ్-సియావో తనకలాన్ని ఆయుధంగా ఉపయోగిస్తాడు. పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో లిన్‌పియావో ఉపయోగించిన కన్‌ఫ్యూషియస్, మెన్షియస్ సిద్ధాంతాలను ఖండిస్తాడు.

"విప్లవ రచయితలూ, కళాకారులూ, మనస్ఫూర్తిగా, వెనుకాడకుండా, కార్మిక కర్షక, సైనిక జనాల్లోకీ, పోరాట వేడిలోకి చాలాకాలం వెళ్ళిపోవాలి" అనే మావో బోధను హువాంగ్ షెంగ్-సియావో ఎన్నడూ మరచిపోడు. ట్రేడ్‌యూనియన్ కేడర్ అయిన తరువాతా, కవిగా గుర్తించబడ్డాకా కూడా అతడు ప్రజల మధ్య నివసిస్తూ, పనిచేస్తూ వచ్చాడు. ఇతని కవితలన్నీ శ్రమలో, పోరాటవేడిలో పుట్టినవే.

తన అనుభవాన్ని గూర్చి మాట్లాడుతూ "అన్నీ శ్రమించే చేతుల్లోంచే పుట్టుకొస్తాయి. చెమటలేనిదే పంటలేదు. నాకవితలన్నీ శ్రమ జీవితంలో పుట్టినవే"

అన్నాడతడు. అరదెన్నడూ జనాన్నీ, శ్రమనూ వదలలేదు- కాబట్టి అతని కవితలు శ్రమజీవుల ఆలోచనలనూ, అనుభూతులనూ ప్రతిబింబించడమే కాక విపరీతమైన ప్రచారంలో వున్నాయి. దేశమంతటి నుండీ కార్మిక కర్షక, సైనిక, పాఠకులు అతనికి చాలా ఆప్యాయంగా ఉత్తరాలు రాస్తారు- అతని కవితల గూర్చి ఒక కార్మికుడు యిలా రాశాడు "అవి జీవితంతో తొణికిసలాడుతాయి- సజీవమైన మనోచిత్రాలూ, పిజాయితీగల అనుభూతులూ ఆకవితల్లో ఉంటాయి. సాహిసికమైన గొప్పదృష్టీ, గట్టి పోరాట శీలమూ, కలిగి కార్మికుని మనస్సును మాట్లాడుతాయి- సగ్గా యిలాంటి కవిత్వమే మాకుకావాలి".

పార్టీ గరపే శిక్షణా, ప్రజల ప్రోత్సాహమూ హువాంగ్ షెంగ్-సియావోకు గొప్ప శక్తినిస్తాయి- తన పనినుండి విరమించుకునే వయస్సు చేరుకున్నా, యింకా దృఢంగావున్న సియావో అలా చేయడానికి నిరాకరిస్తాడు. గత సంవత్సరం జూలై నుండీ అతడు యాంగ్సీ స్టీమర్ నెం 2008 సిబ్బందితోకలిసి పనిచేస్తూ వారితోనే ఉంటూ 'గట్టిగా నిలబడ్డ యాంగ్సీ అధినేతలు' అనే తన కావ్యపు 3వ భాగాన్ని రాయటానికి సిద్ధపడుతున్నాడు.

"మంచి భవిష్యత్తును నిర్మించడానికీ, కమ్యూనిజాన్ని తీసుకురావడానికీ దోహదకరంగా నేను ఎప్పుడూ ప్రజల ప్రచారకునిగా ఉంటూ, రచనలు చేస్తూనే పోవాలి" అని అంటాడు అతను.

[అనువాదం: లోచన్]

సమీక్ష:

చైనా విప్లవం-సాంస్కృతిక ఉద్యమం

సి. ప్రసాద్

పిలుపు ప్రచురణ, హైద్రాబాద్. వెల 1-25

సంస్కృతి అంటే అదేదో బ్రహ్మ పదార్థం అని. మహోన్నత భావాలమయమని, అది కొద్దిమంది 'గొప్పవారి' సొత్తని మేధావులు చెబుతారు. గతాన్ని, మతాన్ని, దేవుడిని ప్రేమించి, నమ్మి, పూజించడమే సంస్కృతిఅని పండితులంటారు. పుస్తకాలు అదేపనిగా చదివి, నెమరువేసుకుని, లొట్టలు వేయడం సంస్కృతికి చిహ్నంగా చాలా

మంది విద్యావంతులు భావిస్తుంటారు. వీటన్నిటివల్ల సంస్కృతి అంటే మానవ సమాజానికి, సామాన్య జనానికి, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు దూరంగా వుంటుందనే భ్రమ కల్పించారు.

కాని ప్రపంచంలో అన్ని సంపదలు, సాహిత్యం, కళలు, సంస్కృతి అన్నిటికి సృష్టికర్తలు కష్టజీవులే. శ్రమైక జీవన సౌందర్యమే సంస్కృతి. శ్రమశక్తినుంచే ఆచరణ, ఆచరణనుంచే ఆలోచన, ఆలోచననుంచే సాంకేతిక అభివృద్ధి సాధ్యపడ్డాయి, ఇవన్నీ కలిసి మానవజాతికి సంస్కృతిని ప్రసాదించాయి. అంతేగాని సంస్కృతి మతపరమయిందీ కాదు, ఆధ్యాత్మిక భావసంపత్తీ కాదు, దేముడి దయతో దక్కింది అంతకన్నా కాదు.

అందుకే ఈపుస్తకంలో మొదటివాక్యమే అక్షరలక్షలు చేస్తుంది. "సంస్కృతి సమకాలికమైన సమాజంయొక్క ఆర్థిక రాజకీయ వ్యవస్థలకు భావ ప్రతిబింబం". ఆవాక్యానికి మన కుహనా సంస్కృతీపరులు గుండెలు బాదుకుంటారు. మానవ సమాజానికి, సామాన్యజనానికి ఆర్థిక రాజకీయ జీవిత విధానానికి సంస్కృతితో రక్త సంబంధం ఉంటుంది. ఈ పుస్తకం సంస్కృతికి అద్దం పట్టింది.

చైనాలో వలస, భూస్వామ్య సంకర సంస్కృతి చాలాకాలం రాజ్యం చేసింది. ప్రజలను అణచిపెట్టి వుంచడమే, ప్రజలను భావదాస్యంలో మగ్గేలా చేయడమే ఆ సంస్కృతి లక్షణం. రాజకీయ ఆర్థిక వ్యవస్థను పోరాటంద్వారా మార్చడానికి చైనాలో కమ్యూనిస్టులు కంకణం కట్టుకున్నారు. చైనా సంస్కృతీ వుద్యమాలు చేదోడు వాదోడుగా నిలబడ్డాయి. నూతన ప్రజాస్వామ్య సంస్కృతిని మొగ్గలోనే తుంచి వేయాలని పాలకవర్గాలు తెగతంటాలు పడ్డాయి. కాని నూతన ప్రజాస్వామ్య సంస్కృతి తన వంతు పాత్రను గొప్పగా నిర్వహించి వాళ్ళ ప్రయత్నాలను తిప్పికొట్టగలిగింది. విప్లవానికి పూర్వం విప్లవ సంస్కృతి ప్రజలను సిద్ధాంతరీత్యా తయారుచేసింది. విప్లవం జరిగేకాలంలో సంస్కృతీరంగం మొత్తం విప్లవరంగంలో ఒకభాగమై పోయింది. విప్లవ సంస్కృతీసాధకులు ప్రజాశ్రేణులను నడిపే సేనానాయకులయారు.

'సమాజ హృదయమే సాహిత్యం'అన్నాడు గోర్కీ. సంస్కృతిలో సాహిత్యం ప్రధానభాగం. ఎన్నో సాహిత్య సంస్థలు, రచయితల సంఘాలు చైనా విప్లవ రాజకీయాలకు బాసటగా నిలిచాయి. లూసన్ లాంటి మేటిరచయిత, కార్యశూరుడు కష్టజీవులకు తనకలం అంకితంచేసి వారికి తోడు నిలిచాడు. లూసన్ ఒకవ్యక్తి కాదు శక్తి ఒక రచయితకాదు. ఒక ఉద్యమకారుడు. సాటిలేని రాజకీయ అవగాహనతో చైనా విప్లవ సాంస్కృతిక రంగానికి ఎనలేని సేవచేశాడు. అలాగే లీసుంగ్‌సన్ వివుపేద

కుటుంబంలో పుట్టి నానాఅగచాట్లుపడి బిచ్చమెత్తుకు బతికి, విప్లవానంతరం చదువునేర్చు కుని, కొన్ని స్కూళ్ళ నిర్వహణ బాధ్యత కూడా తీసుకుని, గొప్పకవి అయాడు.

ఈ పుస్తకంలో అభరున చైనాలో ప్రజాకళల గురించి ఒక వ్యాసం వుంది జానపద కళారూపాలే విప్లవభావ ప్రచారానికి అనువుగావుంటాయి. ప్రజల గుండెల్లో సూటిగా నాటుకుంటాయి. ఏ రకమైన హంగామాలేకుండా చాలా తక్కువ ఖర్చుతో మనం ప్రచారం చేసుకోవచ్చు. "యంత్రనృత్యం" అనే ప్రదర్శన చాలా ఆసక్తిదాయకంగావుంది, ఒకరి చేతులు, కాళ్ళు తల మరొకరి వాటిమీదుగా తిప్పడం ద్వారా ప్రేక్షకులునిజంగా యంత్రాలు తమ ఎదురుగా తిరుగుతున్నట్లే అనుకునేవారు.

ఈ పుస్తకంలో ముఖ్యంగా మనం నేర్చుకోవాల్సినవి మూడు సంగతులు:

1. రాజకీయ విప్లవానికి సాంస్కృతిక విప్లవం చేదోడు వాదోడుగా వుండాలి.

2. రచయితలు, వారిసంఘాలు, సంస్కృతీరంగంద్వారా ఎక్కువ సేవ చేయగల్గుతారు.

పల్లెల్లో రైతుకూలీల దగ్గరకు స్వయంగావెళ్ళి వారిలో చైతన్యం రగిలించడానికి రచయితల కృషి ఎంతగానో తోడ్పడుతుంది. అందుకే లూసన్ "విప్లవం అనే పువ్వు వికసించడానికి నేను ఎరువుగా వుపయోగపడినా సంతోషపడతాను" అన్నాడు.

3. జానపద కళారూపాలను ప్రతి రచయిత, కవి, కళాకారుడు క్షుణ్ణంగా ఆకళించుకోవాలి

ఎన్నో చిక్కుప్రశ్నలకు ఈపుస్తకంలో జవాబులు దొరుకుతాయి. ముఖ్యంగా సాంస్కృతిక రంగంలో రచయితల కర్తవ్యాలు యిందులో గొప్పగా వివరించారు. ఆనాటి చైనాలోలాగ ఈనాటి మనదేశంలో కూడా వలస భూస్వామ్య సంకర సంస్కృతిదే పైచెయ్యి. దీనిస్థానంలో నిజమైన ప్రజాసంస్కృతిని నిర్మించాలంటే నిరంతర సాంస్కృతిక పోరాటమే శరణ్యం. ఇందులో రచయితలు, కళాకారులు ఎన్నో కష్టాలెదుర్కోవాలి. మన సుబ్బారావు పాణిగ్రాహిని కాంగ్రెసు ప్రభుత్వం పొట్టన పెట్టుకున్నట్లే 1931లో చైనాలో అయిదుగురు యువరచయితలను కాల్చి చంపింది కొమింటాంగ్ ప్రభుత్వం. "తీవ్రమైన పోరాటంవల్లగాని దేన్నీ సాధించలేం" అన్న మాటను చాటి చెబుతుంది ఈపుస్తకంలోని ప్రతిఅక్షరం. ప్రతి రచయిత, కవి, కళాకారుడు, విరసం సభ్యులు ప్రతి ఒక్కరు చదివి తీరవలసిన పుస్తకం.

ప్రతులకు: సృజన, హన్మకొండ-506001.

సామ్రాజ్యవాదం, అభివృద్ధి నిరోధకులంతా కాగితం పులులే!

ఎస్. ఆర్. ప్రసాద్

"విపత్తులు సృష్టించడం. భంగపడటం, తిరిగి విపత్తులు సృష్టించడం. తిరిగి భంగపడటం......పతనమయ్యేవరకూ సామ్రాజ్యవాదులు ఈ విధంగానే వ్యవహరిస్తారు. వారి లక్షణమేయిది. ప్రజల ఆశయాలకు విరుద్ధంగా ప్రపంచంలోని అభివృద్ధి నిరోధకులంతా వ్యవహరించే తీరేయిది. ఈ సూత్రీకరణకు వ్యతిరేకంగా వారెప్పుడూ వెళ్ళరు. ఇది మార్క్సిస్టు సూత్రీకరణ సామ్రాజ్యవాదం క్రూరమైంది. అనిమేమం టున్నాం అంటే దానర్థం సామ్రాజ్యవాదం యొక్క స్వభావం ఎన్నటికీ మారదు. సామ్రాజ్యవాదుల గోరీకట్టబడేవరకూ వారు గౌతమ బుద్ధులుగా మారరు.

పోరాటం, ఓటమి. తిరిగి పోరాటం. తిరిగి ఓటమి...... అంతిమ విజయం దాకా ఇదేవరుస. ఇది ప్రజలనుసరించవలసిన పంథా. ఈ పంథాను ప్రజలెప్పుడూ వ్యతిరేకించరు. ఇదికూడా మరొక మార్క్సిస్టు సూత్రం. రష్యా ప్రజా విప్లవం ఈ సూత్రాన్నే అనుసరించింది. చైనా ప్రజావిప్లవంకూడా దీనినే అనుసరించింది.

ఈనాడు వియత్నాం, కాంబోడియా జాతీయ విముక్తి పోరాటాలు కూడా ఈ మార్గాన్నే అనుసరించినవి. 'ప్రపంచ పోలీసు'గా విముక్తి పోరాటాల నణచడమే తన బాధ్యతగా పెట్టుకొని, విపత్తులు సృష్టించి భంగపడినా తిరిగి విపత్తులు సృష్టించే కర్తవ్యాన్ని తన నెత్తిపై వేసుకున్న అమెరికా సామ్రాజ్యవాదం ఈనాడు మరల వియత్నాం, కాంబోడియా ప్రజల చేతుల్లో భంగపడి చావు దెబ్బలు తిన్నది. సిఐఏ ద్వారా సైనిక తిరుగుబాట్లు సృష్టించి తన తొత్తులతో కీలుబొమ్మ ప్రభుత్వాల నేర్పాటుచేసి విప్లవ పోరాటాల నణచివేయాలనే కుట్రలకు కాలం చెల్లిపోయింది. తాను చేయ తలపెట్టిన ఆర్థిక సహాయాన్ని సిహనౌక్ నిరాకరించాడని, దక్షిణ వియత్నాం జాతీయ విమోచన దళాల న్యాయమైన పోరాటాన్ని సమర్థించాడని 5 సంవత్సరాల క్రితం కుట్రతో సైనిక తిరుగుబాటుద్వారా దేశద్రోహి లోన్‌నాల్‌ను అధికారంలోకి తెచ్చింది. కాని ప్రజల అండలేని ఏ ప్రభుత్వాలుకూడా చరిత్రలో నిలువలేదు ప్రజల ఆగ్రహానికి గురిఅయి విప్లవ జ్వాలలో మాడిపోకతప్పలేదు ఈనాడు కాంబోడియాలో జరిగింది. ఖ్మెర్ రూజ్ దళాలు సాధించిన ఎర్రని విముక్తి, లోన్‌నాల్ పలాయనం అమెరికా సామ్రాజ్యవాదానికే కాకుండా, సోషల్ సామ్రాజ్యవాదానికికూడా చావుదెబ్బే.

1970లో కాంబోడియాలో కీలుబొమ్మ ప్రభుత్వం కుట్రద్వారా అధికారంలోకి రాగానే సిహనౌక్, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఖ్మేర్ రూజ్ సైన్యాలు, కాంబోడియా ప్రజలు జరుపుతున్న విముక్తి పోరాటాన్ని బలపరచవలసిందిగా సోషల్ సామ్రాజ్యవాదులను కోరాడు. కాని సోషల్ సామ్రాజ్యవాదులు కాంబోడియాను తమ పలుకుబడి ప్రాంతంగా మార్చుకోవాలన్న కుట్రతో, అమెరికన్ సామ్రాజ్యవాదులతో లాలూచీపడి, దేశద్రోహి లోన్ నాల్ విప్లవ ప్రతీఘాతుక ప్రభుత్వాన్ని గుర్తించి, తాము పాత జారులకు వారసులమేనని నిరూపించుకున్నారు. ఈ నయా జారులకు అనుకూలంగానే ఇండియాకూడా లోన్ నాల్ ప్రభుత్వాన్ని గుర్తించి తనస్వామి భక్తి ప్రకటించుకుంది. ఖ్మేర్ రూజ్ దళాలు విజయం తర్వాత విజయాన్ని సాధిస్తూ నాంఫెన్ శివార్లలోకి ప్రవేశించగానే 'ఏదయినా అద్భుతం, జరిగి లోన్ నాల్ ప్రభుత్వం నిలబడ వచ్చునన్న ఆశ నిరాశేఅయి, చివరకు సిహనౌక్ ప్రభుత్వాన్ని గుర్తించడం తప్పనిసరి అయింది. మూడవ ప్రపంచంలోని దేశాలకు, కాంబోడియా విముక్తి పోరాటం తమ మిత్రులెవ్వరో, శత్రులెవ్వరో సరిగానే చూపింది.

ఇండోచైనాలో కాంబోడియా సరిహద్దు నానుకునేఉన్న దక్షిణ వియత్నాంలో కూడా నేడోరేపో వియత్నాం ఎర్ర సైనికులు సైగాన్‌పై ఎర్రజెండా నెగురవేయబోతున్నారు. వేయి సంవత్సరాలుగా వీరవియత్నాం ప్రజల పోరాటచరిత్ర వారిని ఉక్కు మనుషులుగా తీర్చిదిద్దింది. వారి దీర్ఘకాలిక పోరాటంలో 1930లో వియత్నాంలో మార్క్సిష్టు లెనినిస్టు పార్టీ (వియత్నాం వర్కర్స్ పార్టీ) అవతరించి వారిని ఇంకా బాగా సంఘటిత పరిచింది. మార్క్సిష్టు-లెనినిస్టు పార్టీ జెండాకింద హోచిమిన్ మామ నాయకత్వాన ఫ్రెంచి వారితోనూ, అమెరికా సామ్రాజ్యవాదంతోనూ, దీర్ఘకాలిక పోరాటంజరిపి 1945 సెప్టెంబర్‌లో ఉత్తర వియత్నాం విముక్తిని సాధించుకున్నది. అయితే సామ్రాజ్యవాదుల కుట్రవల్ల దక్షిణ వియత్నాం ఏర్పడి వియత్నాం ఏకీకరణకు అక్కడి కీలుబొమ్మ ప్రభుత్వం ఒక అడ్డంకిఅయి సాయుధపోరాటం కొనసాగించడం ద్వారా సామ్రాజ్యవాదులను వారితొత్తులను నాశనంచేయడం ఒక్కటేమార్గం అయింది. గతమూడు నెలలనుండి ఈ పోరాటం ఎన్నడూలేనంత తీవ్రతర మయింది. జాతీయ విముక్తి దళాలు వెంట వెంటనే విజయాల్ని సాధిస్తూ, పల్లెలను విముక్తంచేసి పట్టణాలను ఆక్రమిస్తూ సైగాన్‌వైపు దూసుకుపోతున్నాయి. అమెరికాలో తీవ్రతరమవుతున్న ఆర్థిక సంక్షోభం కారణంగా, వియత్నాంలో అమెరికా విధానానికి, అమెరికా ప్రజల ప్రతిఘటన కారణంగా, అమెరికా ఆయుధ సహాయంకూడా కీలుబొమ్మ ప్రభుత్వానికందడంలేదు. ఇంతవరకు పంపిన ఆయుధాలన్నీకూడా విమోచన దళాల వశమయినాయి, దానితో కీలుబొమ్మ ప్రభుత్వం సంక్షోభానికిలోనయి, థియూ రాజీనామాకు దారితీసింది. రోజుకొక మంత్రివర్గం మారుతోంది.

జాతీయ విముక్తి దళాలు ఆక్రమిస్తున్న ప్రాంతాలనుండి వేలకొలది శరణార్థులు సైగాన్‌కు తరలి వస్తున్నారంటూ అది వారి కమ్యూనిస్టు వ్యతిరేకతకు నిదర్శనమని చెపుతూ, ప్రపంచ పోలీసుగా కమ్యూనిజాన్ని తాము అరికట్టాల్సిన బాధ్యతను సెనేట్‌కుగుర్తు చేస్తూ, దక్షిణ వియత్నాంను కాపాడడానికి సహాయం అడిగాడు ఫోర్డ్. కాని మార్చి 26 న్యూయార్క్ టైమ్స్ రిపోర్టు ప్రకారం విలేఖరులు శరణార్థులను, వారు ఇళ్ళు విడిచి పోవడానికి కారణమేమని అడిగితే వారిలో ఏ ఒక్కరూ కూడా కమ్యూనిస్టు వ్యతిరేకత తాము పోవడానికి కారణమని చెప్పలేదు. అంతేకాకుండా కూలిపోతున్న కీలుబొమ్మ ప్రభుత్వానికే అంత ప్రజా బలముంటే ఆ ప్రభుత్వం అంత త్వరగా ఎందుకు పతనమవుతున్నది? థియూ తైవాన్ ఎందుకు పారిపోవాల్సివచ్చింది? దక్షిణ వియత్నాం ప్రజలు కమ్యూనిస్టు వ్యతిరేకులనటం పచ్చిఅబద్ధం. కూలిపోతున్న సామ్రాజ్యవాదాన్ని నిలబెట్టడానికి చేసే వ్యర్థప్రయత్నం.

దక్షిణ వియత్నాం ప్రతిప్రాంతంలో కూడా ముఖ్యంగా పల్లె ప్రాంతాలలో ప్రజలు పెద్దఎత్తున జాతీయ విముక్తి సేనలలో చేరుతున్నారు. జాతీయ విముక్తి సైన్యం పట్టణాలను పట్టుకోడానికి సహకరిస్తున్నది. జాతీయ విముక్తి సైన్యానికి మోంటాగ్నార్డ్స్ కొండజాతి ప్రజల తోడ్పాటు గురించి న్యూయార్క్ టైమ్స్‌కు తెలియచేసిన ఫ్రెంచి జర్నలిస్టు పాల్ లెండ్రిని కీలుబొమ్మ సైనికులు కాల్చివేసినట్టు న్యూయార్క్ టైమ్స్ ప్రకటించింది. నిజాల్ని ఎంతదాయాలనుకున్నా కూడా వియత్నాంలో మారణహోమానికి కారకులెవరో, జనీవా ఒప్పందానికి, వియత్నాం ఏకీకరణకు అడ్డుపడుతున్నదెవ్వరో వియత్నాం ప్రజలకు తెలుసు. ఈనాడు "దేశాలు స్వాతంత్ర్యాన్ని కోరుతున్నాయి. జాతులు విముక్తిని కోరుతున్నాయి. ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు." ఈ అరుణారుణ సత్యాన్ని అణచాలనుకునే వారినెవ్వరినయినా సరే చరిత్ర తుడిచివేస్తుంది.

ఒకవైపు సైగాన్‌పై ఎర్రజెండా ఎగురవేయడానికి జాతీయ విముక్తి దళాలు దూసుకువస్తుంటే అమెరికా సామ్రాజ్యవాదులు ఎలాగయినా ఆ 'ప్రమాదాన్ని' ఆపాలని దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వంపై 'కాల్పుల విరమణ', 'శాంతి సంభాషణ'లను రుద్దజూస్తున్నది. కాని వియత్నాం పోరాట వీరులకు 'శాంతి సంభాషణలు' 'కాల్పుల విరమణ' లాంటి చిలుక పలుకులకు అర్థాలు బాగాతెలుసు. ఈచిలుక పలుకులకు మోసపోయి వారు పోరాటానికి విశ్రాంతి ప్రకటించరు. నేడో రేపో సైగాన్‌పై ఎర్రజెండా నెగురవేసి విముక్తిని సాధించి తీరుతారు.

వియత్నాం కాంబోడియా ప్రజల విజయాలు వారివిజయాలే కాకుండా, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రపంచ విప్లవ శక్తుల విజయాలు. "అభివృద్ధి నిరోధకు

లంతా కాగితం పులులే. చూడడానికి అభివృద్ధి నిరోధకులు భయంకరంగానే వుంటారు కాని వాస్తవంలో వారంతటి శక్తివంతులుకాదు. దూరదృష్టితోచూస్తే, అభివృద్ధి నిరోధకులుకాక ప్రజలే వాస్తవంగా శక్తివంతులు" అన్న, మహానాయకుడు మావో యాంగ్ సూక్తిని నిరూపించిన ఎర్రెర్రని విజయాలివి.

వియత్నాం, కాంబోడియా ఎర్ర సైన్యాలకు లాల్‌సలామ్.

> **రచయితలకు విజ్ఞప్తి**
>
> సృజన ఆగస్టు 75 సంచిక "కథల ప్రత్యేక సంచిక" గా వెలువడుతుంది. రచయితలు తమ కథలను జూన్ 10 వ తేదీ లోపు పంపవలసిందిగా కోరుతున్నాం.
>
> — సం॥

పోరాటానికి సాహసిస్తే

"చూపులకు పెనుభూతంలా కనిపిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం వాస్తవానికి కాగితం పులి మాత్రమే. అది నేడు మృత్యుశయ్య మీద కొట్టుమిట్టాడు తున్నది. వర్తమాన ప్రపంచంలో వాస్తవానికి ఎవరినిచూచి ఎవరు భయపడుతున్నారు? వియత్నాం ప్రజలు, లావోస్ ప్రజలు, కాంబోడియా ప్రజలు, పాలస్తీనా ప్రజలు, అరబ్ దేశాల ప్రజలు, ఇతర దేశాల ప్రజలు అమెరికా సామ్రాజ్యవాదాన్ని చూచి భయపడడం లేదు. ప్రపంచ ప్రజలనుచూచి అమెరికా సామ్రాజ్యవాదమే భయపడుతున్నది. ఆకుల గలగలలకే అది భయంతో వొణికి పోతున్నది. ధర్మయుద్ధానికి పుష్కలమయిన మద్దతు లభిస్తుందనీ, అధర్మయుద్ధానికి కించిత్తు మద్దతు కూడా లభించదనీ అసంఖ్యాకమైన వాస్తవాలు రుజువు చేస్తున్నాయి, బలహీనమయిన దేశం బలవంతమైన దేశాన్ని, చిన్న దేశం పెద్ద దేశాన్ని ఓడించగలదు. పోరాటానికి సాహసిస్తే, ఆయుధాలు అందు కొని తమదేశ భవిష్యత్తును తమచేతులలోకి తీసుకొనేందుకు సాహసిస్తే, ఒక చిన్న దేశానికి చెందిన ప్రజలు ఒక పెద్దదేశం చేసే దురాక్రమణను తప్పనిసరిగా ఓడించ గలరు. ఇది చరిత్ర పరిణామ సూత్రం

ప్రపంచ ప్రజలారా! ఐక్యంకండి: అమెరికా దురాక్రమణదారుల్ని, వారి గులాముల్ని ఓడించండి".

[కాంబోడియాపై అమెరికా దురాక్రమణ చేసిన సందర్భంలో చైర్మన్ మావో చేసిన చారిత్రాత్మక "మే 20 ప్రకటన" (1970) నుండి]

ప్రపంచ విప్లవ కేంద్రమయిన జనచైనాను చుట్టుముట్టాలన్న సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల కుట్రలోని అంతర్భాగమే సిక్కింపై ఇండియా దురాక్రమణ.

పి యస్. కుమార్

ఒకసంవత్సర కాలంలో ఒకప్లానుగా భారత పాలకవర్గం సిక్కింను, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం ప్రోద్బలంతో పూర్తిగా కబళించడం పూర్తి చేసింది. భారత ప్రధాని ఇందిరమ్మ అన్నట్లుగానీ, ఇందిరమ్మ తొత్తు దోర్జీ అన్నట్లుగాగానీ సిక్కిం ప్రజలందరూ సిక్కిం భారత దేశంలో రాష్ట్రంగా ఉండడానికి ఇష్టపడుతున్నారా? నెహ్రూ కాలంలో చోగ్యాల్, దోర్జీలిద్దరూ కూడా ఒకేముఠాకు చెందినవారు. ఈ పాలక వర్గముఠాకు వ్యతిరేకంగా అప్పుడు బ్రహ్మాండమయిన ప్రజాప్రదర్శనలు జరిగినవి. ఆప్రదర్శనల నణచడానికి 1958లోను, 1963లోను, నెహ్రూ, చోగ్యాల్, దోర్జీల అభ్యర్థనపై సిక్కింపైకి సైన్యాలను నడిపించాడు. ఆనాడు భారత సైన్యాలు చేసిన ఘోరకృత్యాలను ఇంత త్వరలో ప్రజలు మరచిపోరు. ఆర్థికంగాను, రాజకీయంగాను ఇండియాచే దోపిడీ చేయబడుతూ తీవ్రమయిన పీడనకు గురిచేయబడుతున్న ప్రజలు తమపై ఇండియా జులుంనెన్నడూ సహించరు. వారికి దగ్గరలో బంగ్లాదేశ్‌లో ఇండియా నిర్వహించినపాత్ర వారికి బాగాతెలుసు. 98శాతం ప్రజలు ఇండియాలో కలవడానికి అనుకూలంగా ఓటుచేశారని ద్రోహి దోర్జీ అనటం పచ్చి అబద్ధం తప్పితే ఇంకేమికాదు. అంత ప్రజాబలం తనకుందని దోర్జీ అనుకుంటే సిక్కింలో జనవాక్య సేకరణ ఒక తటస్థ సంస్థ పర్యవేక్షణలో జరిపించేంత ధైర్యం ఎందుకు లేక పోయింది? అలాచేస్తే, జనవాక్య సేకరణ బండారం బయట పడుతుందనేగా? ఇందిరా సైన్యం 'పర్యవేక్షణ' కిందే జనవాక్య సేకరణ జరిగిందన్నది దాచాలనుకున్నా దాగని విషయం.

సోషల్ సామ్రాజ్యవాదంతో భారత పాలకవర్గం మిలిటరీ ఒప్పందాన్ని ఏర్ప రచుకున్న తర్వాతనే ఈ పరిణామాలన్నీ త్వరితమయినవి. సోషల్ సామ్రాజ్యవాదం పూర్తి ప్రోద్బలంతోనే, జనచైనాను చుట్టుముట్టాలన్న సోవియట్ సోషల్ సామ్రాజ్య వాదుల కుట్రలోని అంతర్భాగంగానే సిక్కింపై భారత పాలకవర్గం ఈ దురాక్రమణ చేసింది. పెత్తందారీతనం, సామ్రాజ్య విస్తరణకు వ్యతిరేకంగా, సిక్కిం దక్షిణాసి యాలోని ఇతర ప్రాంతాల ప్రజలు సాగిస్తున్న పోరాటాన్ని సమర్థిస్తూ ఉండగలమని జనచైనా ఉపప్రధాని ప్రకటించాడు. సిక్కింలో భారత దేశం జోక్యాన్ని తీవ్రంగా

ఖండించాడు. ఈ ప్రకటన ఇందిరా, బ్రెజ్నేవ్ తోడుదొంగలకు తేలుకుట్టినట్టని పించింది. అది భారత దేశం ఆంతరంగిక వ్యవహారం అని ఎవరూ జోక్యం చేసుకో రాదని ప్రపంచ ప్రజలను మోసగించజూస్తున్నది. బంగ్లాదేశ్ విషయంలో భారత దేశం, సోషల్ సామ్రాజ్యవాదులు ఎలా జోక్యంచేసుకున్నదీ ఇంకా ప్రపంచం మరిచిపోలేదు. జనచైనా 'బంగ్లా దేశ్ సమస్యను పాకిస్తాన్ ఆంతరంగిక సమస్యగా బంగ్లాదేశ్ ప్రజలే పరిష్కరించుకోవాల' న్నప్పుడు సోషల్‌సామ్రాజ్యవాదం, దాసితొత్తు భారత బడాబూర్జువా వర్గం జనచైనా స్టేట్‌మెంట్ ఎందుకు వక్రీకరించారు? బంగ్లాదేశ్ సమస్య పాకిస్తాన్ ఆంతరంగిక వ్యవహారం కానప్పుడు సిక్కిం సమస్య భారత దేశం ఆంతరంగిక వ్యవ హారం ఎలా అవుతుంది? సమస్యలకు మసిపూసి మారేడుకాయచేస్తే అర్థంకావను కోడం మూర్ఖుల లక్షణం. సామ్రాజ్యవాదుల లక్షణం. ఈనాడు వియత్నాం కాంబో డియా విప్లవ ప్రజలు అమెరికా సామ్రాజ్యవాదానికి ఛావుదెబ్బలు తినిపించి మరణ శయ్యపైకి చేర్చారు. సామ్రాజ్యవాదులకు, ప్రజాపీడకులకు మిగిలిఉన్న మార్గమదొ క్కటే. సిక్కిం ప్రజల కోపాగ్నికి గురిఅవుతున్న భారత విస్తరణవాదులకు వారి 'బాస్'లు సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులకు కూడా సిక్కిం, బంగ్లాదేశ్ విప్లవ ప్రజలు త్వరలోనే గోరీలు కడతారు.

ప్రపంచ తెలుగు మహాసభలు
ఒక సామాన్యుని సందేహాలు - సమీక్ష

గరీబ్

ప్రపంచ తెలుగు సభలు నిజంగానే 'చరిత్రాత్మకంగా' జరిగాయి. 'మరో ప్రపంచం' మహాకవిని, తెలుగు'వాడి'కలాన్ని ప్రజాసంస్కృతికి ప్రతినిధి అయిన శ్రీశ్రీని బంధించి, భూస్వాముల ముద్దుబిడ్డ, భూస్వామ్య సంస్కృతికి ప్రాతినిధ్యం వహించే మూడురంగుల జండాను ఎగురవేయడంతో సభలు ప్రారంభం కావడం చాలా అర్థవం తంగావున్నది. శ్రీశ్రీగారు కోరుకున్నట్లుగానే అందరికన్నముందు, ఆ మాటకొస్తే జాతీయ పతాకకన్నముందు శ్రీశ్రీ మెడపై చేయివేసి నినాదాలివ్వబోయిన నోరుమూసి పోలీసులు వ్యాన్‌లోకినెట్టి సన్మానించారు. 36 గంటలు పోలీసు లాకప్‌లోవుంచి సన్మా నించారు, (ఈ వ్యవస్థలో విప్లవ రచయితలకు, ప్రజాపక్షం వహించే విద్యార్థులకు, జరుగవలసిన సన్మానము జరిగిన తరువాతనే ప్రభుత్వ మేధావులకు, కళాకారులకు, వగైరాలకు సన్మానాలు జరిగాయి). ఇంత ఘనకార్యంచేసిన వెంగళరావుగారికి, స్వయం గా దేశంలోకల్లా ప్రథమ పౌరుడు పూలదండవేసి సన్మానించడంతో యీ సన్మాన సంత ముగిసింది.

Poets are unacknowledged legislators of the world, అన్న మాటను మంత్రులు, లెజిస్లేటర్లు మాత్రమేకాదు, కవులుకూడా acknowledge చేసినట్లులేదు. మహాకవి శ్రీశ్రీ, ఇతర విప్లవ కవుల అరెస్టులకు నిరసనగా ఒక్క పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు మాత్రం బాహాటంగా ప్రభుత్వంవారి సన్మానాన్ని తిరస్కరిస్తూ పత్రికా ప్రకటన చేశారు. దోపిడీ సంస్కృతి పరిరక్షకులు అయిన ప్రభుత్వంవారుచేసే సన్మానానికి అనేకమంది రచయితలు, కళాకారులు అర్రులుచాచుకుని పరోక్షంగా అర్జీలు పెట్టుకొనిఉన్న తరుణంలో సర్కారీ సన్మానాన్ని తిరస్కరించి, రచయితగా తన బాధ్యతను వ్యక్తపరచిన పురాణంవారు ఎంతో అభినందనీయులు.

మహాకవి శ్రీశ్రీ, మరి ఇతర విప్లవ రచయితల అరెస్టును ఖండించమని కొందరు యువకులు అడిగినపుడు 'తనవాళ్ళని' సంప్రదించి చెప్తానన్నాడు ఆరుద్ర. సరే! ఆ తరువాత ఆరుద్రతోపాటు మరికొందరు రచయితలు యీ అరెస్టులను ఖండించినట్టు పత్రికల్లోచూశాం. ఇక సన్మానింపబడబోయేవారి రెండోలిస్టులో పేరు చేర్పించుకున్న కుందుర్తిగారు ఖండిస్తే సన్మానము ఎక్కడ తప్పిపోతుందోనని భయపడ్డట్లున్నారు. సి నా.రె.గారి సంగతి చెప్పనక్కరలేదు. దాశరథిగారు సభలను బహిష్కరించినవాళ్ళను శాపనార్థాలేపెట్టాడు. 'ప్రజాకోటి'యే బలంగావున్న, మన ప్రియతమ ముఖ్యమంత్రి జలగం చేస్తున్న పెండ్లి ఇది. ఆయన యింట్లో పెండ్లికాదని, అందరి పెండ్లి అని, అంటే దీనికి పిలువని పేరంటమైనా పోయి తీరాల్సిందే అనీ "అందరివీ మహాసభలు, అందరిదీ పండుగ, ఇవి వద్దనుకునేవారి బతుకే దండుగ" అని తేల్చిపారవేసి, ఆయన బతుకు చరితార్థంచేసుకున్నాడు తిమిరకవి.

ఒక్క ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మినహాయించి మిగతా పత్రికలకు శ్రీశ్రీ అరెస్టు కనీసం సంచలనాత్మక వార్తవలెకూడా కనిపించినట్లులేదు. ఏ అదృశ్య శక్తులు వాళ్ళను శాసించాయోమరి! సభాప్రారంభంరోజు ఊరేగింపుగురించి కొన్ని పత్రికల్లో యిటువంటి ఊరేగింపు యింకొకటి జరిగుంటే బాగుండుననిరాశాయి. ఈసభల ఫ్యూడల్ స్వభావానికి నిదర్శనంగావున్నది యీ ఊరేగింపు. ఊరేగింపు ముందు ఒక ఏనుగ నడిచింది. దాని వెనుక మోటారు సైకిళ్ళపై పైలట్లు, దాని వెనుక ముఖ్యమంత్రి తదితరులు విమానంపైనుంచి పువ్వులు చల్లిందికనుక అది పుష్పకవిమానమట. పువ్వులు చల్లడం, ఇందులోదాగివున్న ఉద్దేశ్యమూ, కోరికా ఏమిటంటే. వెంగళరావుగారనే "భువనవిజయా"ధీశుడు (తెలుగు సాహిత్య కళాసంస్కృతుల పోషణలో కృష్ణరాయలంతటివాడు) పట్టపుటేనుగుపై (ఏనుగుమీద ఊరేగడానికి భయం, అదిపడేస్తుందో లేక ఎవడయినా నక్సలైటు పైన ఎక్కడో పొంచివుండి నెత్తిమీద నాటుబాంబు వేస్తాడేమోనని బెదురు) "భువనవిజయం" సభ తీర్చడానికి ఊరేగుతుంటే ఆనాడు విజ

యనగర సౌధాలనుంచి పరిచారికలు, పరివారకులు, జనులు, వందిమాగధులు వగైరాలు పూలజల్లులు జల్లినట్టుగా (లేదా దేవతలే ఆకాశంనుంచి పూలజల్లు కురిపించినట్లుగా) పువ్వులు జల్లారన్నమాట. మరి యీ విషయంలో ప్రభుత్వ ప్రచారశాఖ నాయకురాలు తాను మొదటిస్థానం పొందాలని పోటీపడటంలో, తానుకూడా పూలు చల్లినందుకు ఒక పత్రికా వందిమాగధ విలేఖరి జన్మ చరితార్థమైందని భావించినందుకు ఆశ్చర్యపడాల్సిందే ముంది.

ఈ ఊరేగింపుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని బెదిరించి, తాగించి డబ్బుగుమ్మరించి కొందరు జనాన్ని రాబట్టుకున్నారు. తెలుగుసభలమీద ఒక అవగాహనతో, ఇష్టతోగాక, ఏదో పెద్ద సంత, వినోదం జరుగుతోంది. చూద్దాం అని వచ్చిన జనుల సంఖ్యే ఇందులో ఎక్కువగావుంది ఈ ఊరేగింపులో ముఖ్యమంత్రి తొత్తులు కొందరు 'వెంగళరావుకీ' అన్నపుడు ప్రజల్లోంచి ఏ ఒక్కరూ జై కొట్టలేదు. దీన్నిబట్టి యిది ప్రజల ఊరేగింపుకాదు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఊరేగింపు అని తెలియడంలేదా ? ఇక సామాన్య జనులను ఔత్సాహికులయిన యువకులు కొందరు, మహాసభలగురించి వారి అభిప్రాయమడిగినప్పుడు 'ఇవేమయిన తిండిపెట్టేవా ? బ్రతుకు తెరువు చూపేవా ? ఇవి ఏదో సర్కారోల్లు, ఉన్నోల్లు చేసుకునే పండుగలేకదా ?'అని సభలకూ సామాన్యునికీగల సంబంధాన్ని సరిగానే చెప్పారు.

ఇక సభలు జరిగినతీరు తెలుగు భాషగురించి అధికారభాషగా బోధలభాషగా తెలుగు అభివృద్ధిగురించి ఎంతోఆ వేదనను ప్రదర్శించిన యీ సభల్లో గురజాడ అప్పారావుకుగాని, గిడుగు రామమూర్తి పంతులుకుగాని చోటు లేదు గుడిపాటి వెంకటచలం. శ్రీశ్రీలపేర్లు ఒరిస్సా గవర్నర్ అక్బర్ అలీఖాన్‌నోట వినిపించాయిగాని, వాళ్ళ చిత్రాలు మాత్రమూ ఎక్కడా కన్పించలేదు. తాపీ ధర్మారావునుకూడా తాపీగా మరిచిపోయారు సభానిర్వాహకులు. త్రిపురనేని రామస్వామి చౌదరి, గోపీచంద్‌లవిషయమూ అంతే.

మంత్రులు సినిమా తారలు ఆక్రమించుకున్నారు. మహాసభా కార్యక్రమాలను మొత్తంగా 'మాతెలుగు తల్లికి మల్లెపూలదండ' పాట రాసింది కూడ మాజీమిస్ ఇండియా అనుకున్నట్లున్నారు సభానిర్వాహకులు మనసున మల్లెల మాలతీగనీ' చాల పరిమళ భరితమైన పాట నిజమేగాని, సభా ప్రారంభంలో అది పాడడానికి సందర్భం ఏమిటి? సభా కార్యక్రమాలతో బోర్ కొట్టి పోతారేమోనని భయం కలిగినపుడల్లా సినిమా తారలు కనిపించో, వినిపించో ఆదుకున్నారు సభా నిర్వాహకుల్ని.

భాషమీద జరిగిన చర్చలో భద్రిరాజు కృష్ణమూర్తి, మహాదేవశాస్త్రి, మినహా ఆధునిక మయిన, శాస్త్రీయమయిన విషయాలు ప్రతిపాదించినవారు తక్కువ ఒక

మహానుభావుడు ఇంకా 'తల్లి సంస్కృతంబు ఎల్ల భాషలకును' కావున తెలుగు ద్రావిడ భాషనుంచి పుట్టిందికాదని తెలుగు సభల్లో అనగలుగుతున్నాడంటే యివి చాదస్తం పభలు కాకపోతే వీటినేమనాలి? ఏసభలో మాట్లాడినా విషయ వివేచన లేకుండా చమత్కారమే సి.నా.రె. గారికి శ్రీరామరక్ష! అయితే నారాయణరెడ్డిగారు ఒకసందర్భంలో మాత్రం ఒక్క విషయము సరిగ్గా చెప్పాడు. ఈనాడు తెలుగులోనే కాకుండ ప్రపంచమంతటా గేయం. వచనకవితలదే ప్రధాన ధోరణిగా వున్నా. పాటలు, జానపద కళారూపాలు మాత్రమే ప్రజల్లోకి పోతాయని. ఆవిషయాన్ని విప్లవకవులు కూడ గ్రహించి యీనాటి సాంఘిక, ఆర్థిక రాజకీయ సమస్యలను ఆ జానపద కళరూపాల్లో వ్యక్తం చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పాడు. నన్నయ్యగారు కొత్తగా చెప్పిందేమీ లేదనీ వైదిక మత ప్రచారము కోసమే, భారతానువాదము చేసారని ఆమాటకొస్తే ఏకవి అయిన చేయవలసింది అదేనని, రామాయణ. భారతాల్లో లేని విషయం ఎవరైనా ఏం చెప్పారని ప్రాచీన సాహిత్యాన్ని మాత్రమేకాదు, ఫ్యూడల్ సాహిత్యాన్ని దాని ప్రయోజనాన్ని కూడ రామకోటి శాస్త్రిగారు దాచుకోకుండా చెప్పేసారు.

జానపద కళారూపాలపై శ్రద్ధచూపాలని రామరాజు, నాయని కృష్ణకుమారి, యశోదా రెడ్డిగారలు యితరులూ ఆరాటపడుతున్నారు. ఈకళారూపాలను ప్రజాపరంగా విప్లవకవులు వాడుకుంటున్నారని, అలాకాకుండా "ఊర్మిళ నిద్ర" వంటి కథలతో ప్రజలను నిద్రపుచ్చటానికి వాడుకోవాలన్న తహతహయే ఈఅందరి కనువిప్పుకు మూలం.

సంగీతము, నాట్యము, శిల్పము, చిత్రకళవంటి విషయాలపై జరిగిన చర్చలు ఈ కాలానికిగాని, ఈ తరానికిగాని, బొత్తిగా సంబంధములేనివి. అసలు ఈనాటి ప్రపంచపోకడ వీటి సోదిలోకి రాలేదు కర్నాటక సంగీతము, కూచిపూడి నాట్యము, బోరుకొట్టిన జనులు, సినిమా తారలకోసం వెతుక్కున్నారు.

సినిమా తారలు చాలమందే వచ్చారు. సినిమాల గురించి చాలా మాట్లాడారు. కాని మంచి సినిమాలకేమైన న్యాయం జరిగిందా అంటే అదీ శూన్యమే. ప్రదర్శనల్లో మాలపిల్ల, రైతుబిడ్డ, రోజులుమారాయి, పల్లెటూరు, భూమికోసం వంటి సినిమాలుగాని ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక సినిమాల గురించి చర్చగాని లేదు. 'సంస్కార' వంటి సినిమా తీసిన పట్టాభి (పిడిల్ రాగాల డజన్ ఫేమ్) గాని, "అంకుర్" వంటి సినిమా తీసిన శ్యాంబెనగల్ (ఇతనిది హైద్రాబాద్) కాని సన్మానించదగిన వారుగా వీరికి కన్పించలేదు.

'తెలుగు మహిళ' గురించి జరిగిన చర్చలో న్యాయంగా తెలుగు మహిళ గురించి తీవ్రంగా రాస్తున్న యాంగ్రీయంగ్ ఉమెన్ ముప్పాళ రంగనాయకమ్మను పిలిచివుండా

ల్సింది. ఆమెను పిలువకపోవడమే కాదు, ఆమె తెలుగు మహిళకోసం చేసిన పోరాటాన్ని కూడ ఎవరూ గుర్తించినట్లులేదు. (డాక్టరు అచ్చమాంబను కూడ మరచిపోయారు) మరి వరకట్నాలకు వ్యతిరేకంగా, అసభ్యసాహిత్యానికి, సెక్స్ సినిమాలకు వ్యతిరేకంగా అభ్యుదయ మహిళాసంస్థ (Pow) చేపట్టిన ఉద్యమాలకు శాసనసభలో ప్రశంసించిన ముఖ్యమంత్రిగారు, ఆర్థిక మంత్రిగారు ఆసంస్థ ప్రతినిధులెవ్వరినీ పిలిచినట్లయినా లేదు. అయిదుగురు స్త్రీలను అరెస్టుచేసి తెలుగు మహిళా స్థానాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో పురుషునికి సమానంగా నిలిపాడు మనముఖ్యమంత్రి!

విద్యావిధానంపై జరిగిన చర్చకు మంత్రిగారిని త్రోసేసి అఖిలభారత విద్యార్థి సమాఖ్య (రివిజనిస్టుల విద్యార్థి సంస్థ) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు అధ్యక్షపీఠాన్ని ఆక్రమించాడు ఇది బొత్తిగా రాజకీయాలు, దేశపరిస్థితులు తెలియనివారికి ఆశ్చర్యంగా, సంచలనాత్మకంగా కనిపించవచ్చుకాని, నిజానికి (సిపిఐ) వాళ్ళిప్పటికే అర్థసింహాసనం మీద కూర్చొనేవున్నారని చైతన్యవంతులయిన వారందరికీ తెలుసు. (ఆఖరురోజున వేములపల్లి శ్రీకృష్ణగారి అధ్యక్షతన విశ్వనాథ సత్యనారాయణగారికి సన్మానంజరిగింది)

నిజంగా కొంత సంచలనాన్ని కలిగించిన తీర్మానం ఆంధ్రప్రదేశ్‌ను 'తెలుగునాడు'గా మార్చాలని, హైదరాబాద్‌ను 'భాగ్యనగర్'గా మార్చాలని సినిమా హీరోలు ప్రతిపాదించినది ఒక ప్రతినిధి అభిప్రాయపడినట్లు సాంఘిక, ఆర్థిక స్థితిగతుల్లో (రాజకీయ అనేమాట వాడడానికి ఆయన భయపడ్డట్లున్నాడు) మార్పురాకుండా పేర్లు మారిస్తే ఏంవస్తుంది. మళ్ళా యిదికూడా జాతీయ భావాలను ఫ్యూడల్ ప్రయోజనాలకు వాడుకోవడంగానే మిగిలిపోతుంది. హైదరాబాద్ నైజాం సంస్కృతికి, లక్నవీ సంస్కృతికీ అలవాటుపడ్డ గోపాల్‌రెడ్డిగారికి యీమాత్రం మార్పుకూడ సహించరానిదయింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, కింగ్‌జార్జ్ హాస్పిటల్ వంటి రాజరిక చిహ్నాలను వదులుకోలేని మనం హైదరాబాద్ పేరు మార్చటానికి అంతసులభంగా అంగీకరిస్తామా? కొత్తగా వచ్చిన హిందీ అధికారానికి లొంగిపోయిన మనం తమిళనాడువలె, కర్నాటకవలె 'తెలుగునాడు' అని పిలుచుకోగల సాహసం చేయగలమా? బహుశా మద్రాసులో తమిళుల జాతీయ భావాలతో ప్రభావితులయిన సినిమా హీరోలకు యీభావం ఆఉత్తేజంతోనే వచ్చివుంటుంది ఒకవిధంగా గాలి కొంచెం వేడెక్కి సాహిత్య అకాడమీ పీఠాధిపతులైన గోపాలరెడ్డి, రామానుజరావు డౌన్‌డౌన్ నినాదాలతో ఝూమ్మని సభాస్థలంలో వీచింది. అధికారవర్గం చమ్చాగామారిన అధికారభాషా కమీషన్ చైర్మన్ వావిలాల గోపాలకృష్ణయ్యగారు కూడ డౌన్‌డౌన్ సన్మానాన్ని పొందారు.

సన్మానాల విషయంతో ప్రారంభమైన యీ సమీక్ష సన్మానాల ప్రస్తావనతోనే ముగించడం సబబుగా వుంటుంది. మొదట ప్రకటించిన సన్మానితుల జాబితాకు, జరిగిన సన్మానాలకు చాలావరకు పొంతనలేదు. సన్మానాలు జరిగిన వారిలో చాలమంది పేర్లు

మొదట ప్రకటించిన జాబితాల్లో లేవు. (అప్పటికప్పుడు వాళ్ళు బతిలాడితేనో, బెదిరిస్తేనో, సిఫారసులతోనో, పైరవీలతోనో, ఎవరయినా గుర్తు చేస్తేనో, జ్ఞాపకం వస్తేనో చేర్చివవి.) ఇక కొందరి పేర్లు ప్రకటించారు గాని సన్మానాలు జరిగినట్లు లేదు. అలాంటి వారిలో సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావుగారలు ముఖ్యులు. శ్రీ కృష్ణ, రావి నారాయణరెడ్డి స్వీకరించారు కాబట్టి రాజేశ్వరరావుగారు నిరాకరించడానికి ఆస్కారం లేదు. సుందరయ్యగారుకాని; మార్క్సిస్టుపార్టీగాని యీ మహాసభల విషయంలో పూర్తిగా మౌనం వహించారు. మౌనం అర్ధ అంగీకారమో, అనంగీకారమో మరి తెలియదు.

విశ్వనాధ, శ్రీశ్రీలమధ్య వివాదాన్ని పురస్కరించుకొని యీ సభలను వాయిదా వేయాలని సూచించిన ఎన్. జి. రంగా తొందరగా మేల్కొని బుద్ధిగా సభల్లో పాల్గొని సన్మానంకూడ చేయించుకున్నాడు. పార్టీరహిత ప్రజాస్వామ్య సిద్ధాంతకర్త, నాస్తిక శిఖామణి గోరాగారు సతీసమేతంగా కాంగ్రెసుపార్టీ నియంతృత్వంక్రింద వేదమంత్రాలతో ప్రారంభమైనసభల్లో సన్మానాన్ని పొందారు. మంత్రిగారిచేత సన్మానాన్ని స్వీకరించనవి మంత్రులు పాల్గొన్న సభల్లో పాల్గొననని '69 లోనే నిర్ణయం తీసుకున్న కాళోజిగారు బహుశా కాబట్టి, ఫ్రీకేస్ మెమొంటోలు యింటికి పంపిస్తే స్వీకరించవచ్చు (అది ప్రపంచ తెలుగు ప్రజలు చేసే సన్మానంకదా! దానిపట్ల ఆయనకెంతో గౌరవముంది.) ఆయన 'స్వాతంత్ర్యయోధుల' తామ్రపత్రిమూ, నెలకు రెండువందల పింఛనుకూడ కలెక్టర్ద్వారా ప్రభుత్వం యిస్తే స్వీకరిస్తున్నాడు కాని మంత్రులు యిస్తే ససేమిరా తీసుకొనేవాడుకాడు. మంత్రులను మినహాయిస్తే, ఈ సర్కారీ తెలుగు మహాసభల్లో నిజమయిన తెలుగు ప్రజల (కార్మిక-కర్షక) సంస్కృతి, భాష ఉందనే ప్రజాకవి కాళోజీ భావిస్తున్నట్టేకదా? ప్రజాకవిచూపే యీ సూక్ష్మమైనతేడా ప్రజలు గ్రహించగలరా!

భావసమైక్యతా ప్రయోజనం ప్రకటించుకున్న ఈసభలు దోపిడీవర్గాల సమైక్యతకు మాత్రమే ఉద్దేశించినవని విరసం వాళ్ళు అంటున్న మాటల్లో అబద్ధమేమైనా వుందా? దోపిడీవ్యవస్థ నిలబడడానికి, బూజుపట్టిన ఫ్యూడల్ సంస్కృతిని పునరుద్ధరించి పోషించడం అవసరమని ప్రజలు విప్లవోన్ముఖంగా ఆలోచిస్తున్న ఈతరుణంలో, ఈ పునరుద్ధరణ అనివార్యమని గ్రహించిన ప్రభుత్వం ఏర్పరచిన 'దోపిడీ సంస్కృతీ పునరుద్ధరణ సభ'లివి. కరువు, అధిక ధరలు, నీటి ఎద్దడి, అవినీతి, లంచగొండితనము, ఆశ్రిత పక్షపాతం వంటి దైనందిన సమస్యలతో అలమటిస్తున్న ప్రజలను తక్షణ సమస్యలనుంచి, దీర్ఘకాలిక లక్ష్యాలనుంచి, పోరాటంనుంచి తప్పదారి పట్టించడానికే యీసభలు ఉద్దేశించబడినాయని అసెంబ్లీ అనే 'బాతఖానీ క్లబ్బు' ముగిసాక యీ ప్రపంచ సభలనే పెద్ద 'బాతఖాని క్లబ్బును' మరింత మంది వాగుడుకాయల కోసం ఏర్పాటు చేసారని అనుకొంటున్న వారిమాటల్లో యదార్థం ఎంతోవుంది.

సృజన మధ్యతరగతి వారికి మాత్రమే కాకుండా కార్మికులకు పేదరైతుల వద్దకు పోవాలంటే వారి భాషలోనే రాయాలి. మనరచనలు వారికర్థమవుతున్నాయా లేదా అని తెలుసుకోటానికి వారి దగ్గరకు వెళ్ళి వాటిని చదివి వినిపించటమే మార్గం. ప్రజల కర్థమయ్యే భాషలో రాయాలని ప్రతిసారీ అనుకుంటూనే ఆచరణలో విఫలమవుతున్నాం. ప్రజాభాషలో రాయాలంటే వారి జీవితాల్ని అర్థం చేసుకొని వారితో కలిసిపోయినపుడే అది సాధ్యమవుతుంది. వారి భాషను పట్టుకొనగలుగుతాం. వీటన్నిటికన్న ముఖ్యంగా కార్మికవర్గం నుండి. నిరుపేద రైతాంగం నుంచి రచయితలు వచ్చినపుడు యీభాషా సమస్య చాలావరకు పరిష్కారమవుతుంది. సృజనలో వచ్చే రచనలు కొన్ని తరచుగా ఒకేరకంగా వుంటూ మధ్యతరగతి వరకే పరిమిత మవుతున్నాయి. ప్రజల భాషలో రాసిన పేరుబడ్డ రచయితలే ఒక్కొక్కప్పుడు విలువైన భావాలను సూటిగా కాకుండా Indirectగా రాయటం చాలా విచారకరం. ఉదాహరణకు సృజనలో వచ్చిన కొన్ని రచనలనిక్కడ పేర్కొంటాను. రెంజిమ్ రాసిన "నరుడో భాస్కరుడా", "చెల్లీ చెంద్రమ్మ" చాలా సూటిగావున్నవి. శివసాగర్ రాసిన ఒక కవితలో "మదంపట్టి కదం తొక్కు సైబీరియ తెల్లయేనుగు ఉష్ణారి జలాలలో మునకలు వేసెను" అనే వాక్యాలు అంతసూటిగా లేవు, క్రింది వర్గాలవారికి ఇలాంటివి ఎంతవరకు అర్థమవు తాయో ఆలోచించాల్సిన విషయం 'కీచక వధ' అనేరచనలో "రెప్పల్లో రేగుపండు ఏమిటన్నది? / పీడదొబ్బి పిండుచువరకు పలకనన్నది". అనే వాక్యాలు కూడా సామాన్యులు చప్పున గ్రహించటం కష్టంగావుంది. ఈనాడు 'వి.బి. గద్దర్ పాటలు' 'ఏరువాక పాటలు' ప్రజల్లోకి పోవటానికి అవి ప్రజల భాషలో రాయబడటం కారణం కాదా! అలానే నవంబర్ సృజనలో యాత్రిక్ గేయం 'ఆహ్వానం'లో "మ్లానవతా అశ్రువుల్లో ఆర్ద్రిమైన గుండెమీద / పదును పెట్టిన కసి అంచుమీద నెత్తుటి గంటు." "బాధను సైతం/అనుభవైక వేద్యమైన ఆనందంగా మారుస్తుంది" అనే వాక్యాలు చాలా కష్టంగా అర్థమవుతాయి. అలాగే సెప్టెంబరు '74 సంచికలో గన్ మెన్ రాసిన 'మహోదయం' ఆగస్టు '74 సృజనలో రారాసి గారి "బాధ్యత" మొదలైనవి ఒకే మూసలో పోసిన (Stereotyped) రచనలుగా కనపడుతున్నాయి. ఒక వైపు యిటు వంటి రచనలు అందించిన సృజనే "వొద్దెరోళ్ళమండి మేమూ", "గొల్లకుర్మ గోత్రం" "ఓపల్లెటూరి పేదరైతా" "ఏటికి ఎదురీదువాళ్ళమురా" "పిల్లలార తల్లివంటి విప్లవాన్ని పాడండి", మొదలైన చక్కని గేయాలను కూడా అందించింది. వచన కవితలు ఉత్తేజపరుస్తాయి కాని పాటలవలె మళ్ళీమళ్ళీ పాడుకోడానికి వీలుకావు. ప్రజలను చైతన్యవంతులను చేయటమే మన రచనల బాధ్యత. కనుక ప్రజల్లోకి చొచ్చుకొని పోయే వివిధ కవితారూపాల్లో రచనలు చేయాలి. విరసం రచయితలు 5 వం॥

కాలంలో చేయలేని విప్లవ రాజకీయ ప్రచారం జననాట్యమండలి 2 సం॥లలోనే చేసిందనే వాస్తవం అందరూ గుర్తించాలి. ప్రతిచోట సాంస్కృతికదళాలు ఏర్పడాల్సిన అవసరం వుంది, సృజనలోని పాటలు కవితలు ప్రధానంగా సాంస్కృతిక కార్యక్రమాలు అభివృద్ధికి, ప్రజలు ప్రభావితులై పాడుకొనడానికి ఉపయోగపడాలి. సృజనలో ఎన్నుకొన్న రచనలు వాటిలోవున్న భావాన్నిబట్టే కాక, ఆ రచన సామాన్యజనంలోకి ఎంతవరకు వెళ్ళుతుందనే దృష్టితోకూడ ఎన్నికచేయాలి. వచన కవితలే కాకుండా పాడుకొనడానికి అనుగుణమైన గేయరూపాలకు ప్రాముఖ్యతయిచ్చి ప్రజల్లోకి చొచ్చుకొనిపోయేవిధంగా కవులు తమ రచనలు సాగించాలి, సృజనలో ఏ రకం గేయాలు అచ్చవుతుంటే సాధారణంగా అటువంటి రచనలు చేయటానికే రచయితలు ముఖ్యంగా కొత్త రచయితలు ప్రయత్నిస్తారు. కనుక సృజన సంపాదకులు కూడా ఎన్నికవిషయంలో పై విషయాన్ని గుర్తించాలి. దానివల్ల రచయితలకు ప్రజల్లోకి వెళ్ళి వివిధ కళారూపాలను పట్టుకొనవలసిన అవసరంవస్తుంది, సృజనలో రచనలు ఎన్నిక చేసేవారుకూడా ప్రజల భాషను స్వంతం చేసుకోటానికి ప్రజల మధ్య జీవించినపుడే వారికి ప్రజల భాషపై సరియైన అవగాహన వుంటుంది. సరియైన రచనలను ఎన్నిక చేయగలుగుతారు. అలాగే ఇక కొన్ని వ్యాసాల విషయం తీసుకుంటే ఉదాహరణకు అగస్టు '74 సంచికలోని టి.కె మహదేవన్‌గారి 'స్వదేశీబాంబు' రచన ఎంతమందికి అర్థమయిందంటారు? మధ్యతరగతి పాఠకులకే దానిలోని వ్యంగ్యం అర్థంకాలేదు- అలాగే కె.వి. రమణారెడ్డిగారి ఎన్నో గేయాలు ప్రజలకు అర్థంకానిభాషలోనో లేక చెప్పేది డొంక తిరుగుడుగానో వున్నాయి. ఉదా॥ సెప్టెంబర్ '71 సంచికలో 'బందిఖానాలో బాలచంద్రుడు'లో 'సువర్ణ్యంత్వాన్ని' 'లోకాలోకవ శక్తిని భావాందులకైనా', వంటి పదాలు సామాన్యులకు తెలుస్తాయా, అలాగే అనువాద కథలు, అనువాద రచనలు ఎక్కువవుతున్నాయి. అయితే అనువాదాలు అవసరంలేదని కాదు- ఇప్పుడు సృజనలో వస్తున్న అనువాదాలవల్ల వివిధ దేశాల్లో విప్లవ సాహిత్యం ఎలా వుంటుందో మన రచయితలకు, పాఠకులకు పరిచయమౌతుంది- అయితే వెనువెంటనే మన రచయితల, సృజనాత్మక శక్తిని పైకి తీసుకు రావడానికి మూల (original) కథలను రచనలను ప్రోత్సాహించాలి. అనువాదాలలో కూడా సోషలిస్టు సమాజ నిర్మాణానికి సంబంధించిన కథలు కాకుండా, అయా దేశాల పోరాట దశకు సంబంధించిన కథలు, రచనలు వేయాలి అంటే మనదేశ విప్లవానికి ఎంతవరకు ఉపయోగపడతాయి అనే విషయాన్ని అనువాదాలు కాని, మూల (original) రచనలుకాని ఎన్నికచేసేటప్పుడు దృష్టిలోపెట్టుకొనవలసిన అవసరంవుంది.

నా యీ సూచనలను విప్లవ రచయితలందరూ సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తాను

— విప్లవాభినందలతో బాలయ్య

"అసంపూర్తిగా విప్లవాలను వదిలేసేవాళ్ళు
తమ సమాధులు తామే తవ్వుకుంటారు"

(సోర్బాన్ చౌక్‌లో—రెక్కవిప్పిన ఫ్రాన్స్ విద్యార్థులు)

ఏదేశ విమోచనోద్యమమయినా, అది ఆ దేశ ప్రజల అంతరంగిక సమస్య. అదే సమయంలో మొత్తం ప్రపంచ విమోచనోద్యమ కృషిలో ఒక భాగంకూడా. జాతులు విముక్తిని కోరుకుంటున్న యీ విప్లవయుగంలో యిది తిరుగులేని సత్యం.

"పోరాటంద్వారా సమస్యల పరిష్కారం" అనే సరియైనఅవగాహనతో వుద్యమించిన పాలస్తీనా విమోచనసంస్థ P.L.O. యీ మధ్యకాలంలో నాయకత్వవిధానాల్లో వచ్చిన మితవాద, సంస్కరణవాదపైఖరి కారణంగా, 'U.N.O. ద్వారా సమస్యల పరిష్కారం' అనేదశకు దిగజార్చబడింది. P.L.O. నాయకుడు యాసర్ అరాఫత్ ఐ రా స లో లక్ష్యనిర్దేశం చేయటం యీ అనుమానాన్నే బలపరుస్తోంది. పోరాటపైఖరిలో వచ్చిన యీ మార్పే విదేశీవిధానం (వ్యవహారాలు)లో చోటుచేసుకొని ప్రపంచ విప్లవ విద్రోహాలకు కితాబులిచ్చేస్థాయికి P.L.O. ని అరాఫత్ దిగజార్చాడు. లేకపోతే సోషల్ సామ్రాజ్యవాద రష్యా నయాజారులని, ఫాసిస్టు యిందిరని విముక్తి పోరాటాలని బలపరచేవాళ్ళుగా చిత్రించేపని లేదు. ఈ శతాబ్ది చీడపురుగు (హరేరాం బికారి) గాంధీ బోధనల ప్రభావం ఆసియా దేశాల ప్రజల పోరాటాలమీద వుండనాల్సిన అవసరంలేదు.

అందుకే వి.ర సం. దృష్టిలోకాని, విప్లవకారులదృష్టిలోకాని యివ్వాళ మార్క్సిజం-లెనినిజం గైడెన్స్‌లో పయనిస్తున్న P.L.O. వేరు, ఆరాఫత్ clique (ముఠా) వేరు. నైతికంగా, రాజకీయంగా దిగజారుతున్న అరాఫత్ విద్రోహాన్ని బట్టబయలు చేస్తూ, పోరాటపంథాలో ముందుకుసాగే పాలస్తీనా విమోచనాసంస్థ మార్క్సిస్ట్-లెనినిస్టులను బలపరచటం, వి ర.సం తరపున అలాంటి తీర్మానాలుచేయటం మన కనీస అంతర్జాతీయకర్తవ్యం. పోరాడేవాళ్ళందరిదీ ఒకేజాతి, ఒకేవూరు, ఒకేవూపిరి.

ఇవాళ ఐ రా స లో అరాఫత్ వల్లిస్తున్న అందమైన మాటల ముసుగుల్ని తొలిగించి చూడగలిగితేనే మనం ఒక సరియైన అవగాహనకు రాగలుగుతాం.

మార్క్సిజం-లెనినిజం గైడెన్స్‌లో మినహా ఎవరూ జాతులసమస్యని సక్రమంగా పరిష్కరించజాలరు. అందుకు భిన్నంగా ఎవరైనా "ఒక దేశాన్ని అభ్యుదయాత్మక, మతాతీతరాజ్యంగా" మలచదలుచుకొంటే అది దగా, మోసం మినహా మరేమీకాదనేది చారిత్రక సత్యం.

అభివృద్ధినిరోధక, సంస్కరణవాదం నశించాలి.
అమెరికన్-ఇజ్రేలీ సామ్రాజ్యవాదం నశించాలి.
పాలస్తీనా, పాలస్తీనా శ్రామికవర్గాలదే—
పాలస్తీనా సాయుధ పోరాట అమరవీరులకు జోహార్లు.
సాయుధ పోరాట పాలస్తీనా విమోచనాసంస్థ వర్ధిల్లాలి.

విప్లవాభినందనలతో—
—శ్రీకాకుళరావు

వార్తలు:

వెల్దండ ఘటన సందర్భంగా అరెస్ట్ చేసిన వ్యక్తులను వెంటనే కోర్టులో హాజరుపరచాలి.

21-3-75 రోజున జనగామ తాలూకా వెల్దండ గ్రామంలో హనుమరెడ్డి హత్య జరిగిన తర్వాత పోలీసులు ఆ గ్రామ ప్రజలపై తీవ్రమైన దౌర్జన్యకాండను కొనసాగిస్తున్నారు. ఆ సంఘటనతో సంబంధంలేని ప్రజలనెందరినో అక్రమకేసుల్లో యిరికించి హింసిస్తున్నారు. 21 మందిని అరెస్టుచేసి 8 రోజుల తర్వాత 8 మందిని మాత్రం కోర్టులో హాజరు పరిచి వారిని రిమాండులో వుంచారు. మిగతా 13 మందిని అరెస్టు చేసి యిప్పటికి దాదాపు నెల రోజులవుతున్నా ఏ కోర్టులోనూ హాజరు పరచలేదు. పోలీసు క్యాంపులలో వీళ్ళను చిత్రహింసలు పెడుతున్నట్లుగా తెలుస్తున్నది. ఈ 13 మందిని వెంటనే కోర్టులో హాజరుపరచి వెల్దండ గ్రామస్తులపై, చుట్టుపట్ల గ్రామాల ప్రజలపై పోలీసులు చేస్తున్న దౌర్జన్యాలను అరికట్టవలసిందిగా డిమాండు చేస్తున్నాను. పోలీసు కస్టడీలోకి తీసుకున్న వానిని 24 గంటలలోగా కోర్టుముందు హాజరు పరచాలని చట్టంలో వున్నప్పటికీ చట్టాన్ని అతిక్రమిస్తున్న పోలీసులను శిక్షించాలని కూడ డిమాండ్ చేస్తున్నాను.

ప్రధాన కార్యదర్శి,
జిల్లా పౌరహక్కుల సంఘం, వరంగల్.

* * *

ప్రజాపక్షంగా నిలబడి, ప్రభుత్వపు ప్రజాద్రోహచర్యల్ని నిరసిస్తూ ప్రభుత్వ తెలుగు మహాసభల్ని బహిష్కరించాల్సిందిగా ప్రజల్ని ప్రబోధించుతున్న మహాకవి శ్రీశ్రీని, మరి 12 మందిని 12-4-75న అరెస్టుచేసి 14-4-75న విడుదల చేసిన సందర్భంగా ప్రభుత్వ ఫాసిస్టు ధోరణిని ఖండిస్తూ విరసం అనంతపూర్ శాఖవారు కరపత్రాల్ని ప్రజలలో పంచిపెట్టారు. హుజురాబాద్‌లో 16-4-75 నాడు బ్రహ్మాండమయిన బహిరంగ సభ జరిపారు. చేతనసాహితి నిజామాబాద్‌వారు అరెస్టులను తీవ్రంగా ఖండించారు. "అసత్యనారాయణుల్ని అందలాలెక్కించి సుబ్బారావు పాణిగ్రాహిని చంపించి, శ్రీశ్రీ, చెరబండరాజు, ఖాన్, రంగనాధం, కాశీపతి, ఇత్యాది ప్రజాకవుల్ని జైలులో పెట్టించే ఈప్రభుత్వం జులుంజబర్దస్తీల దుష్టప్రభుత్వం అనీ ఇది లాభాల వారి అబద్ధాల ప్రభుత్వం అనీ ఈప్రభుత్వం మరోసారి రుజువు చేసుకుంది" అని అంటూ రావిశాస్త్రి, కాశీపట్నం రామారావు గార్లు అరెస్టులను ఖండించారు.

విప్లవ రచయితల సంఘం సభ్యుడు శ్రీ వరవరరావుకు కండిషనల్ బెయిల్

ఎన్నోమార్లు ఏవో కుంటిసాకులతో బెయిల్ నిరాకరించి చివరకు ఏప్రిల్ 21వ తేదీన, విరసం సభ్యుడు, వరవరరావుగారికి బెయిల్ ఇచ్చారు. అదికూడా హైదరాబాద్ నగరందాటి బయటకు పోకూడదనే షరతు. మరి కేసుపేరే సికింద్రాబాద్ కుట్ర కేసు కదా! అటువంటప్పుడు నగరంలోనే ఉండాలనడం అర్థమేమిటి? కుట్ర ఎలా చేస్తారో ప్రత్యక్షంగా చూద్దామనా; ప్రపంచ తెలుగు సభలు పూర్తిగా అయిపోయినాకనే ఒక ప్రముఖ రచయితకు బెయిల్ ఇవ్వడంలోగల అంతరార్థం ఏమిటో మ.ఘ.వ. ముఖ్యమంత్రిగారే సెలవివ్వాలి మరి !!

* * *

వరంగల్ జిల్లా జనగామ తాలూకాలోని వెలిదండ గ్రామం భూస్వామి వంగ హనుమారెడ్డిని 21-3-1975న కమ్యూనిస్టుపార్టీ (మా-లె) నాయకత్వంక్రింద విప్లవ రైతాంగ గెరిల్లాదళం ఖతంచేశారని పత్రికలవార్త. ఈ హనుమారెడ్డి పెద్దభూస్వామి పీడితప్రజల్ని పీడించి వారిరక్తాన్నిపిండి వేలాది రూపాయల ధనం కూడబెట్టాడు ఆ డబ్బు తిరిగి వడ్డీలరూపంలోనూ తిరిగి పేదలపై పెట్టుబడిపెట్టి దోచుకుంటున్నాడు- "పోదామురో జనసేనలో కలిసి, పోదామురో ప్రజాసేనలో కలిసి" మొదలగు గేయాలతో గ్రామవీధులగుండా సాగిపోతున్న గెరిల్లాదళానికి వందలాదిప్రజలు వీరోచితంగా వీడ్కోలిచ్చారనివార్త.

(16-4-75 'పిలుపు' ఆధారంగా)

* * *

"జనశక్తి" 5-3-75 సంచికలో "నెల్లూరు నుంచి దీపశిఖ, దుందుభి కూడా రాజీనామా చేసినట్లు తెలుస్తూవుంది" అని ప్రచురితమైన వార్త అవాస్తవమైనది.

విప్లవ రచయితల సంఘం సభ్యులు కొంతమంది రాజీనామా చేసినట్లు పేర్లు, ఊర్లతోటి పేర్కొంటూ పై వార్త ప్రచురించబడింది, ఈ అబద్ధపు వార్తను ప్రచురించిన జనశక్తి పత్రిక పూర్తిబాధ్యత వహించ వలసివుంటుంది.

నేనుగాని, దుందుభిగాని, నెల్లూరులో ఏఒక్కరుగాని విరసానికి రాజీనామా చేయలేదు. విరసాన్ని విచ్ఛిన్నం చేయాలనుకొనే సాహిత్య విద్రోహుల చర్య ఇది, అటువంటి వారి ఆశల్ని బ్రద్దలుకొట్టడానికి ప్రయత్నించేవాళ్ళల్లో మేమూ వున్నాం. జనశక్తి అబద్ధపు రాతల్ని ఖండిస్తున్నాం.

నెల్లూరు
26-3-75

—కవీశ్వర్,
విరసం యూనిట్, నెల్లూరు.

కాంబోడియా విప్లవ విజయోత్సవ సందర్భంలో ఏప్రిల్ 18న విశాఖ కోర్టులో కామ్రేడ్స్ నాగభూషణ్‌పట్నాయక్, కె.జి. సత్యమూర్తి మాట్లాడారు.

కామ్రేడ్ పట్నాయక్ ఇలా అన్నారు: "కాంబోడియాలో ఎర్రని విప్లవ సూర్యుడు ఉదయించాడు. భారత దేశంలో కూడా విప్లవ విజయం తప్పదు. ఏ శక్తి ఈ విప్లవ పరిణామాన్ని అడ్డజాలదు. కాంబోడియా విప్లవవీరులకు విప్లవాభినందనాలు."

కామ్రేడ్ సత్యమూర్తి మాట్లాడుతూ: "కాంబోడియాలో విప్లవశక్తుల విజయం మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనావిధానం విజయం. అది ప్రజాయుద్ధప థాకు విజయం. భారత విప్లవ విజయానికి అది సూచన. కాంబోడియాలో రష్యన్ సోషల్ సామ్రాజవాద నగ్నస్వరూపం బహిర్గతమైంది. జనచైనా ప్రపంచ విప్లవ కేంద్రంగా వెలుగొందుతోంది. నాంపెన్‌పై విప్లవ పతాక ఎగురుతోంది. లాల్‌ఖిల్లాపై లాల్ జెండా ఎగిరి తీరుతుంది" అన్నారు.

సాయంత్రం విశాఖ సెంట్రల్‌జెయిల్‌లో కామ్రేడ్ కె రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కామ్రేడ్స్ నాగభూషణపట్నాయక్, సత్యమూర్తి మాట్లాడారు. ఈ సమావేశంలో ఇరవైమంది కామ్రేడ్స్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 22 న. భారత కమ్యూనిస్టుపార్టీ (మా-లె) అవతరణ దినాన్ని జరుపుకున్నారు. ఎర్రజెండా ఎగురవేస్తూ జైలుకామ్రేడ్స్ ఇచ్చిన 'విప్లవం వర్థిల్లాలి' అన్న నినాదంతో జెయిలుగోడలు దద్దరిల్లినవి

• • •

ముఖ్యమంత్రి రాకపై యస్.వి. యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిఘటన

ఏప్రిల్ 19న వెంగళ్రావ్ యస్.వి. యూనివర్సిటీ కాలేజి వార్షికోత్సవంలో పాల్గొనడానిగ్గాను తిరుపతి వచ్చిన సందర్భంలో భూస్వాముల ముద్దుబిడ్డ జలగం పులి స్వభావాన్ని ఖండిస్తూ. రాడికల్ స్టూడెంట్సు. శ్రీశ్రీగారి "దూదిపులి మీద పుట్ర" గేయ కరపత్రాన్ని విద్యార్థుల్లో పంచారు. 'ప్రజాద్రోహి - వెంగళ్రావ్', 'శ్రీశ్రీ ఒక వ్యక్తి కాదు- మహాశక్తి'. 'కుట్రకేసులు-ఎత్తివేయాలి', 'ప్రపంచ తెలుగుసభలు-కుట్ర' మొ॥ నినాదాలు మారుమ్రోగినవి.

• • •

కామ్రేడ్ ఎమ్. క్రిష్ణస్వామి అధ్యక్షుడుగా చిత్తూరు జిల్లా పౌ.హ.సం. కమిటీ ఏర్పడింది. ఆం.ప్ర, పౌ హ.సం అనుబంధ సంస్థగా ఈకమిటీ. భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోడానికి జూన్ 15. 1975న జిల్లాస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తుంది.

శ్రీశ్రీని మరి 12 మందిని ఏప్రిల్ 12న అరెస్టుచేసి 14న విడుదలచేసిన సందర్భంగా త్రిపురనేని మధుసూధనరావు తిరుపతి సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో 17-4-75 న ఒక ప్రకటనచేస్తూ శ్రీశ్రీవంటి మహాకవిని అరెస్టుచేసినా, తోటి రచయితలను కటకటాల్లో తోసినా, ఏమిటీ దారుణం? అని ప్రశ్నించకుండా ప్రభుత్వ సన్మానాలతో కులుకుతున్న కవులను, పండితులను, ప్రముఖులను అసహ్యించుకుంటున్నాను పాలకవర్గాలకు అమ్ముడుపోయిన వ్యక్తిత్వంలేని బంటులుగా వీళ్ళను అర్థంచేసుకుంటున్నాను'అన్నారు. అదే ప్రకటనలో సమరశీల విద్యార్థి, గుండాలకు బలి అయిపోయిన, జార్జిరెడ్డివర్ధంతి జరుపుకొంటున్న పి.డి ఎస్ యు విద్యార్థులమీద, ఆర్.ఎస్.ఎస్, విద్యార్థి పరిషత్తు కార్యకర్తలు చేసిన దమనకాండను తీవ్రంగా నిరసించారు.

*	*	*

ప్రజలను దోచుకు తినమరిగిన వ్యాపారి గడ్డం బాలరాజు, భూస్వామి రాగుల వీరారెడ్డి ఇళ్ళపై రైతాంగ గెరిల్లాలు దాడిచేసి 25వేల ఉద్దెరఖాతా పుస్తకాలను దగ్ధ చేశారనీ, పీడించే పద్ధతిని వీడనిచో తగువిధంగా శిక్షించటం జరుగుతుందని హెచ్చరించారని పత్రికల వార్త.

*	*	*

అమరుడు కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వాన ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) అవతరణ దినం, కామ్రేడ్ లెనిన్ 105 వ పుట్టినరోజు ఏప్రిల్ 22న కొత్తగూడెం-పట్టణంలోని ఒకముఖ్య సెంటరులో లెనిన్, చారుమజుందారు ఫోటోలతో, విప్లవ నినాదాలతో ఒక పెద్దపోస్టరు కనిపించింది.

*	*	*

వరంగల్ సి.కె.యం. కాలేజి విద్యార్థుల సస్పెన్షన్ రద్దుచేయాలి.

చందాకాంతయ్య మెమోరియల్ కాలేజి లెక్చరర్, విప్లవ రచయిత అయిన వరవరరావు నిర్బంధానికి నిరసనగా సి కె ఎం. కాలేజి విద్యార్థులు తమ లెక్చరర్‌ను విడుదలచేయాలంటూ పోస్టర్‌వ్రాసి కాలేజి స్పోర్ట్సు డే నాడు ప్రదర్శించారు. ఒక లెక్చరర్ ఎడ విద్యార్థులు తమకున్న అభిమానాన్ని. బాధ్యతను అలా చాటడం భరించలేని కలెక్టరు పోస్టర్సు చింపేశాడు- అంతేగాక ఆరోజు జరిగే కార్యక్రమాన్ని రద్దుచేశాడు. దాంతో విద్యార్థులు ఆవైఖరికి నిరసనగా పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఏమిచేయాలో తెలియని కాలేజి అధికార్లు తమ చేతకానితనాన్ని ఎనిమిదిమంది విద్యార్థులను సస్పెండు చేయడంద్వారా చాటుకున్నారు. ఈ సస్పెన్షన్‌ను ఖండిస్తూ ఆ విద్యార్థులను వెంటనే తిరిగి కాలేజిలో చేర్చుకోవాల్సిందిగా కాలేజి అధికారులను డిమాండ్ చేస్తున్నాం.

సి.కె.యం. కాలేజి విద్యార్థులు

జనసాంస్కృతిక దళాలమీద భూస్వామ్య గుండాల దురాగతాల్ని ఖండించండి.

23-4-75 రాత్రి కారంచేడు కట్టమీద ప్రకాశం జిల్లా జననాట్య మండలి చీరాల వారూ, రాడికల్ స్టూడెంట్సు యూనియన్ సభ్యులు కొందరు కలసి సాంస్కృతిక కార్యక్రమాలిస్తుండగా భూస్వామి గుండాల తండా వారి వర్గాధికారం భూళ్ళుపడుతున్నట్లు బెంబేలెత్తి, వేదికపై కొచ్చి నానా దుర్భాషలాడి, కొట్టి హింసించారు. ప్రదర్శన ఏర్పాటుచేసిన కొందరుయువకుల ఇళ్ళమీద దాడిచేసి ప్రదర్శనలిచ్చిన వారిని పట్టించమని నిర్బంధిస్తున్నారు. ప్రదర్శనలిచ్చిన వారిపై తప్పుడు కేసులు బనాయించాలని యత్నిస్తున్నట్లుగా కూడా తెలుస్తున్నది. ప్రజాస్వామిక వాదులంతా ప్రజల వాక్స్వాతంత్ర్యాల మీద జరుగుతున్న ఈభూస్వాముల నిరంకుశ పైశాచిక దాడిని ప్రతిఘటించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. జనసాంస్కృతిక పోరాటాలు వర్ధిల్లాలి। భూస్వామ్య సంస్కృతి నశించాలి। విప్లవం వర్ధిల్లాలి.

విప్లవ రచయితల సంఘం,
ప్రకాశం జిల్లా.

*　　*　　*

ప్రొద్దుటూర్‌లో ఒక MLA హత్య జరిగిన దరిమిలా అసలైన నేరస్థులను వదిలి ఆహత్యతో సంబంధంలేని అమాయకులపై పోలీసుల దౌర్జన్యకాండను నెం. 1 టౌన్ పోలీసు స్టేషను S.I. దురాగతాలను ఖండించాల్సిదిగా ప్రజాస్వామిక వాదులందరికీ విజ్ఞప్తి చేస్తూ MLA. లు శ్రీ ఎ. శ్రీరాములు, శ్రీ కె. రంగదాసు. MLC. శ్రీ వి. పి. రాఘవాచారి, ఆం.ప్ర. పౌ.హ.సం. ప్రధాన కార్యదర్శి శ్రీ పత్తిపాటి వెంకటేశ్వర్లు సంయుక్తంగా ఒక ప్రకటన చేశారు.

*　　*　　*

మేరంగి గ్రామప్రజలు 500 మంది సాయుధ ప్రదర్శన :

ధనస్వాముల కుట్రల్ని ధ్వంసంచేసిన మేరంగి గ్రామ ప్రజల సంఘటితశక్తి 500 మంది సాయుధ ప్రదర్శన. పెద్ద భూస్వామిఅయిన స్థానిక టూరింగ్ యజమాని, తన టూరింగ్ టాకిస్ కొంతమంది రౌడీలు యిద్దరు అయాయక పాలేర్లను దారుణంగా కొట్టినా ఏమీపట్టనట్టుగా ప్రవర్తించాడు. మరునాడు గ్రామ కూలీసంఘ నాయకత్వాన విప్లవనినాదాలతో పోరాట పాటలతో కవాతుచేసుకుంటూ అక్కడికిపోయి ఆ సినిమా హాలు యజమానిచే క్షమాపణ చెప్పించారు. పాలేర్లను కొట్టిన రౌడీలనప్పగించవలసిందిగా హెచ్చరించారు. ఆ మరునాడు ఆ రౌడీలు సంఘ నాయకత్వాన్నికలసి తమను క్షమించవలసిందిగా వేడుకున్నారు.

మే ఒకటవ తేదీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా వరంగల్ విప్లవ కార్మికులు, విప్లవ విద్యార్థులు బహిరంగసభ ఏర్పాటు చేశారు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌నుండి చరిత్రాత్మకమైన వరంగల్ జగదీశ్‌నగర్‌దాకా ఊరేగింపు జరిగింది. సాయుధ పోరాటమే ఏకైకమార్గం, చారుమజుందార్ అమర్ హై. సాయుధ విప్లవం వర్ధిల్లాలి అనే విప్లవనినాదాలతో 5 మైళ్ళపొడవునా ఊరేగింపు నడిచింది ఊరేగింపులో కార్మికులు, విద్యార్థులు గొంతు గొంతు కలిపి నినదించారు. బహిరంగసభకు విప్లవ కార్మికుడు వెంకటాద్రి అధ్యక్షతవహించారు విద్యార్థి బోస్ ఇది సాయుధ విప్లవసందేశం పాటతో సభ ప్రారంభమైంది. చైతన్యవంతమైన వాతావరణంలో విరసం సభ్యులు ఆర్.వి.బి. శర్మ. లోచన్‌లు ప్రసంగించారు ఆర్.ఎస్.యు. నాయకులు జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌లు విప్లవంలో కార్మికులతో విద్యార్థులు మమేకంకావల్సిన ఆవశ్యకతను గూర్చి మాట్లాడారు. మూడువేలమందికి పైగా హాజరైన సభలో జననాట్యమండలి పాటలు బాగా రక్తికట్టాయి. విరసం గాయకుడు ఎన్.కె. పాడిన "చెల్లీచెంద్రమ్మా" పాటను జనం మంత్రముగ్ధులై విన్నారు. తత్వగీతంశైలిలో ఒక ప్రెస్సు కార్మికుడు పాడిన "ఇందిరమ్మా"పాట జనబాహుళ్యాన్ని ఆకర్షించింది. తర్వాత 'వీధిభాగవతం' ప్రదర్శన జరుగుతున్నంతసేపూ జనం ఆసాంతం కుతూహలంగా చూశారు. సభాకార్యక్రమం రాత్రి గం. 12-30 కు ముగిసింది. చరిత్రాత్మకమైన "జగదీష్‌నగర్"లో మరోమారు విప్లవ నినాదాలు ప్రతిధ్వనించాయి. ఒక పుస్తకంలో కారల్‌మార్క్స్ అన్నట్టు "అవి విజయంసాధించేదాకా మళ్ళీ మళ్ళీ ప్రతిధ్వనిస్తూనేవుంటాయి."

• • •

విశాఖలో భారత్ హెవీప్లేట్స్ అండ్ వెస్సల్స్ కర్మాగారానికి చెందిన 3500 మంది కార్మికులు ఏప్రిల్ 7 నుండి సాధారణ కోర్కెల కొరకు సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం ఆ సమ్మెను నిషేధించి వారిని అణచివేయచూస్తున్నది.

• • •

హన్మకొండ లోకల్‌బస్ కండక్టర్‌పై ఎస్.పి. క్యాంప్ క్లర్క్ చేయిచేసుకున్నాడు. టికెట్టు లేకుండా ఎక్కుతున్నందుకు అభ్యంతరపెట్టిన కండక్టరును పొగరుబోతుతనంతో కొట్టాడు. పోలీసులకు ఫిర్యాదుచేసినా లాభంలేకపోగా కండక్టర్‌తోపాటు డ్రైవర్‌నుగూడా లోపలవేస్తామని బెదిరించారు. బస్సులోని పాసింజర్లుఎవరైనా కండక్టరుకు అనుకూలంగా మాట్లాడితే చంపేస్తామని బెదిరించారు. దీనితో ఆర్‌టిసి కార్మికులు 21 గంటలపాటు పని బంద్‌చేశారు. క్యాంపుక్లర్కుపై, పోలీసుల తొత్తు, టిస్మాన్‌పై తగినచర్యతీసుకుంటామని మేనేజిమెంటు రాసిచ్చినతర్వాతనే వారు పనిలో చేరారు.

అమరవీరుడు, విప్లవమేధావి జార్జిరెడ్డి 3వ వర్ధంతి ఏప్రిల్ 14వ తేదీన వరంగల్ సెంట్రల్ జెయిలులోని విప్లవకారులు జరుపుకున్నారు. 'జార్జిరెడ్డి అమర్ హై, భారత రైతాంగ సాయుధపోరాటం వర్ధిల్లాలి' అనే నినాదాలతో జైలు ప్రతిధ్వనించింది. అదే జెయిలులో విప్లవకారులచే ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల సాయుధ పోరాట 6వ వార్షికోత్సవం జరిగింది. ఉత్సాహపూరితంగా అమరవీరులకు జోహార్లర్పించారు. ఆ విప్లవ పోరాటాల విప్లవసాంప్రదాయాన్ని కొనసాగిస్తామని ఎగరేసిన ఎర్రజెండాకింద ప్రతిజ్ఞ తీసుకొన్నారు. చరిత్రాత్మకమయిన ఏప్రిల్ 22ను వరంగల్ సెంట్రల్‌జైల్లో వున్న నక్సలైట్ ఖైదీలు లెనిన్ జయంతిగా, భారత కమ్యూనిస్టుపార్టీ(మా-లె)అవతరణదినంగా తెల్లవారుతూనే ఎర్రజెండా ఎగరేసి నినాదాలతో, పాటలతో ఉత్తేజకరంగా జరుపుకున్నారు.

• • •

జార్జిరెడ్డి వర్ధంతిసభ జరుగకుండా వరంగల్‌జిల్లా అధికారుల పోలీసుల కుట్ర:

14-4-75న అమరుడు జార్జిరెడ్డి వర్ధంతి సభకు పోలీసులు మొదట అనుమతిచ్చి తరువాత పిరికితనంలో వణికిపోతూ, మీటింగ్ జరగకుండా చేయడానికి 144వ సెక్షన్ పెడుతున్నామని తుగ్లక్ ఆర్డర్ జారీచేసి కుట్రపన్నారు. పట్టణాన్నంతా కూడా ఆరోజు పోలీసు క్యాంపుగా మార్చారు. పోలీసుల గూండాయిజానికి వ్యతిరేకంగా ఎలా పోరాడాలో విద్యార్థిలోకానికి జార్జి నేర్పివున్నాడు, ఆ పోరాటబాటలోనే మేమూ పయనిస్తాం. మీ ఆటలు కట్టిస్తాం.

పోస్టర్లు రాయడం నేరమైనట్లు ఏప్రిల్ 14వ తేదీ తెల్లవారుజామున వి.ర.సం. సభ్యుడు శ్రీ జ్ఞానేశ్వర్‌తోపాటు నలుగురు పి.డి.ఎస్.యు. విద్యార్థులనుకూడా పోలీసులు అరెస్టుచేసి కస్టడీలో హింసించడాన్ని రాడికల్ విద్యార్థులు, విరసం వరంగల్‌శాఖకూడ తీవ్రంగా ఖండిస్తున్నారు.

వి.ర.సం; రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, వరంగల్.

కొత్తగా ఏర్పడే ప్రజా సాంస్కృతిక దళాలు ఎదుర్కొనే
సమస్యల పరిష్కారం కొరకు చదవండి!

జననాట్యమండలితో సృజన ఇంటర్వ్యూ

(వెనుక కవర్ పేజీపై "ఓరోరి అమీనోడా" పాటతో)

వెలువడింది వెల 20 పైసలు

ప్రతులకు: 'సృజన' హనుమకొండ, వరంగల్-506001

జననాట్యమండలి సభ్యులను అరెస్టుచేసి జనం గుండెల్లో మారుమోగుతున్న వారి పాటల్ని ఆపగలవా?

నిన్న ప్రజా రచయిత శ్రీశ్రీని అరెస్టు చేసి ప్రజాసాహిత్యాన్నే బంధించి, ప్రభుత్వ తెలుగు మహాసభలని జరిపానని మురిసిపోయాడు వెంగళ్రావ్. నేడు పీడిత ప్రజల వర్గకసిని ఊపిరిగా గానంచేస్తున్న హైద్రాబాద్ జననాట్యమండలిని మే 2న ప్రదర్శన ఇవ్వబోతుండగా అరెస్టుచేసి ప్రజాసంస్కృతిని పూర్తిగా అణిచి వేశానని చంకలు గుద్దుకుంటున్నాడు. కాని ఇవ్వాళ ఆంధ్రదేశంలో నలుమూలలా విప్లవప్రజానీకం నోళ్ళల్లో అనుదినం ఆడుతూ పదునెక్కుతున్న ఆ పాటలు రేపు వెంగళ్రావ్ గుండెల్లో ఈటెలు. జననాట్యమండలి వారిని అరెస్టు చేసినా గాలికన్నా వేగంగా ప్రజల్లోకి చొచ్చుకుపోతున్న వారి పాటల్ని ఆపగలవా వెంగళ్రావ్?

— విప్లవ రచయితలు, వరంగల్.

విప్లవ పథంలో జనచైనా సాధిస్తున్న
బ్రహ్మాండమైన విజయాలను గురించి
తెలుసుకొనేందుకు చదవండి

NEWS AND VIEWS ON CHINA

(Bimonthly Bulletin of China Study Circle)

For Copies

Navayuga Book House,
Sultan Bazar, Hyderabad - 500001

Kagada Book house
Chikkadpally, Hyderabad - 500020

SRJANA Telugu Monthly May '75 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

దక్షిణ వియత్నామ్ జాతీయ విముక్తి సేనల గీతం *

పదండిరా। పదండిరా। పదండి పదండి పదండిరా।
దక్షిణాదిని విముక్తి చేద్దాం। విజయపతాకను ఎగరేద్దాం।
పదండిరా। పదండిరా। పదండి పదండి పదండిరా।

మన రక్తం పిండిన, ఎముకలు విరిచిన
మాతృదేశమును ముక్కలు చేసిన
అమెరిక పిశాచి పీచమణచగ
దేశద్రోహుల భరతంపట్టగ
పట్టలేని పగ ప్రజ్వరిల్లగ ॥పదండిరా॥

పేరులగన్న మెకాంగ్ నదీ, పేరెన్నికగన్న పర్వతశ్రేణులు
శత్రుమూకలను అంతంచేయమని
ఆలాపించును, ఆదేశించును
కలిసి కట్టుగా పోరుచేయుదాం।
మన జెండానీడలో ముందుకె పోదాం। ॥పదండిరా॥

తుఫానులెన్నయినా, జలప్రళయాలెన్నయినా
సాహసించుదాం। సాగిపోవుదాం।
కత్తి కఠార్ రైఫిళ్ళనుబట్టి
కదనరంగమున కదం తొక్కుదాం।
మాతృదేశ భవితవ్యం కోసం
గుండెనెత్తురులు తర్పణ చేద్దాం।
తుదివిజయం ఎంతో దూరం లేదోయ్।
అవిగవిగో అరుణోదయ తొలికాంతులు ॥పదండిరా॥

(స్వేచ్ఛానువాదం: శివసాగర్)

★ "వియత్నాం స్టడీస్" నుండి. రచయిత కామ్రేడ్ హ్యూన్ మిన్ సిన్ దక్షిణ వియత్నాం తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో సాంస్కృతిక సమాచారశాఖామంత్రి.